
శత్రువులపై కందిరీగల దండు

2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 3 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 148 | పేజీలు:12 | వెల రూ.5

2-3 రోజుల్లో కేరళకు నైరుతి

2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA




## ఢిల్లీలో వేడుకలు

- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రపంచ స్థాయి లక్ష్యాలు
- తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా. శశాంక్ గోయల్

**హైదరాబాద్, జూన్ 02, (మనం బ్యూరో) :** దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా.శశాంక్ గోయల్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పారదర్శక విధానాలతో పెట్టుబడులకు అనుకూల గమ్యస్థానంగా మారిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రపంచ స్థాయి లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే పారిశ్రామిక, పర్యాటక, గ్రీన్ ఎనర్జీ పాలసీలను సిద్ధం చేసిందనీ, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలు తీరును వివరించారు.ఢిల్లీలోని తెలంగాణ భవన్ కేవలం పరిపాలనా కేంద్రం మాత్రమే కాదనీ, సంక్షోభ సమయాల్లో ఆపదలో ఉన్న వారికి తక్షణ సాయం అందించే సహాయ కేంద్రంగా విశేష సేవలు అందిస్తోందని గుర్తు చేశారు. నిరంతరం శ్రమిస్తున్న ప్రోటోకాల్, సమాచార, పౌర సంబంధాల, పర్యాటక శాఖ అధికారులకు ఈసందర్భంగా డా.శశాంక్ గోయల్ కృతజ్ఞతలు తెలిపారు.

**అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం : గవర్నర్** 9

# మేం పాలకులం కాదు
# ప్రజా సేవకులం

## కాళోజీ మాటలే స్ఫూర్తిగా పాలన సాగిస్తున్నం

- అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం
- ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు మా వెంటే నిలబడ్డరు
- అన్ని వర్గాల ప్రజల్లో మార్పు తెచ్చేందుకే తెలంగాణ విజన్
- బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే హామీల అమలు
- ఆత్మగౌరవం సామాజిక స్వేచ్ఛ కోసమే తెలంగాణ పోరాటం
- నాటి రాచరిక పాలన, నిన్నటి నియంతృత్వ పాలనకు ముగింపు
- కోట్లాది ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ
- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి





**హైదరాబాద్, జూన్ 02 (మనం బ్యూరో) :** పుట్టుక నీది... చావు నీది...బతుకంతా దేశానిది అన్న ప్రజా కవి కాళోజీ మాటలే స్ఫూర్తిగా బాధ్యతలు స్వీకరించిన క్షణం నుండి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్రముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరెన్ని విమర్శలు, కుట్రలు చేసినా ప్రజలు అండగా నిలవడం ఎనలేని శక్తిని ఇచ్చిందనీ, ప్రజల సంక్షేమం పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల మా బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఒక ఎత్తు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం మరో ఎత్తు. దశాబ్దాలు ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నది కేవలం సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం ఈ గడ్డపై ప్రతి బిడ్డ పోరాటంచేశారని స్పష్టం చేశారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముందుగా సీఎం జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆహూతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ పెత్తందారీ తనానికి వ్యతిరేకంగానే పోరాటాలు జరిగాయనీ, నాటి రాచరికం నుంచి నిన్నటి నియంతృత్వం వరకు తెలంగాణ తిరుగుబాటు చరిత్ర మొత్తం చెబుతున్న సత్యం ఇదే. ఆ చరిత్రకు మనం సాక్షులం. రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి కొత్త చరిత్రను రాసుకోవడం కోసం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారని వ్యాఖ్యానించారు. ఈ రోజు ప్రజల మనోభావాలకు మేం ప్రతినిధులం. సమాజ ఆకాంక్షలకు మేం వారధులం. అందుకే మీరిచ్చిన ఈ అవకాశాన్ని మేం అధికారం.. అని సంభోదించడం లేదు. మమ్మల్ని మేం పాలకులుగా అనుకోవడం లేదు. మీకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం. ప్రభుత్వం అంటే నలుగురు చేతుల్లో పెత్తనం కాదు... నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ప్రతినిధి.. అని మేం భావిస్తున్నాం... బాధ్యతగా పని చేస్తున్నాం. అందుకే ఇది కేవలం పరిపాలన చేసే ప్రభుత్వం కాదు... ప్రజాస్వామ్య ఆకాంక్షలను నెరవేర్చే ప్రజా ప్రభుత్వం అని గర్వంగా చెబుతున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడానికి ప్రాధాన్యతనిస్తూ వస్తోందని, రకరకాల అడ్డంకులు అధిగమిస్తూ 30 నెలల్లోనే ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నామన్నారు.సాగు భూమి, వ్యవసాయం, రైతు ఈ మూడు తెలంగాణకు ఊపిరి నీ వ్యవసాయం - వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు - అనుబంధ రంగాల విషయంలో తెలంగాణ నెంబర్ వన్ గా ఉండాలన్న లక్ష్యంతో, రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తేవాలన్న సంకల్పంతో తెలంగాణ రైజింగ్ - 2047 విధాన

...మిగతా 2లో

## ఎబోలా కలవరం

### కేంద్రం కీలక అడ్వైజరీ

**ఢిల్లీ, జూన్ 2:** కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినా.. లేదా ఆ దేశాల మీదుగా వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన చేసింది. భారత్‌లో ఇప్పటివరకు ఎబోలా కేసులు ఏవీ నిర్ధరణ కాలేదని స్పష్టంచేసింది. ఎవరైనా గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశం నుంచి వచ్చినా, లేదా ఆ దేశం మీదుగా ప్రయాణించినా.. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. వెంటనే ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలని తెలిపింది. ముందస్తు సమాచారంతో.. మీ ప్రాణాలను కాపాడటంతో పాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని వెల్లడించింది. ఈ సందర్భంగా అధికారుల సాయం కోసం 1075 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని పేర్కొంది.

### వారు భారత్‌లో ఉండాలంటే..
## ముందే రిజిస్టర్ చేసుకోవాలి

- హోంశాఖ కొత్త రూల్

**ఢిల్లీ, జూన్ 2:** ఇమిగ్రేషన్ నిబంధనల్లో హోంశాఖ కీలక మార్పులు చేసింది. విదేశీయులు అనుమతి పొందిన సమయం కన్నా ఎక్కువ రోజులు భారత్‌లో




ఉండాలంటే వారి వీసా గడువు ముగియకముందే విదేశాంగశాఖ వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. ఈ మేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. భారత్‌కు 180 రోజులు అంతకంటే తక్కువ గడువు వీసాలపై వచ్చే విదేశీయులకు ఈ నిబంధన వర్తిస్తుంది. వీరు భారత్‌లో కొనసాగాలంటే వీసా గడువు ముగియకముందే రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోవాలి. గతంలో వీసా గడువు పూర్తైన తర్వాత 14 రోజుల్లోపు పొడిగింపునకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండేది. కాని ఇప్పుడు ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. భారత్‌లో ఉన్న విదేశీ పౌరులపై పర్యవేక్షణకు ఈ నిబంధన ఉపయోగపడనుంది. భారత్‌లో

...మిగతా 2లో

## పెళ్లయిన కుమార్తెలకు కారుణ్య నియామకం

### బాంబే, కర్ణాటక కోర్టుల తీర్పుతో ఏకీభవించిన సుప్రీం కోర్టు



**ఢిల్లీ, జూన్ 2:** కారుణ్య నియామకాల విషయంలో మంగళవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. వాటి విషయంలో వివాహితురాలైన కుమార్తెను మినహాయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ నియామకాలకు సంబంధించి కుటుంబ నిర్వచనంలో వివాహితురాలైన కుమార్తె భాగం కాదంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తాజాగా సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అర్హత ఉన్న కుమార్తెకు.. పెళ్లయిందన్న కారణాన్ని సాకుగా చూపి కారుణ్య నియామకాన్ని నిరాకరించడం సరికాదని బాంబే, కర్ణాటక హైకోర్టులు గతంలో ఇచ్చిన తీర్పులతో ఏకీభవిస్తున్నట్లు వెల్లడించింది. కారుణ్యం ఆధారంగా తనకు ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్

...మిగతా 2లో

### మాటల మంటలు

## తెలంగాణ మీ అయ్య జాగీరా..?



- బరాబర్ తిరుగుతాం... ప్రశ్నిస్తాం
- ఎన్నికల్లో జనసేన పోటీ చేస్తుంది
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్
- అవును మా అయ్య జాగీరే మంత్రి పొన్నం
- కాంగ్రెస్‌ది ఎమర్జెన్సీ మైండ్‌సెట్ రామచందర్‌రావు
- మ్యాచ్ ఫిక్సింగ్ : జగదీష్‌రెడ్డి

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** 'హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావ్?, ఇక్కడ నీకేం పని అని కొందరు నన్ను ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణ ఏమైనా మీ (వాళ్ల)అయ్య జాగీరా? ఇలాంటి బెదిరింపులకు భయపడే వ్యక్తిని నేను కాదు?,' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏపీలో కూడా తనను తిరగనివ్వబోమని బెదిరించినప్పుడు, తన 'వారాహి' వాహనానికి అనుమతులు ఇచ్చి అండగా నిలబడింది తెలంగాణ సమాజమేనని పవన్ గుర్తుచేశారు. జనసేన పార్టీ పుట్టిందే తెలంగాణ నడిబొడ్డున అని, ఈ గడ్డ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనకు ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... తెలంగాణ గడ్డతో తనకు రాజకీయాలకు అతీతమైన అనుబంధం ఉందని, ఈ ప్రాంతంపై ఎనలేని ప్రేమ ఉందని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. తనపై కొందరు చేస్తున్న విమర్శలు, బెదిరింపులకు భయపడనని ఆయన అన్నారు. ఈ మేరకు మంగళవారంనాడు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పవన్ ఘాటుగా స్పందించారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని సంచలన ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరలేపారు. ఈ ప్రాంతీయ ద్వేషం దేశానికి మంచిది

...మిగతా 2లో



### ఓఎస్ఎం వివాదం.. సీబీఎస్ఈ

## ఛైర్మన్, కార్యదర్శిపై బదిలీ వేటు

**ఢిల్లీ, జూన్ 2:** సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. సీబీఎస్ఈ ఛైర్మన్ రాహుల్ సింగ్, బోర్డు కార్యదర్శి హిమాంశు గుప్తాలను బదిలీ చేసింది. ఈ ఘటనపై విచారణకు కమిటీని ఏర్పాటు చేసింది. రాహుల్ సింగ్ మొత్తం సీబీఎస్ఈ బోర్డు పనితీరు, పరిపాలన బాధ్యతలను నిర్వర్తిస్తుండగా..హిమాంశు బోర్డుకు సంబంధించిన చట్టపరమైన విషయాలు, ఆడిట్, ప్రజా సంబంధాలు వంటి విభాగాలను చూసుకుంటున్నారు. ఓఎస్ఎం వ్యవస్థ అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్‌తో పాటు సీబీఎస్ఈ చీఫ్ రాహుల్ సింగ్‌కు నేడు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది.

## ఆమెను 600 మంది రేప్ చేశారు

### పాకిస్థాన్ ముఠాల ఆగడాలపై బ్రిటన్ ఎంపీ రూపెర్ట్ లోవ్

**లండన్, జూన్ 2:** బ్రిటన్‌లో లైంగిక వేధింపుల ముఠాల అరాచకాలపై అక్కడి చట్టసభ మరోసారి చర్చించింది. అనేక రాష్ట్రాల్లో చిన్నారులు, మహిళల లైంగిక దోపిడీకి సంబంధించి స్వతంత్ర దర్యాప్తు నివేదికలోని సంచలన విషయాలను బాహ్య ప్రపంచం ముందుంచింది. వ్యవస్థీకృత ముఠాల వేధింపులు, అత్యాచారాలు, పోలీసులు వ్యవహరించిన తీరు, తదితర అంశాలపై బాధితులు, సాక్ష్యులు ఇచ్చిన వాంగ్మూలాలను కొందరు చట్టసభ సభ్యులు వివరించారు. అయితే, ఈ దారుణాలకు పాల్పడిన వారిలో ఎక్కువశాతం పాకిస్థాన్ మూలాలున్న ట్యాక్సీ డ్రైవర్లు, వ్యాపారులే ఉన్నట్లు గతంలో తేలిన విషయం తెలిసిందే.

బ్రిటన్ పార్లమెంట్ సభ్యుడు రూపెర్ట్ లోవ్ మాట్లాడుతూ.. ''లైంగిక దాడులకు గురైన వారిలో ఎంతో మంది చిన్నారులు, మహిళలు ఉన్నారు. మైనర్‌గా ఉన్నప్పుడే తనపై లైంగిక దాడి జరిగిందని ఓ బాధితురాలు చెప్పింది. మూడేళ్లలో ఆమెపై 600-700 మంది అత్యాచారం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. తన ప్రైవేటు భాగాలను తీవ్రంగా గాయపరిచినట్లు మరో మహిళ పేర్కొంది. బాధితులను జంతువుల్లా చూసినట్లు అనేక మంది చెప్పారు. శ్వేత జాతీయులనే లక్ష్యంగా చేసుకొని ఈ ముఠాలు లైంగిక హింసకు పాల్పడ్డాయని మరికొందరు బాధితులు వాంగ్మూలం ఇచ్చారు. కొందరు పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపైనా అనేక ఆరోపణలు ఉన్నాయి'' అని వివరించారు. ఇలాంటి దురాగతాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని చట్టసభ సభ్యులకు విజ్ఞప్తి



చేశారు. బ్రిటన్‌లో లైంగిక వేధింపుల ముఠా అరాచకాల విషయం 2002లో తొలిసారి వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ మూలాలున్న అనేక మంది.. దేశవ్యాప్తంగా కొన్ని వర్గాల అమ్మాయిలను లక్ష్యంగా చేసుకొని లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సౌత్ యార్క్‌షైర్‌లో 2010లో కొందరు మైనర్ అమ్మాయిలను వేధించిన కేసులో పాక్ మూలాలున్న ఐదుగురు దోషులుగా తేలడం అప్పట్లో సంచలనం రేపింది. అనంతరం రోచ్‌డేల్, రోథర్‌హ్యామ్, ఓల్డ్‌హ్యామ్, టెల్ఫోర్డ్ తదితర ప్రాంతాల్లో జరిపిన దర్యాప్తులో ఈ వ్యవస్థీకృత ముఠాల దుర్మార్గాలు బయటపడ్డాయి. అయితే, చాలా కేసుల్లో పోలీసు అధికారుల పాత్ర కూడా ఉందని, బాధితుల ఫిర్యాదులపై సరైన చర్య తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

## సరిహద్దులో క్లియర్‌గానే ఉంది

### నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్



**ఢిల్లీ, జూన్ 2:** భారత్- నేపాల్ సరిహద్దు అంశం తాజాగా చర్చనీయాంశం అవుతోంది. సరిహద్దులపై నేపాల్ ప్రధాని బాలేంద్ర షా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ సమస్యను పరిష్కరించేందుకు తమ రెండు దేశాలు అంగీకారానికి వచ్చాయని, ఈ సరిహద్దు అంశాన్ని తాము చైనా, బ్రిటన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ''భారత్-నేపాల్ సరిహద్దుకు సంబంధించి నేపాల్ ప్రధాని చేసిన వ్యాఖ్యలు, తర్వాత ఆ దేశ విదేశాంగశాఖ చేసిన ప్రకటనను మేం గమనించాం. రెండు దేశాల సరిహద్దులో 98 శాతం గుర్తించినదే. పరిష్కారం కాని కొన్ని అంశాలు ఉన్నాయి. కాలక్రమంలో గండక్ నది ప్రవాహం మారడమూ ఈ అపరిష్కృత అంశాలకు ఓ కారణం. సరిహద్దు ఆక్రమణలు, ఎవరికీ చెందని భూభాగంలో చొరబాట్లు వంటి సమస్యలు ఉన్నాయి. ఈ సరిహద్దు అంశాలను పరిష్కరించుకోవడానికి ద్వైపాక్షిక యంత్రాంగం ఉంది. రెండు దేశాల వ్యవహారంలో మూడో పక్షం జోక్యం లేదని స్పష్టంగా తెలియజేస్తున్నాం'' అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

### నేను లేకపోతే..
## జైల్లో ఉండేవాడివి

### నెతన్యాహుపై ట్రంప్ ఫైర్

**వాషింగ్టన్, జూన్ 2:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫైర్ అయినట్లు తెలుస్తోంది. తాను లేకపోతే ఇప్పటికే జైల్లో ఉండే వాడివంటూ నెతన్యాహుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. లెబనాన్‌లోని హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ సైనిక చర్యల విషయంపై నెతన్యాహును ట్రంప్ మందలించినట్లు అమెరికా అధికారిక వర్గాలను ఉటంకిస్తూ అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలను ఖాళీ చేయాలని అక్కడి ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. అయితే, లెబనాన్‌పై దాడులు చేస్తే అమెరికాతో చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ బెదిరించింది. ఈ క్రమంలో నెతన్యాహుతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. టెల్ అవీవ్ చర్యలు.. ఇరాన్‌తో దౌత్య ప్రయత్నాలను దెబ్బతీస్తున్నాయని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచుతున్నాయని ట్రంప్ ఆందోళన వ్యక్తంచేశారనేది ఆ మీడియా కథనాల సారాంశం. 'నువ్వు పిచ్చివాడివి. నేను లేకుంటే నువ్వు జైలులో ఉండేవాడివి. నేను నిన్ను కాపాడుతున్నా. ప్రస్తుతం అందరూ నిన్ను ద్వేషిస్తున్నారు. నీ చర్యల వల్ల ఇజ్రాయెల్‌ను కూడా ఇష్టపడటం లేదు' అని నెతన్యాహుపై ట్రంప్ మండిపడినట్లు అవి పేర్కొన్నాయి. అదే సమయంలో 'అసలు నువ్వు ఏం చేస్తున్నావు..?' అంటూ ఇజ్రాయెల్ ప్రధానిపై ట్రంప్ గట్టిగా అరిచినట్లు వెల్లడించాయి.



...మిగతా 2లో

## 2-3 రోజుల్లో కేరళకు నైరుతి

**ఢిల్లీ, జూన్ 2:** నైరుతి రుతుపవనాలు మరో 2-3 రోజుల్లో కేరళను తాకనున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం ప్రకటించింది. అరేబియా సముద్రంలో నైరుతి, ఆగ్నేయ ప్రాంతాలకు, లక్షద్వీప్‌నకు, కేరళ.. తమిళనాడులోని కొన్ని భాగాలకు ఇవి విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. నైరుతి, పశ్చిమ-మధ్య, తూర్పు-మధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకూ రుతుపవనాలు పురోగమించే అవకాశాలున్నట్లు వెల్లడించింది. మే 26నే నైరుతి రుతుపవనాలు కేరళకు రావచ్చని ఐఎండీ తొలుత అంచనాలు వేసింది. మే 29న ఆ అంచనాలను సవరించి.. తదుపరి వారంలో ఇవి రావచ్చని తెలిపింది. ఎల్ నినో పరిస్థితుల వల్ల ఈసారి సాధారణం కంటే తక్కువగానే వానలు పడతాయని పేర్కొంది. పసిఫిక్ మహా సముద్ర ప్రాంతంలో ఎల్ నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబరులో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని వివరించింది.

భగభగమండుతున్న ఎండలతో దేశవ్యాప్తంగా అల్లాడిపోతున్న ప్రజానీకానికి మరికొన్ని రోజులపాటు నిరీక్షణ తప్పేలా లేదని ఐఎండీ ప్రకటన చెబుతోంది. రెండుమూడు రోజుల తర్వాతైనా రుతుపవనాలు కేరళకు వస్తాయా అని కొందరు నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మే 26, 28, జూన్ 1, 3... ఇలా అంచనా తేదీలు మారుతున్నాయి. కేరళలోని నిర్ణీత 60% ప్రాంతాల్లో వర్షాలు మొదలై, అరేబియా సముద్రం మీదుగా పశ్చిమ గాలులు నిర్దిష్ట వేగంతో నమోదై, తగినన్ని మేఘాలను ఉపగ్రహాలు గుర్తిస్తే రుతుపవనాలు వచ్చినట్లు ఐఎండీ ప్రకటిస్తుంది. ప్రస్తుతం ఈ గాలులు మరీ బలహీనంగా ఉండటంతో రుతుపవనాలు రావడం లేదు. కేరళకు కొద్దిరోజులు ఆలస్యంగా నైరుతి వచ్చినంతమాత్రాన మిగతా దేశానికి సమస్య మొదలైనట్లు కాదు. జూన్ 8 వరకు అవి రాకపోతేనే రుతుపవనాలు ఆలస్యమైనట్లు పరిగణిస్తారు.

## శత్రువులపై కందిరీగల దండు

### రూ.5లక్షల కోట్లతో డ్రోన్‌లు సిద్ధం చేస్తున్న అమెరికా

**వాషింగ్టన్, జూన్ 2:** ఇరాన్‌తో యుద్ధంలో డ్రోన్‌ల తాకిడికి ఎదురుదెబ్బలు తిన్న అమెరికా ఇప్పుడు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తన అమ్ములపొదిలోకి భారీఎత్తున చౌకబారు డ్రోన్‌లను చేర్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఏకంగా రూ.5 లక్షల కోట్ల వరకు వెచ్చించనున్నట్లు ఆ దేశ మీడియా కథనంలో పేర్కొంది. ఈ క్రమంలో వివిధ కంపెనీలు, డ్రోన్ రేసర్లు ప్రారంభించిన స్టార్టప్లకు నిధులు సమకూర్చడంపై దృష్టిపెట్టింది. దీంతోపాటు పెంటగాన్‌కు అవసరమైన డ్రోన్లు తయారుచేసే సంస్థలను ఎంపిక చేసేందుకు పోటీ పెట్టింది. దీనికి 'డ్రోన్ డామినెన్స్' అనే పేరును ఖరారు చేసింది. ఈ పోటీ ద్వారా కంపెనీలకు 1.1 బిలియన్ డాలర్లు సమకూర్చి 3,00,000 డ్రోన్లను తయారుచేయిస్తోంది. కాలిఫోర్నియాకు చెందిన నీరోస్ కంపెనీ, బ్రిటన్‌కు చెందిన స్కైకట్టర్స్ ఈ రకం డ్రోన్ల తయారీ రేసులో ముందంజలో ఉంది.

ఇప్పటికే ట్రంప్ కార్యవర్గం 54.6 బిలియన్ డాలర్లు (రూ.5 లక్షల కోట్లకు పైగా) వచ్చే ఏడాది రక్షణ బడ్జెట్ నుంచి సమకూర్చుకొనేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు పెంటగాన్ మొదలుపెట్టిన పోటీల్లో పరీక్షించిన డ్రోన్లు ఒక్కోటి సుమారు 5,000 డాలర్లు మాత్రమే. యుద్ధంలో వీటిని కోల్పోయినా పెద్దగా నష్టం ఉండకుండా చూసుకొంటోంది. ఈ పోటీలకు వచ్చిన డ్రోన్‌లను సైనిక సిబ్బంది వాస్తవ యుద్ధ రంగ పరిస్థితులకు అనుగుణంగా పరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో సుదూర లక్ష్యాలు, నిర్మాణాల్లో ఉండే టార్గెట్లపై ప్రయోగించారు. ఇప్పటివరకు జరిగిన తొలిరౌండ్‌లో 26 కంపెనీలు పోటీపడగా, బ్రిటన్‌కు చెందిన స్కైకట్టర్ విజేతగా నిలిచింది. దీనికి ఈ కంపెనీకి 2,500 డ్రోన్ల తయారీకి ఆర్డర్ లభించింది.

## నేను లేకపోతే జైల్లో ఉండేవాడివి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా నెతన్యాహు నిర్ణయాలను కూడా ప్రశ్నించారని పేర్కొన్నాయి. ఒక హెజ్బొల్లా కమాండర్‌ను హతమార్చేందుకు టెల్‌అవీవ్ చేస్తున్న సైనిక చర్యల్లో అనేకమంది లెబనీస్ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ఆందోళన వ్యక్తంచేసినట్లు కూడా వెల్లడించాయి. ఇక, నెతన్యాహుతో సానుకూలమైన సంభాషణ జరిగిందని ట్రంప్ తన ట్రూత్ సోషల్లో ఓ పోస్టు ద్వారా వెల్లడించారు. బీరుట్ వైపు ఇజ్రాయెల్ దళాలు వెళ్లవని హామీ ఇచ్చారు. ఈమేరకు హెజ్బొల్లా నాయకులతోను మాట్లాడినట్లు ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్‌పై సైనిక కాల్పులను ఆపేందుకు వారు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ కూడా వారిపై కాల్పులకు దూరంగా ఉంటుందని వెల్లడించారు. అయితే, నెతన్యాహు ప్రకటన ఇందుకు భిన్నంగా ఉంది. ఇజ్రాయెల్ నగరాలు, పౌరులపై దాడులు కొనసాగితే హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ట్రంప్‌నకు కూడా తెలియజేసినట్లు పేర్కొన్నారు.

## పెళ్లయిన కుమార్తెలకు కారుణ్య నియామకం

(మొదటి పేజీ తరువాయి)

లైసెన్స్ ఇప్పించాలంటూ ఒక మహిళా పిటిషనర్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. కుటుంబ నిర్వచనం నుంచి వివాహితురాలైన కుమార్తెను పక్కనపెడుతూ 2019లో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఆమె సవాలు చేశారు. తనకు వివాహం జరిగినప్పటికీ.. దివ్యాంగురాలైన సోదరిని చూసుకుంటూ, తల్లితో కలిసి ఆ దుకాణాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. తల్లి మరణం తర్వాత ఆమె లైసెన్స్‌కు దరఖాస్తు చేయగా.. అధికారులు తిరస్కరించారు. ప్రభుత్వ ఆదేశాలనే అలహాబాద్ హైకోర్టు సమర్థించగా.. ఆ తీర్పును సుప్రీం పక్కనపెట్టింది. ఆమెకు లైసెన్స్ నిరాకరిస్తూ జారీ చేసిన ఆదేశాలను తోసిపుచ్చింది. నాలుగు వారాల్లో ఆమెకు లైసెన్స్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

## అమెరికాలో 30 మంది భారతీయ ట్రక్ డ్రైవర్లు అరెస్టు..

**వాషింగ్టన్, జూన్ 2:** అమెరికాలో అక్రమంగా నివాసం ఉంటున్నవారిపై ట్రంప్ యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. తాజాగా అమెరికాలో ట్రక్ డ్రైవర్లుగా పనిచేస్తున్న 30 మంది భారతీయులను అక్కడి అధికారులు అరెస్టు చేశారు. వారిని త్వరలోనే అక్కడినుంచి బహిష్కరించేందుకు సిద్ధమయ్యారు.



యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఈ అరెస్టుల వివరాలను వెల్లడిస్తూ ఓ ప్రకటన జారీ చేసింది. దాని ప్రకారం.. గత నెలలో ఆరిజోనాలోని యూమా సెక్టార్‌కు చెందిన బోర్డర్ పెట్రోల్ ఏజెంట్లు 'ఆపరేషన్ చెక్‌మేట్'ను చేపట్టారు. ఇందులోభాగంగా అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న 52 మందిని అరెస్టు చేశారు. వారిలో 36 మంది సెమీ ట్రక్కులు నడిపేవారుగా గుర్తించారు. ఈ డ్రైవర్లలో 30 మంది భారతదేశానికి చెందినవారు కాగా.. మిగిలిన ఆరుగురు మెక్సికో, ఎల్ సాల్వడార్, రష్యాకు చెందినవారని తేలింది. వారి వద్ద కాలిఫోర్నియా, న్యూయార్క్, వాషింగ్టన్, వర్జీనియా రాష్ట్రాల నుంచి పొందిన వాణిజ్య డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్నాయి. మరికొందరి వద్ద అయితే అసలు లైసెన్సులే లేవు. వీరందరిపై ఫెడరల్ చట్టం ప్రకారం అధికారులు చర్యలు తీసుకున్నారు. త్వరలోనే వీరిని దేశం నుంచి బహిష్కరించనున్నారు. ఈ క్రమంలో భారత్‌కు చెందిన 30 మంది కూడా స్వదేశానికి తిరిగి రానున్నారు. వాణిజ్య ట్రక్కులు నడుపుతూ దేశంలో చట్టవిరుద్ధంగా ఉంటున్న వ్యక్తులను గుర్తించి, అరెస్టు చేయడమే ఈ 'ఆపరేషన్ చెక్‌మేట్' ఉద్దేశం. ప్రజా భద్రతకు, రోడ్లపై ప్రమాదాలను తగ్గించేందుకే ఈ ఆపరేషన్ను చేపట్టినట్లు యూఎస్ బోర్డర్ పెట్రోల్కు సంబంధించిన ఓ అధికారి వెల్లడించారు.

## మేం పాలకులం కాదు.. ప్రజా సేవకులం

(మొదటి పేజీ తరువాయి)



పత్రంలో ప్రాధాన్యత అంశంగా తీసుకున్నాం. ఈ విజన్ డాక్యుమెంట్ కేవలం కాగితాలపై ఉండే అక్షరాలు కాదు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, ఖమ్మం నుంచి కొడంగల్ వరకు హరిత తెలంగాణను ఆవిష్కరించే ఆలోచన. ఈ లక్ష్య సాధనలో తెలంగాణలోని ప్రతి రైతు, రైతు కూలీలే సారథులు. దీని కోసం ఈ విజన్ డాక్యుమెంట్ లో రూరల్ అగ్రికల్చర్ రీజనల్ ఎకానమీ గా అభివర్ణించి, అభివృద్ధి చేసేందుకు రూపొందించిన పత్రం ఇది. రైతులు కేవలం పంటలు పండించడమే కాదు... వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రణాళిక ఉంటుంది. అగ్రికల్చరల్ ఏకో సిస్టమ్ అభివృద్ధి చేసి, రైతులను శ్రీమంతులుగా చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. 2025-26 అంచనాల ప్రకారం మన ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 236.87 లక్షల మెట్రిక్ టన్నులుగా నమోదైంది. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో వరి, మొక్కజొన్న, పత్తి పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

పశు సంపద, మత్స్య రంగాలు గణనీయమైన వృద్ధి సాధించాయి. రైతులు విభిన్న పంటల ఉత్పత్తితో తెలంగాణను సకల పంటల క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.మన ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీలను అమలుకు శ్రీకారం చుట్టాం. ఆడబిడ్డల ఆశీస్సులతో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం తొలి పథకాన్ని ఆడబిడ్డల సంక్షేమం నుంచే మొదలు పెట్టింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందిస్తున్న మహాలక్ష్మి పథకం విజయపథంలో కొనసాగుతున్నది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ఆడబిడ్డలు దాదాపు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకోగలిగారు. ఇది నాకు ఎంతో సంతృప్తినిచ్చిన పథకం.

రికార్డు వేగంతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేస్తున్నామనీ,యువతకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టామన్నారు.లీగల్ సమస్యలు, లిటిగేషన్లకు ఆస్కారం లేకుండా కొలువుల భర్తీ చేశామనీఉద్యోగ నియామక ప్రక్రియలో పారదర్శకతను పునరుద్ధరించామని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తో పాటు ఇతర నియామక బోర్డులను పూర్తిగా సంస్కరించుకున్నామని తెలిపారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4తో పాటు మెగా డీఎస్సీ, వైద్యారోగ్య శాఖలో వరుసగా నియామకాలను చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేసి యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచాం. ఉద్యోగంలో చేరే ముందు అఖిల భారత సర్వీస్ అధికారులకు శిక్షణను అందించినట్లు తెలిపారు. పెత్తందారీ తనానికి వ్యతిరేకంగానే ఈ గడ్డపై పోరాటాలు జరిగాయనీ, నాటి రాచరికం నుంచి నిన్నటి నియంతృత్వం వరకు తెలంగాణ చరిత్ర చెబుతున్న సత్యం ఇదేనన్నారు. ఈ రోజు ప్రజల మనోభావాలకు మేం ప్రతినిధులం, అందుకే మమ్మల్ని మేం పాలకులుగా అనుకోవడం లేదు, మీకు సేవకులుగా బాధ్యత నెరవేరుస్తున్నామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణ మీ అయ్య జాగీరా..?

(మొదటి పేజీ తరువాయి)

కాదు. రేపు సూరత్‌లో తెలుగువారిని ఉండొద్దని?, గుజరాతీలు, నాందేడ్‌లో మన వారిని ఉండొద్దని మహారాష్ట్రీయులు అంటే దేశం నిలబడుతుందా? మనమంతా భారతీయులం అనే విషయాన్ని మర్చిపోవద్దు. తెలంగాణ కూడా భారత్‌లో అంతర్భాగమే' అని పవన్ స్పష్టం చేశారు. 'భారత రాష్ట్ర సమితిని కేసీఆర్ ఆంధ్రాలో ప్రారంభించినప్పుడు, నేను మనస్ఫూర్తిగా స్వాగతించాను. ఒక రాజకీయ పార్టీని దేశంలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు. గుంటూరులో బీఆర్ఎస్ కార్యాలయం పెట్టి, జనసేనలో పనిచేసిన నాయకుడిని అధ్యక్షుడిగా నియమించినా నేను ఆహ్వానించాను.

అలాంటప్పుడు, జనసేన తెలంగాణలో అడుగుపెట్టకూడదు అనడం ఎంతవరకు సబబు?.. నాకుప్రాంతీయత, కులం రంగులు పులిమి నన్ను అవమానిస్తారా? మీ ఇష్టానికి మీరు మాట్లాడితే, కనీసం బాధపడే హక్కు కూడా మాకు లేదా? మేం ఇంకా 'బాంచన్ దొర, నీ కాళ్లు మొక్కుతా' అని బతకాలా? పీకలు కోసుకుంటాం.. కానీ, అలాంటి భయంతో బతకలేం.. తెలంగాణలో ఆంధ్ర కాంట్రాక్టర్లు, ఆంధ్రాలో తెలంగాణ కాంట్రాక్టర్లు బాగున్నారు. వాళ్ల వ్యాపారాలు, అధికారాలు అన్నీ బాగున్నాయి. మధ్యలో నాలాంటి వాడిని మాట్లాడనివ్వకుండా చేసి, ప్రజలను బేవకూఫ్‌గాళ్లను చేస్తున్నారు. ఇది తెలంగాణ ప్రజలు గమనించాలి. నిజంగా నేను తెలంగాణకు రావొద్దని మీరు అనుకుంటే, అసెంబ్లీలో తీర్మానం పెట్టండి. పవన్ కళ్యాణ్ ఇక్కడ అడుగుపెట్టకూడదని తీర్మానం చేయండి. ఎలా చేస్తారో నేను కూడా చూస్తా అంటూ సవాల్ విసిరారు.

**విభజన తీరునే వ్యతిరేకించా?...**

తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకం కాదని?, పవన్ స్పష్టం చేశారు. 'రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే తాను వ్యతిరేకించాన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తానూ ఖచ్చితంగా తప్పుపట్టాను అని పేర్కొన్నారు. అంతేగానీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను తాను ఎప్పుడూ గౌరవించానన్నారు. ప్రజలు కోరుకున్న తెలంగాణ రాలేదని, సామాజిక తెలంగాణ రావాలన్నదే నా ఆకాంక్ష' అని వెల్లడించారు. ఒక విశ్లేశకుడు చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదాన్ని పట్టుకుని, ప్రెస్ క్లబ్‌లో పోటా పోటీ సమావేశాలు పెట్టి మరీ తనను తిట్టే స్థాయికి కొందరు దిగజారారని ఆవేదన వ్యక్తం చేశారు.

**సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్**

తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. 'హైదరాబాద్‌లో తాను చెరువును కబ్జా చేశానని ఆరోపిస్తున్నారు?.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నా.. సార్ ఆ భూమిని పరిశీలించండి. నేను ఆ కబ్జా చేశానని నిరూపణ అయితే, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకొని, తనపై కూడా చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు' అని పవన్ బహిరంగ సవాల్ విసిరారు. తనకు అధికారం మీద ఆశ లేదని, ఏపీలోనే తాను అధికారాన్ని ఆశించలేదని?, అలాంటిది తెలంగాణలో ఎందుకు ఆశిస్తానని ప్రశ్నించారు. వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ఏకైక లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**తెలంగాణ ప్రజలకు పవన్ క్షమాపణ చెప్పాలి?**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే ఇక్కడ సభలు నిర్వహించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగడాన్ని మేం ఆపడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే హైదరాబాద్లో సభ పెట్టాలనుకోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై మీడియాతో పొన్నం మాట్లాడుతూ... పవన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'గతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని పవన్ దెబ్బతీశారు. అలాంటి వ్యక్తి, తెలంగాణకు ఎంతో భావోద్వేగమైన ఆవిర్భావ దినోత్సవాన సభ ఎలా పెడతారు?' అని ప్రశ్నించారు. పవన్‌ను 'పెయిడ్ ఆర్టిస్ట్'గా అభివర్ణించిన పొన్నం, ఆయన పర్యటన వెనుక బీజేపీ వంటి ఇతర పార్టీల అజెండా ఏమైనా ఉందా అని అనుమానం వ్యక్తం చేశారు.

తెలంగాణలో జనసేన సభలకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. పవన్ కల్యాణ్ బహిరంగ సభకు అనుమతి ఇవ్వకపోవడం అప్రజాస్వామిక ధోరణి అని, ఇది కాంగ్రెస్ ఎమర్జెన్సీ మైండ్ సెట్‌కు నిదర్శనం అని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా సభలు పెట్టుకోవచ్చని, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరైంది కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు విమర్శించారు. తెలుగు రాష్ట్రాలు పరస్పర సహకారం, స్నేహభావంతో ముందుకెళ్లాలని, విభేదాలు కాకుండా అభివృద్ధి విషయంలో పోటీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీని గెలిపించడమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

**'పవన్-రేవంత్ మ్యాచ్ ఫిక్సింగ్?**

తెలంగాణ ఎవరి అయ్య జాగీరు కాదు? అంటూ జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన కామెంట్లు తెలంగాణలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. పవన్ వ్యాఖ్యలకు తెలంగాణ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కౌంటర్ ఇచ్చారు. జనసేన అధినేత, పొరుగు రాష్ట్ర డిప్యూటి సీఎం పవన్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి స్పందించారు. పవన్ వ్యాఖ్యలు అర్ధరహితంగా ఉన్నాయన్నారు. మిస్టర్ పవన్ కల్యాణ్ తెలంగాణ మా అయ్య జాగీరే.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజల జాగీరే అంటూ పవన్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ మాటల్లో అహంకారం కనిపించిందని, తెలంగాణపై పవన్ కు ఇంత అక్కసు ఎందుకని పొన్నం ప్రశ్నించారు. పవన కల్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్ అని ఎద్దేవా చేశారు.

4 నెలల క్రితం ప్రభుత్వం గెస్టుగా పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించామని, అప్పుడే మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఆంధ్రాలోనే గెలవలేని పవన్ కల్యాణ్ తెలంగాణలో ఏం చేస్తారని నిలదీశారు.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేయొద్దని పొన్నం ప్రభాకర్ హితవు పలికారు.

ఆఫ్టాల్ పవన్ మీటింగ్ పెడితే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందా అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి విమర్శించారు. ఆ సభకు అనుమతినివ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యం అని ఆరోపించారు. కాంగ్రెస్, పవన్ కలిసి మ్యాచ్ ఫిక్సింగ్ చేశారని, ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు చేస్తున్న డ్రామా ఇది అని ఆరోపించారు. పీకుతా..అంటూ పవన్ మాట్లాడడం సరికాదని, ఆయన ఇంత ఆవేశపడాల్సిన అవసరం లేదని అన్నారు.

## ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టులది కీలక పాత్ర



- మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడి
- తెలంగాణ మీడియా అకాడమీలో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్,జూన్ 02(మనం న్యూస్) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టులది కీలక పాత్ర అని, కవులు, కళాకారులు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు రాష్ట్రంలోని సబ్బండవర్ణాల ప్రజలు పాల్గొని రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందని మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు.

మంగళవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ప్రజల సుదీర్ఘ ఉద్యమానికి ఫలితమని పేర్కొన్నారు. సాధించుకున్న తెలంగాణలో స్వేచ్ఛ, ఆత్మాభిమానం ముఖ్యమని, మన రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందాలన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం మన రాష్ట్ర ముఖ్యమంత్రి గొప్పదనానికి నిదర్శనమని కొనియాడారు. అదే విధంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నారని, ప్రజా ప్రభుత్వం సేవలను ఆయన కొనియాడారు. అదే విధంగా మహిళా సాధికారిత కోసం మహిళలచే సూపర్ బజార్లు, పెట్రోల్ బంక్ ల నిర్వహణ, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుని మహిళాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని వెల్లడించారు. గ్రామీణ, పట్టణాలలో పని చేస్తున్న కార్మికులకు సమాన వేతనాలను అందేలా ప్రభుత్వం చట్టం చేసిందని,తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎందరో మహానుభావుల త్యాగం ఉన్నదన్నారు. ఈ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టులు, కవులు,కళాకారులు, ఉద్యోగులు, విద్యార్థులు సబ్బండవర్ణాల ప్రజలు పాల్గొని రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. అదే విధమైన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా జనగణమన గీతాలాపన, అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయం జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, సిబ్బంది లతాదేవి, ప్రసాద్, నరేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు టీబీఎంలో తొలగిన అడ్డంకి

- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

మార్కాపురం,జున్, 2,(మనం న్యూస్): వెనుక బడిన మార్కాపురం జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ప్రస్తుతం పూర్తి దశకు చేరుకుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రాజెక్టు సొరంగాల నిర్మాణానికి వినియోగించిన టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) తొలగింపు పనులు ప్రారంభమయ్యాయని, 2021లో మొదటి టీబీఎం మిషన్ను తొలగించగా ఇప్పుడు రెండో మిషన్ను కూడా విడిభాగాలుగా చేసి బయటకు తీస్తున్నారని అధికారులు వెల్లడించారన్నారు. ఈ రెండు మిషన్ల తొలగింపు పూర్తయితే సొరంగాల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు ఉండవని, తద్వారా వెలిగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి మార్కాపురం జిల్లాకు తాగునీరు, సాగునీరు పుష్కలంగా అందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న ఈ ప్రాంత రైతులకు వెలిగొండ ప్రాజెక్టు పూర్తవడం గొప్ప ఊరటనివ్వనుందని, వేలాది ఎకరాల మాగాణి భూములకు సాగునీరు అందడంతో వ్యవసాయం పుంజుకుని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న ఈ ప్రాజెక్టును వేగవంతం చేసి పూర్తి చేసే దిశగా ఎన్డీయే ప్రభుత్వం చూపిన చొరవ, అందించిన నిధులు, అనుమతులు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇకపై టీబీఎం గర్జన ఆగి, నీరు గలగలా పారే వేళ.. ఎడారి నేలలో పచ్చదనం చిగురించే వేళ.. వెలిగొండ పూర్తయ్యే శుభ ఘడియ దగ్గర్లోనే ఉంది. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల దాహం తీర్చేందుకు రాతి గుండెలను చీల్చుకుంటూ వచ్చే నీటి ధార.. మార్కాపురం మట్టిలో పడే ప్రతి బొట్టు రైతు కన్నీళ్లను తుడిచే అమృతధారగా మారనుందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

## ముందే రిజిస్టర్ చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

సంతానం ఉన్న విదేశీయుల కోసం మరో మార్పు చేసింది. భారత్‌లో బిడ్డ జన్మించిన 30 రోజుల్లోపు ఆన్‌లైన్ లేదా మొబైల్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కొత్త నిబంధన ప్రకారం తల్లిదండ్రుల్లో ఒకరు భారత జాతీయులై ఉండి.. తమ పౌరసత్వాన్ని ఉంచుకోవాలనుకుంటే మాత్రం అలాంటి వారికి బిడ్డ పుట్టుక రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపును ఇచ్చింది.

## టీటీడీ 33 విద్యాసంస్థల్లో ప్రవేశాలకు పటిష్ట చర్యలు

- మెరిట్, పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రవేశాల నిర్వహణ : జేఈవో (వైద్యం, విద్య) డాక్టర్ ఎ.శరత్

**తిరుపతి జూన్2 మనం న్యూస్:** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే సంకల్పంతో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33 విద్యాసంస్థల్లో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని టీటీడీ జేఈవో (వైద్యం, విద్య) డాక్టర్ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం అలిపిరిలోని ఎస్వీబీసీ కార్యాలయం నుండి టీటీడీ డీఈవో శ్రీ వెంకటసునీల్తో కలిసి కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేఈవో డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ, ఆలయాల నిర్వహణతో



పాటు విద్యా రంగానికీ సమాన ప్రాధాన్యతనిస్తూ టీటీడీ ఏడు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. తిరుపతితో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యాసంస్థలను విజయవంతంగా నిర్వహిస్తూ వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. విద్య ద్వారా యువతలో ఉపాధి అవకాశాలతో పాటు సామాజిక బాధ్యత, నైతిక విలువలు, ఉత్తమ వ్యక్తిత్వ వికాసంసాధ్యమవుతాయని వివరించారు.టీటీడీ విద్యాసంస్థల్లో ప్రవేశాల ప్రక్రియను మెరిట్, పారదర్శకత, జవాబుదారీతనం అనే మూడు ప్రధాన సూత్రాల ఆధారంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని జేఈవో తెలిపారు. అడ్మిషన్ల నిర్వహణ కోసం ప్రతి విద్యాసంస్థలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తిగా మెరిట్ ఆధారంగా, పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. కోర్సుల వారీగా సీట్ల లభ్యత, ఖాళీల భర్తీ, స్పాట్ అడ్మిషన్ల నిర్వహణ వంటి అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. అడ్మిషన్ ఫీజులను పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే స్వీకరించాలని, విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన సూచిక బోర్డులు, సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ డీఈవో వెంకటసునీల్ పాల్గొనగా, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## సర్‌పై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

### పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

**పుట్టపర్తి, జూన్ 2 మనం న్యూస్ :** టిడిపి కేంద్ర కార్యాలయంలో ఎస్ఐఆర్ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం వంటి అంశాలపై సీఎం మార్గనిర్దేశం చేసినట్లు సమాచారం. సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల పరిస్థితులను వివరించి, పలు అంశాలపై చర్చించారు

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి, కలెక్టర్



వరంగల్, జూన్2(మనంన్యూస్): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగామంగళవారం వరంగల్ లోని తూర్పు నియోజక వర్గం పరిధిలోని 21,32వ, డివిజన్లలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు గద్దల స్రవంతి, కిన్నెర సుశీల నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని నూతన గృహ ప్రవేశాలు చేసి రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గృహప్రవేశం చేసిన దంపతులకు నూతన వస్త్రాలను మంత్రి బహుకరించారు. ఇందిరమ్మ పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు సొంత ఇంటి కల నెరవేరడం ఆనందదాయకమని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఈ గృహప్రవేశ కార్యక్రమంలో జెడ్పి సి ఓ రాంరెడ్డి, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఆస్తులు, ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి కొండా సురేఖ




వరంగల్, జూన్ 2(మనంన్యూస్): రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికనా ఆర్థిక సహకారానికి పెద్దపీట వేస్తూ, పీడీ మెప్మావిభాగం ద్వారా 102 స్వయం సహాయక సంఘాలకు ఏకంగా రూ. 12 కోట్ల విలువైన బ్యాంక్ లింకేజీ చెక్కులను మంత్రి కొండా సురేఖ పంపిణీ చేశారు. అలాగే, డీఆర్డీఏ శాఖ ద్వారా 4 బ్యాంక్ లింకేజీ చెక్కులను అందించడంతో పాటు, ఎస్ఎన్ఈహెచ్ఏ గ్రూపులకు 11 సైకిళ్లను పంపిణీ చేశారు. సామాజిక సంక్షేమంలో భాగంగా, జిల్లా సంక్షేమ అధికారి పర్యవేక్షణలో ట్రాన్స్జెండర్లకు రూ. 75,000/- చొప్పున మొత్తం 8 సబ్సిడీ చెక్కులను అందజేశారు.

**విద్య మరియు పర్యావరణ రంగాలలో గుర్తింపు**

విద్యా మరియు పర్యావరణ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక గుర్తింపు లభించింది. డీఆర్డీఏ శాఖ ద్వారా వయోజన విద్యకు సంబంధించిన ఉల్లాస్ సర్టిఫికేట్లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్లలో పర్యావరణ పరిరక్షణలో అద్భుతమైన ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అదేవిధంగా, జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసా పత్రాలను బహుకరించారు.

# మిలియన్ మార్చ్‌ను తలపించేలా భూపోరాటం

- జులై 2న ఉప్పల్ భగాయత్ భూ పోరాటం చేస్తాం
- ఆగస్ట్ 6 లోగా ట్యాంక్ బండ్‌పై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలి? : టీఆర్ఎస్ చీఫ్ కవిత




హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలం కోసం మిలియన్ మార్చ్‌ను తలపించే భూ పోరాటాన్ని చేస్తామని తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ దేవనపల్లి(కల్వకుంట్ల) కవిత హెచ్చరించారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై విస్పష్ట ప్రకటన చేస్తారని భావించినప్పటికీ మరోసారి మోసం చేశారన్నారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కవిత మాట్లాడుతూ... అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటంతో సిద్ధించిన తెలంగాణలో వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం 12 ఏళ్లైనా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకోకపోవడం అన్యాయమని ఆమె దుయ్యబట్టారు. ఈ ఏడాది ఆగస్ట్ 6 లోపు ప్రొ. జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి కవిత అల్టిమేటం జారీ చేశారు.

**మిలియన్ మార్చ్ తరహాలో భూపోరాటం...**

ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను ఆవిర్భావ దినోత్సవం సందర్భంగానైనా అమలు చేస్తారని, అ దిశగా సీఎం రేవంత్ ఓ భారీ ప్రకటన చేస్తారని భావించినప్పటికీ, ఆయన మళ్లీ మోసం చేశారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం, అ అంశాలను ప్రస్తావించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కేకే కమిటీ విధివిధానాలను కూడా ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే? పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జులై 2న ఉప్పల్ భగాయత్ వేదికగా అతి పెద్ద 'భూపోరాటం' చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం లేదని, ఇది తెలంగాణ అస్తిత్వం, ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటమని స్పష్టం చేశారు. ఈ మహా సంగ్రామానికి రాష్ట్రంలోని మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, పత్రికా మిత్రులతో పాటు ప్రజలు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఊరికి ఒక్కరైనా సద్ది కట్టుకొని తరలిరావాలని కోరారు. 'మిలియన్ మార్చ్'ను గుర్తు చేసే విధంగా ఈ భూపోరాట ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కవిత పిలుపునిచ్చారు.

**ఆగస్ట్ 6 లోగా జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలి?..**

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని 12 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోకపోవడం అత్యంత అన్యాయమైన విషయమని కవిత అన్నారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసి, మలిదశ పోరాటానికి దిక్సూచిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు. తెలంగాణ జాగృతి తరఫున ఇప్పటికే 4 జిల్లాల్లో జయశంకర్ విగ్రహాలను ఏర్పాటు చేశామని కవిత గుర్తు చేశారు. అయితే రాష్ట్ర రాజధానిలో కూడా ఆయన విగ్రహం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో జయశంకర్ విగ్రహ ఏర్పాటు కోసం తెలంగాణ జాగృతి సంస్థ 2014 నుంచే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. 2017లో అప్పటి మున్సిపల్ శాఖకు కూడా అధికారికంగా లేఖ రాసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవటం బాధాకరమని,.. ఈ దుష్ట కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేన్నరేళ్లు గుచ్చిన వెంటనే ప్రతి అమరవీరుడి కుటుంబానికి 1 కోటి రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

ఉద్యమకారులందరినీ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఎందరో ఉద్యమకారుల పోరాటం, ప్రాణ త్యాగాలతోనే ఈ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఆమె గుర్తు చేశారు. ఉద్యమ చరిత్ర ఇప్పటి పిల్లలంతా కచ్చితంగా తెలుసుకోవాలని కవిత సూచించారు. జూన్ 2 అనేది హాలిడే కాదన్నారు. తెలంగాణ సమాజానికి ఎలాంటి వివక్ష లేకుండా, తమ సొంత యాసను తాము స్వేచ్ఛగా మాట్లాడుకునేలా చేసిన మహత్తరమైన రోజు అని అభిప్రాయపడ్డారు. మనమంతా సెకండ్ గ్రేడ్ పౌరులం కాదని నిరూపిస్తూ, ఎంతో స్వేచ్ఛగా బతికే చారిత్రక అవకాశం వచ్చిన రోజని పేర్కొన్నారు. అందుకే ఆగస్టు 15 వేడుకలను ఎంత గొప్పగా జరుపుకుంటామో.. జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని కూడా అంతే గొప్పగా జరుపుకోవాలని ఈ సందర్భంగా కవిత సూచించారు.

# తెలంగాణ తెచ్చింది ఆర్ట్స్ కాలేజే

- తెలంగాణ భవన్ కాదు?.. కేసీఆర్ కాదు?.. విద్యార్థులే
- రవి ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ తెచ్చింది? ముమ్మాటికి నూటికి నూరు శాతం ఉస్మానియా ఆర్ట్స్ కాలేజే?.. అక్కడి విద్యార్థులే?.. తెలంగాణ భవన్ కాదు?..కేసీఆర్ కాదు?.. ముమ్మాటికి విద్యార్థులే రాష్ట్రాన్ని సాధించారు అంటూ ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం వద్ద పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి హాజరయ్యారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్ట్స్ కాలేజీకి పుష్పాభిషేకం చేశామని ఆయన పేర్కొన్నారు. తామంతా ఏ స్వార్థం లేకుండా నిస్వార్థంతో మలిదశ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులే ముందుండి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని నడిపించారని ఆయన పేర్కొన్నారు. అలాంటి విద్యార్థుల త్యాగాల ఫలితంగా.. స్వరాష్ట్రంలో నేడు, ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు పాలకులు వచ్చిన ముందుండి ప్రశ్నించేది ఆర్ట్స్ కాలేజ్ మాత్రమే అని గుర్తు చేశారు. ఈ ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థులుగా ఉద్యమకారులుగా ఉన్నవారు? ముందు ముందు తెలంగాణ సమాజానికి నాయకత్వం వహించాలని పిడమర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బొరెల్లి సురేష్, ఓయూ జేఏసీ నాయకులు ఎండీ రహీం, బీఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్, ఓయూ నాయకులు ఆరె కంతి శ్రీకాంత్, ఎం. జేఏసీ నాయకులు మీసాల మహేష్, నక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.6

# మా అస్తిత్వాన్ని తుడిచేయాలని చూస్తే ఊరుకోం..

- సీఎం, కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించలేదు ప్రశాంత్ రెడ్డి అగ్రహం

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర సమాజం ఎంతో పోరాడి, ఎందరో అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని, ఇక్కడి అస్తిత్వాన్ని కనుమరుగు చేయడానికి కొన్ని శక్తులు మళ్లీ కుట్రలు పన్నుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2001లో కేసీఆర్ ఒంటిచేత్తో మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించి, అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో 14 ఏళ్ల పాటు అలుపెరుగని ప్రజాస్వామ్య పోరాటం చేసి తెలంగాణను సాధించారని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ సృష్టించిన రాజకీయ అనివార్యత వల్లే కాంగ్రెస్, టీడీపీలు లొంగివచ్చాయని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్గా నిలిపారని కొనియాడారు. అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుబంధును 'ఓట్లు ఉంటేనే' అన్న చందంగా మార్చిందని, రైతుబీమాను పక్కన పడేసిందని విమర్శించారు. మరోవైపు, పొరుగు రాష్ట్ర నేతల తీరుపై వేముల తీవ్రంగా ధ్వజమెత్తారు. టీడీపీ మహానాడు సభలో టి.టీడీపీ అధ్యక్షుడు బక్కని నరసింహులు మాట్లాడుతూ... 'డిక్షనరీలోనే తెలంగాణ పదం లేదు' అని మాట్లాడినా సీఎం రేవంత్ రెడ్డి కానీ, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కానీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. అలాగే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం తెలంగాణపై వెటకారాలు చేస్తున్నారని మండిపడ్డారు. నేడు, కేసీఆర్ అధికారంలో లేకపోవడం వల్లే వీరంతా ఇలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. గతంలో మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్ నైజం వల్లే వేలాది మంది బిడ్డలు బలి అయ్యారని, నాటి రేవంత్ రెడ్డి సోనియా గాంధీని 'బలిదేవత' అని విమర్శించి.. ఇవాళ మాయమాటలు చెబుతున్నారని ఎండగట్టారు.

మన ఉనికి ప్రశ్నార్థకం అవుతున్న వేళ, ఈ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో అవసరమైతే మరొక తెలంగాణ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# సమాజంలో మంచి పౌరులుగా జీవించండి

- డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా



హైదరాబాద్,మే 02(మనం న్యూస్): జైలు నుంచి విడుదలైన ఖైదీలు ఇక పై సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా సూచించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సత్ప్రవర్తన కలిగిన 91 మంది ఖైదీలను విడుదల చేసింది. ఈ సందర్భంగా చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి విడుదలైన ఖైదీలను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సౌమ్య మిశ్రా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖైదీలలో సత్ప్రవర్తన పెంపొందించేందుకు రాష్ట్రంలోని జైళ్లలో అనేక సంస్కరణలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలకు విద్య, ఉపాధి శిక్షణ అందించడం ద్వారా వారిలో సానుకూల మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు తెలంగాణ ప్రభుత్వం అర్హులైన ఖైదీల విడుదలకు పచ్చజెండా ఊపిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో 2024లో 213 మందిని, ప్రస్తుతం 91 మంది ఖైదీలను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం విడుదలైన 91 మంది ఖైదీలలో ఆరుగురు మహిళా ఖైదీలు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో 38 మందికి జైళ్ల శాఖ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు, ఇతర వాణిజ్య కార్యకలాపాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మిగిలిన వారు తమ వ్యవసాయం, కులవృత్తులు లేదా ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారని వివరించారు. విడుదలైన ఖైదీలు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు రవాణా సదుపాయాలు కూడా కల్పించినట్లు తెలిపారు. అనంతరం మహిళా ఖైదీలకు కుట్టు మిషన్లను అందజేశారు.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి:**

జీవిత ఖైదు శిక్ష అనుభవించిన వారికి ప్రభుత్వం కల్పించిన విడుదలతో జీవితంలో రెండో అవకాశం లభించిందని డీజీ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ, సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా జీవించాలనిసూచించారు. మరోసారి తప్పిదాలు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని, అలాంటి పరిస్థితి మళ్లీ ఎదురు కాకూడదని ఆకాంక్షించారు. విడుదలైన ఖైదీల జీవితాల్లో ఈ రోజు మరపురాని రోజుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**ఖైదీల్లో వెల్లివిరిసిన ఆనందం:**


విడుదలైన ఖైదీల్లో ఆనందం వెల్లివిరిసింది. జైలు ప్రధాన ద్వారం నుంచి బయటకు వచ్చిన పలువురు ఖైదీలు తమ కుటుంబ సభ్యులను ఆలింగనం చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జైలు నుంచి విడుదలైన పిట్ల నరేష్ మాట్లాడుతూ, జైళ్లలో అమలు చేస్తున్న సంస్కరణల వల్ల తాను ఎంతో ప్రభావితుడినయ్యానని తెలిపారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా చూపిన చొరవతో ఖైదీల విడుదల సాధ్యమైందని అన్నారు. గతంలో ఉన్న జైళ్లతో పోలిస్తే ప్రస్తుతం ఖైదీలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఖైదీల గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా జైలు అధికారులు రక్షణ కల్పిస్తున్నారని, వారిలో మార్పు తీసుకురావడానికి అమలు చేస్తున్న సంస్కరణ కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. చర్లపల్లి జైలు నుంచి విడుదలైన మరో ఖైదీ రషీద్ మాట్లాడుతూ, తాను జైలులో టైలరింగ్ నేర్చుకున్నానని, బయటకు వెళ్లిన తర్వాత అదే వృత్తిని కొనసాగిస్తూ ఉపాధి పొందుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు వై. రాజేష్, ఎన్. మురళీబాబు, డీఐజీలు డాక్టర్ డి. శ్రీనివాస్, ఎం. సంపత్, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, చంచల్గూడ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్, సంగారెడ్డి సూపరింటెండెంట్ సంతోష్కుమార్ రాయ్, వరంగల్ సూపరింటెండెంట్ కళాసాగర్, చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం సూపరింటెండెంట్ భరత్ తదితర జైలు అధికారులు పాల్గొన్నారు.

# డీజీపీ కార్యాలయంలో అవతరణ దినోత్సవ వేడుకలు



హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను డీజీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐజిపి (పి అండ్ ఎల్) గజరావు భూపాల్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ (లీగల్) సతీష్, ఏఐజి రమణ కుమార్, సీఎస్ఓ సి.హెచ్ యోగేశ్వరరావు, డీఎస్పీ ఉదయభాస్కర్ లతో పాటు డీజీపీ కార్యాలయానికి చెందిన పలువురు అధికారులు,సిబ్బంది పాల్గొని ఒకరికోకరు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



కల్వకుర్తి జూన్02(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం కల్వకుర్తి పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, జాతీయ పతాకాని ఆవిష్కరించారు.ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ ఎంపీ జనార్దన్ రెడ్డి, తాహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ ఇబ్రహీం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ షేక్ మహమూద్,ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,లతో పాటు మున్సిపాలిటీ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయకుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్,బీజేపీ పార్టీలు విమర్శలు

- దమ్ముంటే బీజేపీ నాయకులు కేంద్రం నుంచి నిధులు తీసుకురండి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి...



కల్వకుర్తి జూన్02(మనం న్యూస్): కల్వకుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ బిజెపి నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మండిపడ్డారు.మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్ర గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు 5 కోట్లు,వెల్దండ పాఠశాలకు 5 కోట్లు, మాడుగుల మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు 10 కోట్ల నిధులు,కల్వకుర్తి పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి 22 కోట్లు ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రికి 10 కోట్లు అభివృద్ధికి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్,బిజెపి నేతలకు వాస్తవ అభివృద్ధి కనిపించడం లేదా అని ఆయన విమర్శించారు.అదేవిధంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నాగిళ్ళ వరకు సాగు నీళ్లు అందించానని తెలిపారు.రైతుల సమస్యలు పరిష్కరించడంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి దృష్టి పెట్టిందని కేవలం రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందని రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారని ప్రశ్నించారు. దమ్ముంటే తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు.తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన, బీఆర్ఎస్ పదేళ్లపాటు యువతను మోసం చేసిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే 70 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు ఇచ్చిన పూర్తి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు వచ్చిన హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయకుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్,లతో పాటు మున్సిపాలిటీ కౌన్సిలర్లు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,వివిధ గ్రామాల సర్పంచ్లు,తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలతోనే తెలంగాణ వచ్చింది?

- కేసీఆర్ హయాంలో నిరంకుశత్వం
- ఏపీకి తాము వ్యతిరేకం కాదు
- కేసీఆర్ హయాంలో నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ కూడా ఇవ్వలేదు: కోదండరాం

హైదరాబాద్, మనం ప్రతినిధి : గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నిరంకుశ వైఖరి నడిచిందని ఎమ్మెల్సీ, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు కనీసం నిరసన వ్యక్తం చేసుకోవడానికి కూడా ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారని ఆయన మండిపడ్డారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నిజమైన ప్రజాస్వామ్య స్వేచ్ఛ వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నాంపల్లిలోని టీజేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ 12వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, రాష్ట్ర ఆకాంక్షలకు అడ్డుపడితే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. 60 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కోదండరాం ఈ సందర్భంగా గుర్తుచేశారు. నాడు అప్పటి పాలకులతో ప్రాణాలకు తెగించి కొట్లాడి స్వరాష్ట్రాన్ని తెచ్చుకున్నామని, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంలో నాడు యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, అప్పటి ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్ ఎనలేని కృషి చేశారని ఆయన కొనియాడారు. తెలంగాణ సాధనలో ప్రజలు ఏ విధంగా భాగస్వాములయ్యారో, ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధిలో కూడా ప్రజలంతా తమ వంతు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. సమసమాజ స్థాపన కోసం సాగే పోరాటంలో కలిసివచ్చే ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తామని, కానీ తెలంగాణ ప్రయోజనాలకు తూట్లు పొడవాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

ఇదే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత చాలా ప్రాముఖ్యమైనదని కోదండరాం వ్యాఖ్యానించారు. తాము ఎప్పుడూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వ్యతిరేకం కాదని, కేవలం తెలంగాణపై నాటి ఆంధ్ర పాలకుల పెత్తనాన్ని మాత్రమే తాము వ్యతిరేకించామని స్పష్టం చేశారు. అయితే ఇటీవల కాలంలో చిన్న చిన్న విషయాల్లో సైతం ఆంధ్రప్రదేశ్ నాయకులు ఇక్కడ తలదూరుస్తూ రాజకీయాలు చేయాలని చూడటం సరికాదన్నారు. రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు తప్పు కావొచ్చేమో కానీ, ఆయనకు ఉన్న సమాచారంతోనే ఆయన మాట్లాడారని.. దానికి సమాధానం చెప్పుకోవడానికి ఆయనకు ఒక అవకాశం ఇవ్వాలే తప్ప?... దాన్నే అడ్డుపెట్టుకుని ఆంధ్ర నాయకులు ఇక్కడి భావప్రకటన స్వేచ్ఛను అణచివేయాలని చూస్తే తెలంగాణ సమాజం అస్సలు ఒప్పుకోదని కోదండరాం హెచ్చరించారు.

## ఎటు వెళుతున్నాం..!

పైశాచికత్వపు సంబరంలో
నొప్పిని గ్రహించని స్థితిలో వున్నాం
స్వార్థపు చింతన దారులలో
కళ్ళు మూసుకుని అడుగులేస్తున్నాం

రాకాసి తత్త్వం రగిలిపోతూ
ఒక దేహాన్ని ఛిద్రం చేస్తుంటే
కళ్ళు విప్పార్చి చూస్తున్నాం
గాయం రగిలించిన మంటతో
ఒక శరీరం బాధతో కన్నీరొలుకుతుంటే
కెమెరా చిత్రంలో బంధిస్తున్నాం
లైకులు షేర్ ల కోసం
మానవత్వాన్ని చిదిమేస్తున్నాం

ఒక మానాన్ని బహిరంగంగా తీస్తుంటే
పళ్ళికిలిస్తూ రాతి బండలమైపోయాం
ఒక ప్రాణం తల్లడిల్లిపోతూ ఏడుస్తుంటే
ఆ శబ్ద తరంగాల్ని పాటగా వింటున్నాం

బక్కచిక్కిన దేహం
కళ్ళు తేలేస్తూ అల్లాడిపోతుంటే
కథనాలుగా మలిచి చూపిస్తున్నాం
రేటింగుల కోసం మానవతను వెలేసాం

ఒక మనిషిని హింసించే క్రూరత్వాన్ని
కదిలే చిత్రాలుగా మలుస్తూ
సమాజానికి చూపిస్తూ
సబ్స్క్రైబ్ ల కోసం పరితపిస్తున్నాం
ఇదేనా మానవత్వమంటే

ఆకలి పేగుల గోడును ఫోటోలుగా తీసి
వ్యవస్థలో బొమ్మలుగా ఆడిస్తున్నాం
ఆకలి తీర్చడం మరచిపోయి
అవకాశంగా మలుచుకొంటున్నాం

నేరం జరిగితే కెమెరా కళ్ళు
ఘోరం జరిగితే నిఘా లెన్సులు
చలగాటంతో చిత్రమాలికల హంగులు
ఇదేనా మానవత్వమంటే

చేయందించాల్సిన సమయాన్ని
లాభంగా తీర్చిదిద్దుకునే మృగత్వం
ఆదుకోవాల్సిన ఆ క్షణ కాలాన్ని
కెమెరాలో బంధించే పైశాచికత్వం
ఇదేనా మానవత్వ వికాసమంటే
ఇదేనా మనిషితనమంటే

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

# వీధి విక్రేతల జీవితాల్లో స్వనిధి విప్లవం



‘చిన్న రుణం పెద్ద కలలకు రెక్కలు కట్టగలదు.. సరైన అవకాశం జీవితాలను మార్చగలదు’. భారతదేశ పట్టణ ఆర్థిక వ్యవస్థలో వీధి విక్రేతలు ఒక కీలకమైన శక్తి. రోడ్డు పక్కన కూరగాయలు అమ్మే మహిళ నుంచి టీ స్టాల్ నడిపే యువకుడు వరకు, పండ్ల బండి యజమాని నుంచి చెప్పులు బాగుచేసే మోచీ వరకు లక్షలాది మంది ప్రతిరోజూ నగరజీవనాన్ని సజావుగా కొనసాగిస్తున్నారు. వీరు ప్రజలకు సరసమైన ధరల్లో వస్తువులు, సేవలు అందించడమే కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థను చైతన్యవంతంగా ఉంచుతున్నారు. అయినప్పటికీ, ఎన్నో సంవత్సరాలుగా వీరు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండి, అధిక వడ్డీ వసూలు చేసే అనధికారిక రుణదాతలపై ఆధారపడాల్సి వచ్చింది.

ఆర్థిక చేరిక లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2020 జూన్‌లో ప్రధానమంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి (PM SVA Nidhi) పథకాన్ని ప్రారంభించింది. వీధి విక్రేతల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ సూక్ష్మ రుణ పథకం వారికి ఆర్థిక స్వావలంబన, గౌరవప్రదమైన జీవనం మరియు వ్యాపారాభివృద్ధికి అవకాశాలను కల్పించింది. ఇది కేవలం రుణాలు ఇచ్చే పథకం మాత్రమే కాదు. డిజిటల్ లావాదేవీలు, సామాజిక భద్రత, ఆర్థిక అక్షరాస్యత మరియు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించే సమగ్ర అభివృద్ధి కార్యక్రమంగా రూపుదిద్దుకుంది.

ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఈ పథకం విశేష విజయాన్ని నమోదు చేసింది. దేశవ్యాప్తంగా 75 లక్షలకు పైగా వీధి విక్రేతలు లబ్ధి పొందగా, 1.12 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. రూ.17,800 కోట్లకు పైగా రుణ సహాయం అందించబడింది. ముఖ్యంగా 55 లక్షలకు పైగా లబ్ధిదారులు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమై, కోట్లాది డిజిటల్ లావాదేవీలను నిర్వహించడం విశేషం. ఈ విజయాన్ని గుర్తించిన ప్రభుత్వం పథకాన్ని 2030 వరకు పొడిగించింది.

సరైన మార్గదర్శకత్వం లభిస్తే చిన్న మూలధనమే గొప్ప పరివర్తనకు నాంది అవుతుంది. PM SVANidhi పథకం అనేక ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంది. మొదటి విడతలో 15,000, రెండవ విడతలో 25,000, మూడవ విడతలో 50,000 వరకు నిరాధార వర్కింగ్ క్యాపిటల్ రుణాలు అందించబడతాయి. సకాలంలో చెల్లింపులు చేసే వారికి వడ్డీ రాయితీలు, క్రెడిట్ గ్యారంటీ సౌకర్యాలు లభిస్తాయి. రెండవ విడతను విజయవంతంగా పూర్తి చేసిన వారికి 30,000 వరకు పరిమితి కలిగిన UPI&లింక్డ్ రూపే క్రెడిట్ కార్డులు కూడా అందుబాటులో ఉంటాయి.

డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తోంది. డిజిటల్ లావాదేవీలు నిర్వహించే విక్రేతలకు 1,600 వరకు క్యాష్బ్యాక్ ఇవ్వబడుతోంది. దీంతో నగదు ఆధారిత వ్యాపారాలు క్రమంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి మారుతున్నాయి. అదనంగా ‘స్వనిధి సే సమృద్ధి’ కార్యక్రమం ద్వారా లబ్ధిదారు లను పలు కేంద్ర సంక్షేమ పథకాలతో అనుసంధానం చేసి సమగ్ర సామాజిక భద్రతను కల్పిస్తున్నారు.

వ్యాపారానికి మూలధనం అవసరం... విజయానికి నైపుణ్యం అవసరం.ఈ పథకంలో భాగంగా వీధి విక్రేతలకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆహార భద్రత, పరిశుభ్రత మరియు వ్యాపార నిర్వహణపై శిక్షణలు అందించబడుతున్నాయి. FSSAI సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు విక్రేతలను మరింత ప్రొఫెషనల్‌గా మార్చి వారి వ్యాపార స్థిరత్వాన్ని పెంచుతున్నాయి.

2023 మరియు 2025 సంవత్సరాలలో నిర్వహించిన స్వతంత్ర ప్రభావ అధ్యయనాలు ఈ పథకం విజయాన్ని స్పష్టంగా వెల్లడించాయి. దాదాపు 95 శాతం మంది లబ్ధిదారులు జీవితంలో మొదటిసారిగా అధికారిక బ్యాంకింగ్ రుణాలను పొందారు. వారిలో 30 శాతం మంది తరువాత ఇతర సంస్థాగత రుణాలను కూడా పొందగలిగారు. ఇది వారి క్రెడిట్ చరిత్ర మెరుగుపడటానికి, ఆర్థిక విశ్వసనీయత పెరగడానికి దోహదపడింది. లబ్ధిదారుల సగటు ఆదాయం సంవత్సరానికి దాదాపు 20 శాతం పెరిగినట్లు అధ్యయనాలు సూచించాయి.

‘సాధికారత అంటే కేవలం ఆదాయం కాదు; అది గౌరవం, భద్రత మరియు భవిష్యత్తుపై నమ్మకం’. ఆర్థికాభివృద్ధితో పాటు గృహ సంక్షేమం కూడా గణనీయంగా మెరుగుపడింది. కుటుంబాల ఆహార భద్రత, పిల్లల విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ స్థిరత్వం వంటి అంశాలలో సానుకూల మార్పులు కనిపించాయి. మహిళల భాగస్వామ్యం ఈ పథకం విజయానికి మరో ముఖ్య సూచిక. మొత్తం లబ్ధిదారులలో సుమారు 46 శాతం మంది మహిళలు ఉండగా, 70 శాతం మంది అట్టడుగు వర్గాలకు చెందినవారు. ఇది పథకం సామాజిక సమానత్వాన్ని ప్రతిబింబిస్తోంది.

ఈ విజయ గాథల వెనుక అనేక మంది సాధారణ ప్రజల అసాధారణ ప్రయాణాలు దాగి ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన బబితా శర్మ ఒక చిన్న పూజా సామాగ్రి స్టాల్‌తో జీవనం సాగించేవారు. పరిమిత పెట్టుబడుల కారణంగా వ్యాపారాన్ని విస్తరించలేకపోయారు. PM SVANidhi రుణం పొందిన తర్వాత అదనపు వస్తువులు కొనుగోలు చేసి విక్రయాలు పెంచుకున్నారు. తరువాతి విడత రుణంతో బండిని కొనుగోలు చేసి వ్యాపారాన్ని మరింత విస్తరించారు. నేడు ఆమె చిన్న స్టాల్ ఒక స్థిరమైన వ్యాపారంగా రూపాంతరం చెందింది.

‘మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుంది’. కేరళలోని తిరువనంతపురానికి చెందిన శాంతి ఆర్ కథ కూడా ప్రేరణాత్మకమే. ఎండుచేపల వ్యాపారం ద్వారా కుటుంబాన్ని పోషిస్తున్న ఆమె గతంలో అధిక వడ్డీ రుణాల భారం మోసేవారు. ౖక ఖీఱూజీఛీజీజీ ద్వారా పొందిన రుణాలతో ఆమె వ్యాపారాన్ని విస్తరించి, ప్యాకింగ్ మరియు సరఫరా రంగాల్లోకి అడుగుపెట్టారు. మూడవ విడతగా ₹50,000 రుణం, తరువాత స్వనిధి క్రెడిట్ కార్డు పొందడం ద్వారా ఆమె వ్యాపారం మరింత బలోపేతమైంది.

అస్సాంలోని గౌహతికి చెందిన సేవాలి కలిత జీవితం కూడా ఈ పథకం తెచ్చిన మార్పుకు నిదర్శనం. ఒక చిన్న పాన్ షాపుతో జీవనం సాగిస్తున్న ఆమెకు కరోనా కాలంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యాయి. ౖక ఖీఱూజీఛీజీజీ కింద పొందిన మొదటి ₹10,000 రుణంతో ఆమె సేంద్రీయ కూరగాయల విక్రయాన్ని ప్రారంభించారు. తరువాతి రుణాలతో వ్యాపారాన్ని విస్తరించి నేడు స్థిరమైన ఆదాయం పొందుతున్నారు. నెలకు సుమారు ₹8,000 లాభాన్ని సంపాదిస్తూ కుటుంబానికి మెరుగైన జీవనాన్ని అందిస్తున్నారు.

‘ప్రతి సంక్షోభంలో ఒక అవకాశం దాగి ఉంటుంది; దాన్ని గుర్తించినవారే విజయాన్ని అందుకుంటారు.‘గుజరాత్లోని గాంధీనగర్కు చెందిన యోగ్రాజ్ మాలి కథ యువతకు స్ఫూర్తిదాయకం. కరోనా కారణంగా వీధి ఆహార వ్యాపారం దెబ్బతిన్నప్పటికీ PM SVANidhi రుణం అతనికి కొత్త ఆశను ఇచ్చింది. రుణంతో వ్యాపారాన్ని పునరుద్ధరించడంతో పాటు డిజిటల్ చెల్లింపులను స్వీకరించాడు. క్యాష్బ్యాక్ ప్రయోజనాలు పొందడమే కాకుండా బీమా, పెన్షన్ వంటి ఇతర ప్రభుత్వ పథకాలతో కూడా అనుసంధానమయ్యాడు.

‘వీధి విక్రేతలు అభివృద్ధి అంచుల్లో ఉన్నవారు కాదు; వారు అభివృద్ధి చక్రాన్ని తిప్పే శక్తులు’. PM SVANidhi ప్రభావం వ్యక్తిగత విజయాలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇది పట్టణ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త దృక్పథాన్ని తీసుకువచ్చింది. వీధి విక్రేతలను కేవలం అనధికారిక రంగానికి చెందిన వారిగా కాకుండా ఆర్థికాభివృద్ధికి భాగస్వాములుగా గుర్తించే మార్పుకు ఇది దోహదపడింది. డిజిటల్ లావాదేవీలు, బ్యాంకింగ్ సేవలు, సామాజిక భద్రతా పథకాల ప్రాప్తి ద్వారా లక్షలాది కుటుంబాలు ప్రధాన ఆర్థిక ప్రవాహంలో భాగమయ్యాయి.

భారతదేశం ‘వికసిత భారత్‘ లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఈ సమయంలో PM SVANidhi వంటి కార్యక్రమాలు సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేస్తున్నాయి. చిన్న వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆర్థిక వృద్ధి మాత్రమే కాకుండా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు మరియు ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని కూడా అందిస్తున్నాయి.

‘స్వనిధి ఒక రుణ పథకం మాత్రమే కాదు; అది ఒక స్వప్నానికి ఆర్థిక బలం, ఒక కుటుంబానికి ఆశాకిరణం, ఒక విక్రేతకు ఆత్మగౌరవానికి మార్గం. ఇది ‘స్వరోజ్‌గార్’ నుంచి ‘స్వాభిమానం’ వరకు సాగిన విజయయాత్ర.

**- డా. రవికుమార్ చేగోని**
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ గ్రంథాలయ సంఘం



# చేతిరాత... ఆచరణాత్మక పరిష్కారాలు




అక్షరం అంటే నాశనం లేనిది. మనిషి తన భావాలను కలకాలం పదిల పరుచుకోవడానికి కనిపెట్టిన అద్భుతమైన సాధనం లిపి. ఆ లిపికి అంద మైన రూపాన్ని ఇచ్చేది చేతిరాత. ఒకప్పుడు చేతిరాతను కేవలం సమాచార మార్పిడి సాధనం గానే కాకుండా, ఒక గొప్ప కళగా, వ్యక్తిత్వానికి ప్రతిబింబంలా చూసేవారు.

నేటి డిజిటల్ కాలంలో కీబోర్డ్ వినియోగం, కంప్యూటర్ అక్షరాస్యత జీవితానికి అవసరమైన సాధనాలుగా మారాయి. సాంకేతికత మన పనులకు వేగాన్ని ఇస్తున్నప్పటికీ, అక్షరాలను అందంగా దిద్దే మధురమైన చేతిరాత కళ క్రమంగా మరుగున పడుతుండటం విచారించదగ్గ విషయం. ఇక్కడ సాంకేతికతను నిరసించడం కంటే, దాంతో పాటుగా మన మూలాలను కాపాడుకోవడం ముఖ్యం.

చేతిరాత ప్రాముఖ్యత గురించి మహాత్మా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావిస్తూ.. ‘అశుద్ధమైన లేదా అస్పష్టమైన చేతిరాత అసంపూర్ణ విద్యకు సంకేతం’ అని హెచ్చరించారు. విద్యార్థి దశలోనే అక్షరాలను అందంగా దిద్దడం నేర్చుకోవాలని, బాల్యంలో అలవడే గుండ్రని రాతే భవిష్యత్తు విద్యా వికాసానికి పునాది అవుతుందని ఆయన హితవు పలికారు.

ప్రపంచంలోని అందమైన లిపి కలిగిన భాషల్లో తెలుగు ఒకటి. తెలుగు వృత్తాకారంలో రాయబడుతుంది కాబట్టి దీనికి గుండ్రటి ఆకృతి ఉంటుంది. తలకట్టులు, కొమ్ములు, దీర్ఘాల నిర్దిష్టమైన వంపులతో తెలుగు అక్షరాలు లయబద్ధంగా సాగుతాయి. అందుకే తెలుగు చేతిరాత చూడ్డానికి ముత్యాల సరాల కోవలా మెరిసిపోతుంది. మన పూర్వీకులు తాళపత్ర గ్రంథాల మీద ఘంటంతో రాసేటప్పుడు అక్షరం ఏమాత్రం వంకర పోయినా ఆకు విరిగిపోయే ప్రమాదం ఉండేది. అందుకే వారు అత్యంత ఏకాగ్రతతో, కళాత్మకంగా రాయడం అలవాటు చేసుకున్నారు. అచ్చు యంత్రాలు రాకముందే మన లిపి ముత్యం లా ప్రకాశించేది.



చేతిరాతను చూసి మనిషి వ్యక్తిత్వాన్ని చెప్పవచ్చు అంటారు పెద్దలు. దీనిని చేతిరాత విశ్లేషణ శాస్త్రం (గ్రాఫాలజీ) అని పరిగణిస్తారు. మనం అక్షరాలను రాసే తీరు, వాటి మధ్య ఇచ్చే ఖాళీలు మన ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తాయి.

విజ్ఞాన శాస్త్రం ప్రకారం, మనం చేతితో రాస్తున్నప్పుడు మెదడులోని వివిధ భాగాలు చురుగ్గా పనిచేస్తాయి. కీబోర్డ్‌పై టైప్ చేయడం యాంత్రికమైనది. కానీ చేత్తో రాసేటప్పుడు కళ్లు, చేతి కండ రాలు, మెదడు మధ్య లోతైన సమన్వయం అవసరమవు తుంది. చేత్తో రాసి నేర్చుకున్న విషయాలు మెదడులో ఎక్కువ కాలం గుర్తుంటాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత విద్యావిధానంలో రాత నాణ్యత కంటే వేగానికే, మార్కులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్రమైన ఆచరణాత్మక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

నేటి తరం విద్యార్థులకు ఒక అక్షరాన్ని ఎక్కడ ప్రారంభించాలో, ఎలా ముగించాలో అవగాహన లోపిస్తోంది. ఉదాహరణకు తెలుగులో ‘ఓ’ కు ‘ఒ’ కు ఉన్న తేడా, ‘ఔ’ కు ‘జా’కు ఉన్న వ్యత్యాసం, అలాగే ‘ఘ’-‘ఝ’, ‘న’-‘స’, ‘ఫ’-‘ష’,‘భ’, ‘మ’-‘య’వంటి అక్షరాల ప్రాథమిక నిర్మాణ భేదాలు తెలియక తికమకపడుతున్నారు. ఒత్తులను సరైన స్థానంలో రాయడానికి ఇబ్బంది పడుతున్నారు. అక్షరాల ఆకృతులపై స్పష్టత లేకపోవడంతో, వారు రాసే రాత ఇతరులకు అర్థం కాకపోవడమే కాకుండా, వారిలో అక్షర దోషాలు విపరీతంగా పెరుగుతున్నాయి. పాఠశాలల్లో ఒకప్పుడు కాపీ రైటింగ్ పుస్తకాలు తప్పనిసరిగా ఉండేవి. నేడు ప్రాథమిక స్థాయిలోనే స్క్రీన్ టైమ్ పెరగ డంతో పెన్ పట్టి రాసే అలవాటు క్రమంగా తప్పుతోంది. ప్రాథమిక తరగతుల నుంచే అక్షరాల స్ట్రోక్స్ (ఎక్కడ మొదలుపెట్టాలి, ఎలా ముగించాలి) అనే పద్ధతిని ఉపాధ్యా యులు నేర్పించాలి. నేటి డిజిటల్ బోర్డులపై కూడా అక్షరాల అమరికను చలనచిత్రాల (యానిమేషన్) ద్వారా చూపిస్తూ సులువుగా నేర్పించవచ్చు. విద్యార్థుల అందమైన చేతిరాతలను పాఠశాల సమాచార పలకాలపై ప్రద ర్శించాలి. పాఠశాల, మండల స్థాయిల్లో చేతిరాత పోటీలు నిర్వహించి ఉత్తమ రాత కలిగిన విద్యా ర్థులను గుర్తించి బహుమతులు అందించాలి.

విద్యార్థులు రోజువారీ డైరీ రాయడం, ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు చేత్తో రాసిన కృతజ్ఞతా లేఖలు ఇవ్వడం, స్వయంగా సెలవు పత్రం రాయడం అలవాటు చేయాలి. పండుగలకు చేత్తో రాసిన శుభాకాంక్షల కార్డులు పంపడం వల్ల ఆత్మీయత పెరుగుతుంది. చేతిరాత ఒక మనిషి హృదయ స్పందనకు, సృజనాత్మకతకు ప్రతీక. అక్షర సంస్కృతిని కాపాడుకోవడం అంటే మన ఆలోచనా సరళిని కాపాడుకోవడమే. గాంధీజీ అన్నట్లు, అందమైన రాతను ఒక ఆస్తిగా భావించి భావితరాలకు అందిద్దాం.

**- మారెపల్లి అనిల్ కుమార్**
చేతిరాత నిపుణులు
99121 62087

# విద్యా కమిషన్ సిఫారసులు బుట్టదాఖలేనా?



ఒక రాష్ట్ర భవిష్యత్తును మార్చగల అసలు శక్తి విద్యకు మాత్రమే ఉంటుంది. రహదారులు, భవనాలు, భారీ ప్రాజెక్టులు ఇవన్నీ తాత్కాలిక అభివృద్ధి గుర్తులు మాత్రమే. కానీ ఒక తరం ఆలోచనా విధానాన్ని, జీవన స్థాయిని, సమాజ భవిష్యత్తును మార్చేది విద్య మాత్రమే. అలాంటి విద్య విషయంలో తెలంగాణ ప్రభుత్వం మళ్లీ రాజకీయ ప్రయోగాలు చేస్తోందా? విద్యా కమిషన్ను కేవలం ప్రచార సాధనంగా వాడుకుందా? అనే అనుమానాలు ఇప్పుడు ప్రజల్లో బలపడుతున్నాయి.

ఫిబ్రవరి 26, 2026న తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించిన తెలంగాణ విద్యా విధానం - సమగ్ర అభివృద్ధి దిశగా నివేదిక రాష్ట్ర విద్యా వ్యవస్థకు ఒక కొత్త మార్గదర్శకంలా కనిపించింది. ఈ నివేదిక తెలంగాణ విద్యకు కొత్త దిశ చూపుతుం దని అందరూ ఆశించారు.

నిధులు లేకుండా విద్యా సంస్కరణలు ఎలా సాధ్యం? అనే ప్రశ్న ఇప్పుడు సహజంగా వినిపిస్తోంది. విద్యా కమిషన్ నివేదికను సభల్లో పొగిడిన ప్రభుత్వం, బడ్జెట్లో మాత్రం దాన్ని పూర్తిగా విస్మరించడం రాజకీయ మోసం కాకపోతే మరేమిటి? విద్యను రాష్ట్ర లక్ష్యంగా ప్రకటించిన ప్రభుత్వం, ఆ లక్ష్యానికి తగిన నిధులు కేటాయించకపోవడం తీవ్రమైన విరుద్ధతగా కనిపిస్తోంది.

ప్రభుత్వం 100 నియోజకవర్గాల్లో 200 తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. వినడానికి గొప్పగా ఉన్నా, ఇది రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలల సమస్యలకు నిజమైన పరిష్కారమా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికీ అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మరుగుదొడ్లు లేకపో వడం, తాగునీటి సమస్య, డిజిటల్ బోధన లేకపో వడం, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు లేకపో వడం, విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యలు అలాగే కొనసాగుతున్నాయి.

అంటే ప్రభుత్వం మొత్తం విద్యా వ్యవస్థను బలోపేతం చేయకుండా, కొద్దిచోట్ల నమూనా పాఠశాలలు చూపించి ప్రచారం చేసుకుంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైన విద్యా సంస్కరణ కాదు కేవలం ప్రచార రాజకీయాలేనని ప్రజలు భావిస్తున్నారు.

విద్యా కమిషన్ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆంగ్ల మాధ్యమం, మూడు భాషల విధానం, నైపుణ్యాధారిత విద్య, డిజిటల్ బోధన, గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక సౌకర్యాలు, ప్రవేశ పరీక్షల సంస్కరణలు, ఇంటర్ విధాన మార్పులు, కనీస ఉత్తీర్ణత ప్రమాణాలు, ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాలు, పాఠశాలల విద్యా సమీక్షలు వంటి కీలక సిఫారసులు చేసింది.

కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఏ అంశాన్ని స్పష్టంగా అమలు చేయడం ప్రారంభించలేదు. డిజిటల్ తెలంగాణ అంటున్న ప్రభుత్వం గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా ప్రొజెక్టర్లు కూడా అందించలేకపోతోంది. మూడు భాషల విధానం అమలు ఎక్కడ? విద్యార్థులపై ఒత్తిడి తగ్గించే మార్పులు ఎక్కడ? ప్రవేశ పరీక్షల సంస్కరణలపై స్పష్టత ఎక్కడ? అనే ప్రశ్నలు విద్యావర్గాల్లో వినిపిస్తున్నాయి. కమిషన్ నివేదికలో పనితీరు ఆధారిత పదోన్నతులు వంటి ప్రతిపాదనలు వచ్చాయి. కానీ ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నది వేరే. పనితీరు అంటే ఏమిటి? గ్రామీణ ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు లేకుండా పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎలా అంచనా వేస్తారు? ప్రభుత్వం ఉపాధ్యాయుల శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి తగిన నిధులు కేటాయించకుండా, పనితీరు పేరుతో భయాందోళనలు పెంచుతోందనే విమర్శలు ఉన్నాయి. ఉపాధ్యాయులతో సరైన చర్చలు జరపకుండా నిర్ణయాలు తీసుకోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

తెలంగాణలో ప్రైవేట్ విద్య ఇప్పుడు భారీ వ్యాపారంగా మారింది. లక్షల రూపాయల ఫీజులు.. మధ్యతరగతి, పేద కుటుంబాలను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

విద్యా కమిషన్ స్పష్టంగా ఫీజు నియంత్రణ చట్టం అవసరమని సూచించింది. పేద విద్యార్థులను రక్షించేలా ప్రైవేట్ ఫీజులను నియంత్రించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు.

ఇప్పటికీ అనేక గ్రామాల్లో ఒకే ఉపాధ్యాయుడితో పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఉన్నత పాఠశాల కోసం విద్యార్థులు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నారు. అనేక బాలికలు ఇంటర్ చదవలేక చదువు మానేస్తున్నారు. డిజిటల్ పరికరాలు లేక విద్యార్థులు వెనుకబడుతున్నారు. ఆంగ్ల నైపుణ్యాలు, సాంకేతిక విద్య, డిజిటల్ బోధన.. ఇవన్నీ ఇప్పటికీ వేలాది పేద విద్యార్థులకు కలలుగానే మిగిలిపోయాయి.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీతో తల్లిదండ్రులు ఆర్థికంగా కుంగిపోతున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం తగ్గిపోతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మార్పు అని నినదించింది. కానీ విద్యలో కనిపిస్తున్నది మార్పు కాదు పాత నిర్లక్ష్యానికే కొత్త ప్రచార కవరింగ్ అన్న విమర్శలు పెరుగుతున్నాయి.

విద్యా కమిషన్ నివేదికను సభల్లో పొగడటం సులభం. కానీ దాన్ని అమలు చేయడానికి నిధులు కేటాయించడం, వ్యవస్థలో నిజమైన మార్పులు తీసుకురావడం అసలు పరీక్ష. ప్రస్తుతం ప్రభుత్వం ఆ పరీక్షలో విఫలమవుతోందనే భావన బలపడుతోంది.

విద్యా కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలు చేయాలని ప్రజలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. విద్యకు తక్షణం 18 శాతం నిధులు కేటాయించాలని, పైలట్ ప్రాజెక్టులు కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేపట్టాలని, ఉపాధ్యాయులతో పారదర్శక చర్చలు జరపాలని కోరుతున్నారు. లేకపోతే ఈ నివేదిక మరో కాగితపు పంచాయితీగా చరిత్రలో మిగిలిపోతుందనే ఆందోళనలు వినిపిస్తున్నాయి.

తెలంగాణ భవిష్యత్తు ఐటీ టవర్లలో కాదు ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో తయారవుతుంది. అక్కడే రాష్ట్ర అసలు అభివృద్ధి దాగి ఉంది.

విద్యా కమిషన్ నివేదికను బుట్ట దాఖలు చేస్తే అది కేవలం ఒక పత్రాన్ని విసిరేసినట్టే కాదు తెలంగాణ తరాల భవిష్యత్తునే విస్మరించినట్టవుతుంది. ప్రభుత్వం కళ్లు తెరవాలి. ఇది కేవలం విమర్శ కాదు తెలంగాణ భవిష్యత్తు కోసం వినిపిస్తున్న తీవ్రమైన హెచ్చరిక.

**- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి**
9010128884

# దేశంలోనే అతిపెద్ద బ్యాంకు ఎస్‌బిఐ

‘భారతీయ స్టేట్ బ్యాంకు’ లేదాస్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత దేశంలోనే అతిపెద్ద బ్యాంకు. బ్రాంచీల సంఖ్య, పనిచేయు సిబ్బంది ప్రకారం ఇది ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాంకు. 1806లో కోల్కతలో స్థాపించ బడిన ఈ బ్యాంకు భారత ఉపఖండం లోనే అతి పురాతనమైన బ్యాంకులలో ఒకటి. ఈ బ్యాంకు దేశీయ, అంతర్జాతీయ, ప్రవాస భారతీయ సేవలను అందిస్తుంది. 1955లో భారత ప్రభుత్వము ఈ బ్యాంకును జాతీయం చేసి తన అధీనం లోకి తీసుకుంది. ఇటీవల కాలంలో స్టేట్ బ్యాంకు రెండు ప్రధాన చర్యలను చేపట్టింది... పనిచేయు సిబ్బంది సంఖ్యను కుదించడం, రెండవది కంప్యూటరీకరణ.

స్టేట్ బ్యాంకు 21 జూన్, 1806న కలకత్తా బ్యాంకు స్థాపన గావించగా, 21 జనవరి, 1809న బ్యాంక్ ఆఫ్ బెంగాల్ గా మార్పు చేశారు. 15 ఏప్రిల్, 1840న బ్యాంక్ ఆఫ్ బాంబే స్థాపన, 11 జూలై, 1843న బ్యాంక్ ఆఫ్ మద్రాస్ స్థాపన గావించారు. 27 జనవరి, 1921న మూడు బ్యాంకులను కలిపి ఇంపీరి యల్ బ్యాంకుగా మార్పు గావించారు. గోరేవాలా కమిటీ సిఫార్సు మేరకు ఇంపీరియల్ బ్యాంక్ 1955లో జాతీయం చేయబడింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా పేరు మార్చబడింది.

11 జూలై, 1955న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపన (జాతీయం చేయబడిన తొలి బ్యాంకు), 1959లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ బ్యాంకుల చట్టం జారీ కాగా 8 పూర్వపు రాష్ట్ర అనుబంధ బ్యాంకులను వాటి శాఖలను తన అధీనంలోకి తెచ్చుకుంది. 1980 కేరళలో బ్యాంక్ ఆఫ్ కొచ్చిన్ ఆర్థిక ఇబ్బందిలో ఉన్నప్పుడు దానిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేశారు. 29 జూన్, 2007న స్టేట్ బాంకులో ఉన్న మొత్తం రిజర్వ్ బ్యాంకు షేర్ హోల్డింగ్ ను స్వాధీనం చేసుకుంది. భారతీయ స్టేట్ బ్యాంకుకు గతంలో 7 అనుబంధ బ్యాంకులు ఉండేవి. అవన్నీ సాధారణంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ... అనే పేరుతో ప్రారంభమై చివరన ఆయా బ్యాంకుల ప్రధాన స్థావరం ఉన్న నగరాల పేర్లతో అంతమౌతుంది.

ఇవి 1959లో జాతీయం చేయడానికి ముందు ఆయా సంస్థాన రాజ్యాలకు చెందినవి. మొదటి పంచవర్ష ప్రణాళికలో గ్రామీణాభివృద్ధి లక్ష్యాన్ని సాధించుటకు ప్రభుత్వం ఈ బ్యాంకులన్నింటినీ కల్పి స్టేట్ బ్యాంక్ గా మార్పు చేసింది. ఈ బ్యాంకులన్నింటికీ కల్పి ఒకే లోగో ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ను ఇవన్నీ మాతృ సంస్థగా పరిగణిస్తాయి. 2008 లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ సౌరాష్ట్ర, 2009 లో స్టేట్ బ్యాంక్ ఇండోర్ మాతృసంస్థ లో విలీనం అయ్యాయి. మిగిలిన 5 అనుబంధ బ్యాంకులు...

స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనూర్ జైపూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండోర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాటియాలా, స్టేట్ బ్యాంకు ఆఫ్ సౌరాష్ట్ర, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెంకోర్ 2016 లో విలీనం అయ్యాయి.

విదేశాలలో ...ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, బహరీన్, బంగ్లాదేశ్, బెల్జియం, కెనడా, దుబాయ్, ఫ్రాన్స్, జర్మనీ, హాంగ్కాంగ్, ఇజ్రాయెల్, జపాన్, చైనా, మాల్దీవులు, సింగపూర్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఓమన్, బహమాస్, ఇంగ్లాండు, అమెరికా లాంటి దేశాలలో ఎస్ బి ఐ సేవలు అందిస్తున్నది. విలీనం తర్వాత ఎస్ బి ఐ సంస్థ క్రింద ఇప్పుడు 23000 కంటే ఎక్కువ శాఖలను, 2,70,000 కంటే ఎక్కువ మంది ఉద్యోగులను కలిగి ఉంది. ఎస్బీఐ డిపాజిట్ కూడా 26 లక్షల కోట్లకు పెరిగింది.

ముంబై ప్రధాన కార్యాలయం ద్వారా, స్టేట్ బ్యాంకు 36 రాష్ట్రాలు/ కేంద్రం పాలిత ప్రాంతాలలో 29236 శాఖలను కలిగి ఉంది. 63వేల ఎ టి ఎం ల సౌకర్యంతో 316,021.20 కోట్ల ఆదాయాన్ని కలిగి ఉంది. ప్రత్యక్షంగా నే గాక ఆన్ లైన్ ద్వారా సమర్థ వంతంగా సేవలను అందిస్తోంది. విలీనం ప్రపంచంలోనే అతిపెద్ద ఆస్తి పరిమాణం కలిగిన బ్యాంక్గా అవతరించడంలో సహాయ పడింది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# సంక్షేమ అభివృద్ధి సామాజిక న్యాయ లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- మంత్రి దామోదర రాజనర్సింహ
- ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు
- అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం
- స్వయం సహాయక సంఘాలకు రూ.69.19 కోట్ల రుణాల పంపిణీ



సంగారెడ్డి, జూన్ 2 మనంప్రతినిధిః తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి, ఆయా శాఖల కార్యక్రమాలు, సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నలుగురు దృష్టిలోపం కలిగిన విద్యార్థులకు ల్యాప్టాప్లను పంపిణీ చేశారు. 768 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.69.19 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. అలాగే ట్రాన్స్జెండర్లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. పీఎం శ్రీ పాఠశాలల్లో నిర్వహించిన వేసవి శిబిరాలలో విశిష్ట సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఐబీ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

రాజన్న సిరిసిల్ల, జూన్ 2(మనం ప్రతినిధి)ః రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జాతీయ జెండాను మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూల మాల వేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పలువురు విద్యార్థులకు నోట్ బుక్ లు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఏవో రాంరెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మహిళల సాధికారతే సమగ్ర అభివృద్ధికి పునాది
- మహిళా సంఘాలకు రూ.26 కోట్లకు పైగా రుణాల మంజూరు
- రాష్ట్ర శాఖ మంత్రి సీతక్క




ములుగు, జూన్ 2, మనం ప్రతినిధిః మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళలు ఆర్థిక సాధికారత సాధించడం ద్వారానే సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదిగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన వేడుకలలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు ఊతమిచ్చేలా వివిధ పథకాల కింద రూ.26 కోట్లకు పైగా ఆర్థిక సహాయం, రుణాలు, ప్రోత్సాహకాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎం పి బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 210 స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.20.50 కోట్ల రుణాలను, 2024-25 ఖరీఫ్,రబీ, సీజన్, 2025-26 ఖరీఫ్ సీజన్లలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన 59 గ్రామ సంస్థలకు మార్కెటింగ్ కమిషన్ రూ.1.89 కోట్లను అందజేశారు. గ్రామీణ కుటుంబాల ఆదాయ వృద్ధి లక్ష్యంగా అమలు చేస్తున్న రౌలాబ్, మదర్ యూనిట్, బ్యాక్యార్డ్ పౌల్ట్రీ జీవనోపాధి కార్యక్రమాల ద్వారా 2022 మంది మహిళా సభ్యులకు రూ.1.59 కోట్ల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. అత్యవసర అవసరాల నిమిత్తం 105 స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి ద్వారా రూ.2.20 కోట్ల రుణాలను మంజూరు చేయగా, ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 23 మహిళా సంఘాలకు మెప్మా బ్యాంక్ లింకేజీ కింద రూ.2.15 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మహిళల సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారా కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. మహిళా సంఘాలు కేవలం పొదుపు కార్యక్రమాలకే పరిమితం కాకుండా పారిశ్రామిక, వ్యవసాయ అనుబంధ, సేవా రంగాల్లోనూ ముందుకు వచ్చి విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు.

ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ స్ఫూర్తి చాటిన జర్నలిస్టులు



- వేములవాడలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- టీయూడబ్ల్యూజే (హెచ్-143) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ.. అమరవీరులకు ఘన నివాళి

వేములవాడ,జూన్ 02(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.రాష్ట్ర ఉపాధ్యక్షులు,జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోరుట్ల బస్టాప్ నుంచి తిప్పాపూర్ మెయిన్ బస్టాండ్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న జర్నలిస్టులు 'జోహార్ తెలంగాణ అమరవీరులకు జోహార్', 'జై తెలంగాణ - జై జై తెలంగాణ', 'జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేస్తూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటిచెప్పారు,అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమన్నారు. వారి పోరాట ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రసూల్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, గౌరవ సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు దేవరాజ్, విష్ణు, క్యాషియర్ పంపరి నాగరాజు, సహాయ కార్యదర్శి ఫహద్, జిల్లా సభ్యుడు కంటాల విజయ్, ప్రచార కార్యదర్శి దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు షబ్బీర్, గంగాధర్, పండుగ స్వామి, సంటి రాజేందర్ ఆసిమ్, నవీన్ వరి లక్ష్మీనారాయణ, రాము,ప్రసాద్, శ్రీకాంత్, బొడుసు రవి కుమార్, బూర్ల సందీప్, శ్రీధర్, సంతోష్,గడ్డం రవి, అజరొద్దీన్ ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

- రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు




ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 02 (మనం బ్యూరో)ః ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో నాగర్ కర్నూల్, మహబూబ్నగర్ ,నారాయణపేట, గద్వాల చేపట్టిన కీలక సాగునీటి ప్రాజెక్టుల సందర్శనకు రానున్న ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావులు ఆదేశించారు. పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు, సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్లోని బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ నుంచి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యటన మార్గం, భద్రతా ఏర్పాట్లు, ప్రజా ప్రతినిధుల సమన్వయం, సాగునీటి ప్రాజెక్టుల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సవివరంగా మంత్రులు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ......, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాగునీటి రంగ అభివృద్ధి ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో నిర్మితమవుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంత రైతులకు వరంగా మార్పు చెందుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 4, 5 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రాజెక్టులను సందర్శించి వాటి పురోగతిని పరిశీలించనున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రాజెక్టుల ప్రాధాన్యత, వాటి ద్వారా సాగులోకి వచ్చిన కొత్త ఆయకట్టు, రైతులకు కలిగిన ప్రయోజనాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలను సమగ్రంగా ముఖ్యమంత్రికి అధికారులకు సూచించారు. పర్యటనలో పాల్గొనే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, రవాణా, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు చర్యలతో పాటు సాగునీటి ప్రాజెక్టుల సందర్శనకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ. ముఖ్యమంత్రి పర్యటన రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని, జిల్లాల వారీగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అన్ని ఏర్పాట్లను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి సూచించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ప్రాజెక్టుల సందర్శన పనుల పురోగతి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మంత్రులకు ముఖ్యమంత్రి పర్యటన వివరాలు వివరిస్తూ,. నాగర్ కర్నూలు జిల్లాలో కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని సోమశిల ప్రాంతంలో వీవీఐపీల రాత్రి బస తోపాటు పాలమూరు రంగారెడ్డి నార్లాపూర్ ప్రాజెక్టు సందర్శన, కుమ్మెర, వట్టెం రిజర్వాయర్ల సందర్శనకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి సందర్శించే అన్ని ప్రాంతాలను జిల్లా ఎస్పీతో కలిసి తను స్వయంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీతో కలిసి తాను స్వయంగా పర్యటిస్తూ ముఖ్యమంత్రి సందర్శించనున్న అన్ని ప్రాంతాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల కోసం జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు సమావేశాలు నిర్వహిస్తూ, అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామని కలెక్టర్ మంత్రులకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, ముఖ్యమంత్రి భద్రత అధికారులు శ్రీధర్, ప్రకాష్, పాలమూరు రంగారెడ్డి ఎస్సీ పార్థసారథి, ఇరిగేషన్ అధికారులు మురళి, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు, పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్ జిల్లా అన్ని రంగాల్లో అగ్రగామిగా రాణిస్తుంది

- ఘనంగా 13వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్న వేడుకలు
- అభివృద్ధిలో ప్రపంచానికి పోటీపడుతున్న తెలంగాణ
- రాష్ట్ర ప్రణాళికల సంఘం అధ్యక్షుడు జి. చిన్నారెడ్డి
- హాజరైన ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీలు



ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 02 (మనం బ్యూరో)ః మంగళవారం నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 13వ. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్య అతిథికి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పూలమొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసు బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ,ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల కల్పన తదితర రంగాల్లో విశేష పురోగతి సాధిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఈ నెల 5వ. తేదీన ముఖ్యమంత్రి జిల్లాను సందర్శించి ప్రాజెక్టుల పురోగతిని స్వయంగా సమీక్షించనున్నట్లు వెల్లడించారు. వేడుకల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. తెలంగాణ జానపద కళారూపాలు, సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శనలు సభికుల ప్రశంసలు అందుకున్నాయి. తెలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన తెలంగాణ సాంప్రదాయ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇతర పాఠశాలల విద్యార్థులు తెలంగాణ ఉద్యమ గాథలు, జానపద అంశాలపై చేసిన ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అభినందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను ముఖ్య అతిథి, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ శాఖల ప్రదర్శన స్టాళ్లు వేడుకలకు మరింత శోభను చేకూర్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్పీ రామేశ్వర్, నాగర్కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు, పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, జూన్ 2 మనంప్రతినిధిః తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ సముదాయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం విద్యార్థులకు నోట్బుక్స్, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు,ఆర్ డి ఓ,ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీల జీతాలు ప్రభుత్వానికి పట్టవా?

- ఎందుకు ఇంత నిర్లక్ష్యం?
- ఏప్రిల్, మే నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలి
- రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మీ



నల్లగొండ, జూన్ 2( మనం ప్రతినిధి)ః గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ (మినీ) టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అంగన్వాడీల పట్ల ప్రభుత్వానికి ఉన్న పట్టింపులేనితనానికి పెండింగ్ జీతాలే నిదర్శనమని మండిపడ్డారు.గత ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వేతనాలు ఇంతవరకు అందకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, రెండు నెలలుగా జీతాలు రాకపోతే ఇళ్లు ఎలా గడవాలని, పిల్లల చదువుల ఫీజులు ఎలా కట్టాలని ఆమె ప్రశ్నించారు.ప్రభుత్వం అంగన్వాడీలకు రోజురోజుకూ అదనపు బాధ్యతలు, యాప్ల నిర్వహణ అంటూ ఒత్తిడి పెంచుతోందే తప్ప, వారి కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని సకాలంలో అందించడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.గతంలో మినీ అంగన్వాడీల అప్గ్రేడేషన్ మరియు మౌలిక సదుపాయాల కల్పనపై ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో అంగన్వాడీల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి ఏప్రిల్, మే నెలల జీతాలను ఒకే విడతగా అంగన్వాడీల ఖాతాల్లో జమ చేయాలి. ఒకవేళ బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయకుంటే, అంగన్వాడీల శ్రమను హేళన చేస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తాం వారు డిమాండ్ చేశారు.

# నేల ఆరోగ్య పత్రాల అందజేత



ములుగు, జూన్2(మనంన్యూస్)ః తెలంగాణ రాష్ట్ర అవతరణ సందర్భంగా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ డీ. రాజి రెడ్డి గారి ఆదేశాల మేరకు క్షీరసాగర్ రైతులకు ఖరీఫ్ సాగుకు ముందు రైతుల పొలంలో భూసార పరీక్షలు నిర్వహించి, నేలలో భాస్వరం తక్కువగా ఉన్నట్టు గుర్తించి వివరాలను గ్రామ రైతులకు అందజేయడం జరిగింది. అదేవిధంగా భాస్వరం కలిగిన ఎరువులను వేసుకోవాలని సిఫారసు చేయడం జరిగింది. నేల ఆరోగ్య పత్రాలను అందజేస్తజు రైతులు వరి, కూరగాయల మరియు ఆకుకూరల పంటలలో పాటించవలసిన సమతుల్యా ఎరువుల పోషక యాజమాన్యం గురించి రైతులకు వివరించడం జరిగింది. అదేవిధంగా ఖేత్ బచావో అభియాన్ (వ్యవసాయ క్షేత్రాన్ని కాపాడే ఉద్యమం) కార్యక్రమంలో భాగంగా భారత వరి పరిశోధన స్థానం (ఐఐఖఖ) వారి ఆధ్వర్యంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయౌ, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ స్టడీస్ వారు రాపిడ్ మట్టి పరీక్ష కిట్లను గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అందజేయడం జరిగింది. ఈ కిట్ల ద్వారా రైతులు తమ పొలంలో వారే మట్టి పరీక్షలు నిర్వహించుకుని ఫలితాల ఆధారంగా సమగ్ర ఎరువుల పోషక యాజమాన్యం చేపట్టి ఖర్చులను తగ్గించుకొని, పంటలలో అధిక దిగుబడులను పొందుతూ నేల ఆరోగ్యాన్ని పొందవచ్చు అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీజీఐహెచ్ఎస్ ఇంచార్జి డాక్టర్ డీ. విజయ, డాక్టర్ సుచిత్ర, బి. చంద్ర శేఖర్, నిరోషా, లావణ్యా, ఐఐఆర్ఆర్, ఎన్ బిపీజీఆర్ శాత్రవేత్తలు, గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొన్యాల బాల్ రెడ్డి, ఉప సర్పంచ్ పరశురాం, వార్డు సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం

- **తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించిన ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి**
- **హాజరైన ఎంపి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ**

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 02 (మనం బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ప్రత్యేక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకునే విధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం అమరవీరుల స్మారక చిహ్నం వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర, పోలీసు అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జి. చిన్నారెడ్డి ఉదయం 08 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాగర్కర్నూల్ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ఏర్పాటు ముందు ఉన్న పరిస్థితులు, రాష్ట్ర అవతరణ అనంతరం విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో సాధించిన పురోగతిని సంపూర్ణంగా ప్రజలకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణతో అన్ని రంగాల్లో అభివృద్ధి వేగవంతమైందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్న రెడ్డి తెలిపారు. సోదరసోదరీ మణులారా... ! రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజానీకానికి నా



హృదయపూర్వకంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమర వీరులందరికీ ఘన నివాళులు అర్పిస్తున్నాను. తెలంగాణ అవతరించి నేటికి 12 వసంతాలు పూర్తి చేసుకొని మనం కలలుగంటున్న బంగారు తెలంగాణ నిర్మాణం దిశగా బలమైన అడుగులు వేయగలిగాం అన్నారు. తెలంగాణకు ఉజ్వల భవిష్యత్తు ఉండే విధంగా మనం ప్రవేశ పెట్టిన ప్రణాళికలు సత్ఫలితాలనిస్తూ, నిరంతర ప్రగతిశీల రాష్ట్రంగా తెలంగాణ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నదన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న విజయాలు తెలంగాణ బిడ్డలుగా మనందరికీ గర్వకారణమన్నరు. అనతికాలంలోనే రాష్ట్రం అద్భుత విజయాలను సాధించిందని చెప్పడానికి నేనెంతో సంతోషిస్తున్నాను. వివిధ రంగాలలో రాష్ట్రం సాధించిన ప్రగతి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అద్భుతమైన ప్రశంసలు అందుతున్నాయి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రం అమలు చేయని ఎన్నో కార్యక్రమాలకు నాంది పలకడం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శప్రాయంగా నిలుస్తున్నదన్నారు. అనేక రంగాలలో జాతీయస్థాయిలో మన రాష్ట్రం సాధించిన అవార్డులు సమర్థవంతంగా సాగుతున్న పరిపాలనకు గీటురాళ్లు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజా ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. నేటి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించింది తెలిపారు. 2023 డిసెంబర్ 28 నుంచి సరికొత్తగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నది చెప్పుకొచ్చారు. ప్రభుత్వ అధికారులను రాష్ట్రంలోని ప్రతి పల్లెకు, ప్రతి బస్తీకి పంపించి గ్రామ సభలు నిర్వహించిన ఘనత మన ప్రభుత్వం దన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమాలలో మన జిల్లా సాధించిన ప్రగతిని ఒక్కొక్కటిగా మీ ముందు ఉంచుతున్నానని ఈ వేదిక సందర్భంగా తెలిపారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు ఘన సన్మానం



**కామారెడ్డి, జూన్ 2 ( మనం ప్రతినిధి):** కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని బదిలీ పై వెళుతున్న అధికారులను జ్ఞాపికను అందించి సన్మానించారు. జిల్లా గ్రామీణ సంక్షేమ అధికారి (డీజీడబ్ల్యూఓ) ఎం. సతీష్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి (డీబీసీడీఓ) కె. జయరాజ్ బదిలీలు జరిగిన సందర్భంగా మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న అధికారుల సేవలను కలెక్టర్ ప్రశంసించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వారు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి భవిష్యత్ బాధ్యతల్లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎం. సతీష్ , కె. జయరాజ్ ని శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు వారి సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలియజేశారు.

## పోలీసు అధికారులకు సేవా పతకాల ప్రదానం



**నిజామాబాద్ రూరల్, జూన్ 2 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి సేవా పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పి. సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, చేతుల మీదుగా పతకాలను అందజేశారు. పోలీసు శాఖలో అత్యుత్తమ సేవలకు గాను సి.ఎస్.బి నిజామాబాద్ ఎస్ఐ ఎస్. సంతోష్ రెడ్డికి మహోన్నత సేవా పతకం ప్రదానం చేశారు. అదేవిధంగా ఇందల్వాయి ఏఎస్ఐ టి. నాగభూషణం, నవీపేట్ ఏఎస్ఐ షేక్ గఫర్, సి.ఎస్.బి హెడ్ కానిస్టేబుల్ బి. జగదీశ్వర్లకు ఉత్తమ సేవా పతకాలు అందజేశారు. అలాగే పోలీసు శాఖలో విశేష సేవలు అందించిన పలువురు అధికారులు, సిబ్బందికి సేవా పతకాలు ప్రదానం చేశారు. వీరిలో ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాస్, ఎస్ఐలు బి. శివరాం, ఏ. ఆనంద్ సాగర్, ఖాన్ హబీబ్, పి. రాజేశ్వర్, పి. సంజీవరావు, జి. ఉదయ్ కుమార్, ఎం. విట్టల్ రావు, ఏఎస్ఐలు ఎస్. రాజేందర్, మహమ్మద్ అబ్దుల్ రహీం, హెడ్ కానిస్టేబుళ్లు పి. రాజేశ్వర్, పి. మోహన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బిస్మిల్లా బేగ్, కానిస్టేబుళ్లు సి.హెచ్. సుభాష్, కె. రామారావు ఉన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ., ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేసిన పోలీసు సిబ్బందిని ప్రభుత్వం గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఇదే సేవాస్ఫూర్తితో విధులు నిర్వహించాలని సూచించారు. వేడుకల్లో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో వినోద రవీందర్‌నాయక్



**వరంగల్, జూన్ 2 (మనంన్యూస్):** ఈ సందర్భంగా సంగెం మండలం, పెద్ద తండ గ్రామ పంచాయతీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ వినోద రవీందర్ నాయక్ గుగులోత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రసంగాలు నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావు

### అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, జూన్ 2 ( మనంప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్రభుత్వ సలహాదారులు (బీసీ సంక్షేమ శాఖ) హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం ఐడీఓసీలో ఏర్పాటు చేసిన రాష్ట్ర అవతరణ దినోత్సవ ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారులు పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరియు సాధించిన ప్రగతిని వివరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను



ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మెమెంటోలు అందజేసి అభినందించారు. అంతర్జాతీయ యోగా పోటీలలో ప్రతిభ కనబరిచిన యోగా విద్యార్థులకు రూ.50 వేల నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలను అందజేశారు. అలాగే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఏడుగురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్ను ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్ సందర్శించి శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఎన్వి గిరి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు,, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుండారంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

- **అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **ఎమ్మెల్యే భూపతి రెడ్డి**
- **39 ఇండ్లు మంజూరు. 26 గ్రౌండింగ్ పూర్తి. 12 గృహప్రవేశాలు**

**నిజామాబాద్ రూరల్, జూన్ 2 (మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. మంగళవారం రూరల్ మండలంలోని గుండారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాయిస-ఫాతిమా దంపతుల నూతన గృహాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, కుటుంబ



సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇళ్లు మంజూరు చేసి, సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గ్రామాభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులు చురుకుగా పాల్గొని త్వరితగతిన పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కాగా, గుండారం గ్రామంలో తొలి విడతలో మొత్తం 39 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అందులో 26 ఇండ్ల గ్రౌండింగ్ పనులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 12 కుటుంబాలు నూతన ఇళ్లలో గృహప్రవేశాలు నిర్వహించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీతా పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మునిపల్లి సాయిరెడ్డి, సర్పంచ్ ఫోరం రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసు, బాగారెడ్డి, ఉమ్మాజీ నరేష్, పొలసాని శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్, ధర్మాగౌడ్, రాంచందర్ గౌడ్, శ్యాంసన్, మోహన్, ఫిషరీస్ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలే తెలంగాణ సాధనకు పునాది

- **పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య**

**నిజామాబాద్, జూన్ 2 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిజామాబాద్ నగరంలోని అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని కమిషనర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం అనేది ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిందని, అమరవీరుల



త్యాగస్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం ద్వారా అమరవీరులకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని, రాష్ట్ర పురోగతిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి తమ నివాళులు అర్పించారు.

## జాలిగామలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

- **చిన్నారులకు యూనిఫామ్లు పంపిణీ**

**గజ్వేల్ జూన్ 2 మనం న్యూస్:** గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తాళ్ళ సునీత ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎందరో అమరవీరుల త్యాగాల ఫలంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జెండా ఆవిష్కరణ అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఉచితంగా యూనిఫామ్లను పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల పోషణ, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో జాలిగామ గ్రామ ఉపసర్పంచ్ కొమురయ్య, వార్డు సభ్యులు మనోహర్, కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## కలప స్మగ్లర్ల చేతిలో అడవి మాయం

- **మామూళ్ల మత్తులో అటవీ అధికారులు**

**కమ్మర్‌పల్లి, జూన్ 2 (మనం న్యూస్):** మండల పరిధిలోని ఇనాయత్నగర్, అమీర్నగర్, నర్సాపూర్, కొనసముదర్ గ్రామాల పరిసర అటవీ ప్రాంతాలు కలప స్మగ్లర్ల చేతిలో రోజురోజుకు నాశనమవుతున్నాయనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. విలువైన చెట్లను రాత్రివేళల్లో అక్రమంగా నరికి టింబర్ డిపోల ద్వారా తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవిని కాపాడాల్సిన కొందరు అధికారులు కలప స్మగ్లర్లతో కుమ్మక్కై మామూళ్ల వసూళ్లకే పరిమితమయ్యారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అక్రమంగా చెట్ల నరికివేత కొనసాగుతున్నప్పటికీ ఎలాంటి తనిఖీలు నిర్వహించకపోవడం, టింబర్ డిపోలపై చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా కలపను తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు



వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. అడవులు కనుమరుగైతే భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల అటవీ ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ కలప రవాణాకు సహకరిస్తున్న వారిపై, అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని అడవులను రక్షించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అమరవీరుల స్థూప ఆవిష్కరణ మరచిన బిఆర్ఎస్

- **ఆనాడు పార్లమెంట్ పోరాటయోధుడు పొన్నం**
- **తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన సోనియమ్మ**
- **కాంగ్రెస్ నేతలు**



**భీమదేవరపల్లి జూన్ 2 మనం న్యూస్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రోజున ముల్కనూర్అంబేద్కర్ చౌరస్తా వద్ద జాతీయ పతాకాన్ని ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఆవిష్కరించిన అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలుగురి రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోరాటంలో అమరులైన అమరవీరుల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపాన్ని బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉండిఆవిష్కరించకపోవడం అలసత్వానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ పోరాటంలో పార్లమెంటు సమావేశంసాక్షిగా ఆంధ్ర పాలకులతో పోరాడిమంత్రి పొన్నం ప్రభాకర్ ఆనాడు పేపర్స్ ప్లే కు గురి అయ్యితెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఉద్యమ పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఉద్యమ పోరాటంలో అమరవీరుల ఆకాంక్షను నెరవేర్చింది తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియమ్మ అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తో పాటుకాంగ్రెస్ నాయకులపై అవాకులు చివాకులు మాట్లాడితే ఖబర్దార్ అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ మొక్కల స్రవంతి, మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, మాజీ సర్పంచ్ మంగ రామచంద్రం, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊస కోయిల ప్రకాష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కుల అనిల్, మహిళా మండల కాంగ్రెస్ నాయకురాలు చిదురాలస్వరూప సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆదరి రవి, డబ్బా శంకర్, మాడుగుల గోపి, మాజీ ఎంపీటీసీ బొల్లంపల్లి రమేష్, మాచర్ల సదానందం, డాక్టర్ యదలాపురం తిరుపతి, కొదురుపాక సాదన్, మాడుగుల యాదగిరి, దొంతరబోయిన వెంకటేశ్వర్లు,బొల్లంపల్లి ప్రకాష్, మండల మహేందర్, చిటుకూరి అనిల్, మాడుగుల చింటూ, కాంతారావు, మాడుగుల సంపత్, గుడి కందుల రాజు , పచ్చు నూరి కరుణాకర్ తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తేనే

# అమరవీరులకు నిజమైన నివాళి: ఎమ్మెల్యే



దమ్మపేట, జూన్ 02 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినో త్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రి మున్సిపల్ కార్యాల యాలలో నిర్వహించిన వేడు కలలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,పాల్గొన్నారు. ఈ క్రమంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నమస్కరిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ నేపథ్యంలో స్వాతంత్ర సమరయోధులు రాష్ట్రం సిద్ధించడానికి విశేష కృషి చేసిన పెద్దల ఫోటోలకు పూలాభి షేకం చేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలం గాణ వేలాది మంది విద్యా ర్థులు యువకులు రైతులు ఉద్యోగులు చేసిన ఉద్యమాలు అమరవీరుల త్యాగాల ఫలితంగానే రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులందరికీ ఘన నివాళులు అర్పిస్తూ వారి ఆశయా లకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం ఏర్పడటం అంతిమ లక్ష్యం కాదని అభివృద్ధి చెందిన తెలంగాణ నిర్మాణమే అసలు లక్ష్యమని పేర్కొన్నారు కుల మత రాజకీయ భేదాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసి ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా కృషి చేయాలని అదే అమరవీరులకు అందించే నిజమైన నివాళి అవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, ఆత్మ కమిటీ చైర్మన్ సులకపల్లి వీరభద్ర రావు,మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్,జిల్లా పిసిసి సభ్యులు తుమ్మా రాంబాబు, రేమల్ల కేదార్నాథ్,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు అనంత రం మున్సిపాలిటీ పరిధిలో మెరు గైన విద్యుత్ సరఫరా అందిం చాలని ఆలోచనతో నూతనంగా ఏర్పాటు చేసిన అయిదు నూతన ట్రాన్స్ఫార్మర్ల ప్రారంభించారు ఈ క్రమంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కామ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి దాతలను అభినందించారు.

# సంక్షేమం,అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా పరిపాలన...

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా
- ఖమ్మం రూపురేఖలు మార్చుతున్న అభివృద్ధి కార్యక్రమాలు
- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి



ఖమ్మం, జూన్ 02(మనం బ్యూరో): సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప



ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం పెవిలియన్ గ్రౌండ్ వద్ద నున్న అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి నివాళులు అర్పించి, పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు విచ్చేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా రక్షణ కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని నూతనంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 1,187 ప్రభుత్వ పాఠశాలల్లో 61,065 మంది విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు, 6,300 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు.

అభయహస్తం కార్యక్రమం కింద ఖమ్మం జిల్లాలో 59 వేల 448 కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు 2,01,163 మంది కొత్త లబ్ధిదారులకు ఉచిత రేషన్ అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 4,70,591 రేషన్ కార్డుల ద్వారా 13,30,285 మంది లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద 2,45,069 మంది లబ్ధిదారులకు 14,04,752 గ్యాస్ సిలిండర్లను రూ.41 కోట్ల సబ్సిడీతో రూ.500కే అందించామని, మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ఖమ్మం జిల్లా మహిళలు రూ.303.55 కోట్ల మేర ఆదా చేసుకున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాకు 16,243 ఇళ్లు మంజూరు కాగా, లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.441 కోట్లు జమ చేశామని తెలిపారు. 8,291 గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని, రెండవ విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న 2,50,204 కుటుంబాలకు రూ.236.60 కోట్ల సబ్సిడీతో ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులలు, వారి కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చీకటి సూర్యులకు వైద్య సేవలు దూరం

- రామవరం డిస్పెన్సరీకి తాళం
- కొనసాగించాలని ఏఐటీయూసీ పట్టు
- సింగరేణి ప్రధాన వైద్యశాఖ అధికారికి విజ్ఞాపన పత్రం




కొత్తగూడెం సింగరేణి, జూన్2(మనం న్యూస్): సింగరేణి భూగర్భ గనులలో బొగ్గు ఉత్పత్తిని వెలికితీస్తూ కంపెనీ అభివృద్ధికి బాటలు వేస్తున్న చీకటి సూర్యులకు వైద్య సేవలను దూరం చేయడం అత్యంత దుర్మార్గమని పలువురు మండిపడుతున్నారు. భూగర్భ ఓపెన్ కాస్ట్ వివిధ డిపార్ట్మెంట్లలో పనిచేసే కార్మికుల సౌకర్యార్థం కోసం కోల్ బెల్ట్ ప్రాంతమైన రామవరంలో సింగరేణి ఆధ్వర్యంలో డిస్పెన్సరీ(ప్రాథమిక వైద్యశాల)ను గతంలో ఏర్పాటు చేయడం జరిగింది. కార్మికుడికి ఏ అనారోగ్య సమస్య వచ్చిన సేవల కోసం ఈ వైద్యశాలకి వస్తుండేవారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా సింగరేణి కార్మికులే ఉంటారు. వీరికి వైద్య సేవ సేవలందించేందుకు ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని అకస్మాత్తుగా మూసి వేయడం గేటుకు తాళం వేసి సీల్ వంటి వేయడం పట్ల కార్మిక వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. వైద్యశాలను మూసి వేయడం వల్ల కార్మికులు వైద్యం కోసం కొత్తగూడెం సింగరేణి ప్రధానాస్పత్రికి రావడం వల్ల వారిపై ఆర్థిక భారం పడడంతో పాటు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని సింగరేణిలోని వివిధ యూనియన్ నాయకులు వాపోతున్నారు. డిస్పెన్సరీ మూసి వేయడం సరికాదని పేర్కొంటూ కొంతమంది కార్మికులు గుర్తింపు సంఘంగా ఉన్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వారు వెంటనే స్పందించి సింగరేణి ప్రధాన ఆసుపత్రి వైద్యాధికారికి వినతిపత్రం అందించి కార్మికుల వైద్య సేవల కొరకు అందుబాటులో ఉన్న డిస్పెన్సరిని మూసివేయడం సరైనది కాదని దానిని వెంటనే పునరుద్ధరించి సేవలు ప్రారంభించడంతోపాటుగా 24 గంటల వైద్యాధికారి సిబ్బంది ఉండే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. పగలు ముఖ్యంగా రాత్రి సమయంలోనే ఆరోగ్యపరంగా సమస్యలు వస్తుంటాయని ఆ సమయంలో అందుబాటులో ఉన్న వైద్యశాలను మూసివేస్తే చీకటి సూర్యులు పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. వర్షాకాలం సీజన్ కూడా ప్రారంభమైందని ఈ సీజన్లో వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయని దీనిని పరిగణంలోకి తీసుకొని రామవరం డిస్పెన్సరీని నిరంతరం కొనసాగించే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని లేకుంటే పోరుబాట తప్పదని పలు యూనియన్ నాయకులు హెచ్చరిస్తున్నారు.

## 6వ బెటాలియన్‌లో

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



లక్ష్మీదేవిపల్లి, జూన్ 02 (మనంన్యూస్): తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను 6వ బెటాలియన్ చాతకొండలో కమాండెంట్ పి.సి.వి రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి అనంతరం జాతీయ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బెటాలియన్ లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు, సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో కృషి ,త్యాగాల వలన చిరకాల ఆకాంక్ష ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భ వించిందని తెలియచేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృ ద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీసు శాఖ కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విధులలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించడం జరిగింది, తదనంతరం మిఠాయిలు పంపిణీ చేసి, రాష్ట్ర అభివృద్ధి కి మరియు ప్రజల సేవకు అంకితభావంతో పనిచేయాలని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమాండెంట్లు హెచ్.అబ్దుల్ రషీద్, కె శంకర్, మరియధాస్, ఆర్.ఐ లు, ఆర్.ఎస్.ఐ, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జెండాను ఆవిష్కరించిన తహశీల్దార్



చుంచుపల్లి, జూన్ 2 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చుంచుపల్లి తహశీల్దార్ కూచిపూడి నాగరాజు కార్యాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కూచిపూడి నాగరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.

# దేశాభివృద్ధిలో సింగరేణిది కీలక పాత్ర: సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

- సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబరాలు




కొత్తగూడెం సింగరేణి, జూన్ 2(మనం న్యూస్): సుమారు 137 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తోందని అంతేకాకుండా బొగ్గు ఉత్పత్తి ద్వారా విద్యుత్ రంగానికి నిరంతర ఇంధనాన్ని అందిస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సింగరేణి ప్రకాశం స్టేడియంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలోని మొత్తం బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి దాదాపు 7.5 శాతం వాటాను కలిగి ఉందని చెప్పారు. సింగరేణి ఇప్పుడు కేవలం బొగ్గు సంస్థగానే కాకుండా బహుముఖ రంగాలలో అభివృద్ధి చెందుతున్న ఆధునిక శక్తి సంస్థగా రూపాంతరం చెందుతుందన్నారు. సంప్రదాయ బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి సౌరశక్తి పవనశక్తి అరుదైన ఖనిజాల అన్వేషణ వంటి రంగాలలో కూడా అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సింగరేణి 500 మెగావాట్లకు పైగా సౌరశక్తి ప్రాజెక్టులను ప్రణాళికలో ఉంచగా ఇప్పటికే గణనీయమైన సామర్థ్యాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని వివరించారు. 2047 నాటికి 25 మెగావాట్ల పునరుత్పాదక శక్తి ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం సంస్థ దూరదృష్టికి నిదర్శనం అన్నారు. సింగరేణి సంస్థ ప్రస్తుతం ఒడిశాలోని నైని బొగ్గు బ్లాక్ లో కూడా ఉత్పత్తి ప్రారంభించడం విశేషం అన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు మరోసారి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని సింగరేణి సంస్థ మరిన్ని విజయ శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం తిరుమలరావు, సింగరేణి జిఎం పర్సనల్ కవిత నాయుడుతో పాటు పలు డిపార్ట్మెంట్లకు చెందిన జిఎంలు, యూనియన్ నాయకులు, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు కార్మికులు కార్మిక కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డిఈఓగా వాసంతి బాధ్యతల స్వీకరణ



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 02 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డి ఈ ఓ గా వాసంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా విధులలో చేరిన డి ఈ ఓ కు ఆ శాఖా కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్ మరియు కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ఫలితాల పెంపు, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు ప్రత్యేక కృషి చేస్తానని వాసంతి తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### కొత్తగూడెంలో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ





భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 02 (మనం ప్రతినిధి): ప్రజా సంక్షేమం, సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో మంగళవారం ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ముందుగా తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి తుమ్మల ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' పేరిట మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోందన్నారు. గ్రామ, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి వేగవంతంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తుమ్మల తెలిపారు. దేశంలో తొలిసారిగా రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేయడంతో పాటు, రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఎకరానికి ఏడాదికి 12 రూపాయల వేల చొప్పున ఇప్పటివరకు జిల్లాలో 2 లక్షల 7 వేల మూడు 391 మంది రైతుల ఖాతాల్లో ఒక వెయ్యి 44 కోట్ల 39 లక్షల రూపాయలు పెట్టుబడి సాయం నేరుగా జమ చేయడం జరిగిందని, అదేవిధంగా 63 వేల 614 మంది రైతులకు 4 వందల 55 కోట్ల 33 లక్షల రూపాయలు రుణమాఫీ చేయడం జరిగింది. అలాగే ఒక లక్ష 5 వేల 871 మంది రైతులకు రైతు బీమా మంజూరు చేయగా, అందులో 1,924 మంది రైతు కుటుంబాలకు రూ.96 కోట్ల 20 లక్షల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని, వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 530 రైతులకు 3 కోట్లు, ప్రకృతి వ్యవసాయం కు ప్రోత్సాహం అందిస్తున్నామని తుమ్మల తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఆయిల్ ఫామ్, కోకో సాగు విస్తీర్ణంలో మొదటి స్థానంలో మన జిల్లా ఉన్నది. జిల్లాలో 88 వేల 438 ఎకరాలలో ఆయిల్ ఫామ్, 657 ఎకరాలలో అంతర్ పంటగా కో కో సాగు లో ఉ న్నది. బిందు సేద్య పథకం కింద ఎస్సీ ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ మరియు ఇతర రైతులకు 90 శాతం, ఐదు ఎకరాల పైబడిన రైతులకు 80 శాతం సేద్య పరికరాలపై ఇప్పటి వరకు 51 వేల 226 ఎకరాలకు రాయితీని అందించడం జరిగిందని తుమ్మల తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ పనులు పూర్తయ్యి 3 పంప్ హౌసులు ప్రారభించండం జరిగిందని, ప్రధాన కాలువ నుండి ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా నీటి విడుదల జరిగిందని, ఉప ప్రధాన కాలువ పనుల టెండర్లు జరుగుతున్నవి. ఈ ప్రాజెక్ట్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,57,574 ఎకరాల కొత్త ఆయకట్టుకు మరియు చిన్న నీటి తరహా చెరువుల క్రింద గల 42,935 ఎకరాల స్థిరీకరణకు ప్రతిపాదించబడిందని తెలిపారు. సీతమ్మ సాగర్ బహూళార్థక సాధక ప్రాజెక్ట్ కొరకు 3,123 ఎకరాలు భూ సేకరణ పూర్తైందని, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా (పెద్దవాగు, తాలిపేరు, కిన్నెరసాని) 37,060 ఎకరాలకు, 2364 చిన్న తరహా నీటిపారుదల వనరులువీటి యొక్క ఆయకట్టు 1,32 వేల 829 నీటిపారుదల వసతి కల్పించబడుతుందని తెలిపారు. 21 చెక్ డ్యాం లకు 11785.81 లక్షలతో, 7275 ఎకరాలను సాగులోనికి తీసుకురావడానికి జరిగిందిందని, 21 పనులకు టెండర్లు పూర్తై పనులు జరుగుతున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 875 కోట్ల రూపాయలతో 127 రహదారుల పనులు చేపట్టగా అందులో 48 పనులు పూర్తికాగా 79 పనులు పురోగతిలో ఉన్నాయని, రైల్వే లైన్లు మరియు విమానాశ్రయ ఏర్పాటుకై ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. జిల్లాలో 1323 పాఠశాలలో 59088 మంది విద్యార్థులకు పోషకాహార మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. 20 ఎకరాలలో 200 కోట్ల రూపాయలతో జిల్లా లో కొత్తగూడెం, భద్రాచలం అశ్వారావుపేట, ఇల్లందు, పినపాక నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జూలూరుపాడు మండలానికి చెందిన యెల్లంకి కళావతి (జూలూరుపాడు), కేళోత్ బాలూ (సాయిరాం తండా), బడావత్ లలిత (గుండ్లరేవు), చిమట వెంకట నరసమ్మ (శంభునిగూడెం)లకు మంత్రి మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే 478 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.51.06 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. వ్యవసాయ యాంత్రికరణ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు రూ.59.53 లక్షల విలువైన ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## దమ్మపేట ఎస్ఐ బాలస్వామికి రాష్ట్ర విశిష్ట సేవా పురస్కారం!!



దమ్మపేట, జూన్ 02(మనం న్యూస్): దమ్మపేట పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ బాలస్వామి, తెలంగాణ ప్రతిష్టాత్మక విశిష్ట సేవా పథకానికి ఎంపికయ్యారు. పోలీస్ శాఖకు ఆయన అందించిన సేవలు క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు పతకాన్ని ప్రధానం చేయనున్నది.ఈ సందర్భంగా తోటి అధికారులు పోలీస్ సిబ్బంది ఎస్ఐ బాలస్వామికి అభినందనలు తెలిపారు

# గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా టాప్




- **30 విద్యార్థులకు ట్యాబ్ల పంపిణీ చేసిన కేటీఆర్**

**రాజన్న సిరిసిల్ల, జూన్ 2(మనం ప్రతినిధి):** సిరిసిల్ల నియోజకవర్గంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి 30 మంది విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల శాసన సభ్యులు, మాజీ మంత్రి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్ల పట్టణంలోని గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్యాబ్లను పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా కేటీఆర్మాట్లాడుతూ, విద్యార్థుల కష్టానికి గుర్తింపుగా అందిస్తున్న ఈ ప్రోత్సాహకాలు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు ఎంతో అవసరమని, ట్యాబ్లను విద్యాభివృద్ధికి వినియోగించుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. సిరిసిల్ల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లోనూ రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని పేర్కొన్న కేటీఆర్, ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదా, ఉపాధ్యాయులు, సిరిసిల్ల పట్టణ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రతిభను గుర్తించి, విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు నింపే 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం మరోసారి సిరిసిల్లలో విద్యకు, విద్యార్థుల భవిష్యత్తుకు కేటీఆర్ అందిస్తున్న ప్రాధాన్యతను చాటిచెప్పింది.

# పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి

- **ఇన్ఫ్లూయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ విజేతలకు నగదు బహుమతుల ప్రదానం**
- **రాష్ట్ర శాఖ మంత్రి సీతక్క**



**ములుగు ,జూన్ 2 ,మనం ప్రతినిధి:** ములుగు జిల్లా ప్రకృతి అందాలు, చారిత్రక వారసత్వం, పర్యాటక విశిష్టతను సృజనాత్మక కంటెంట్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా జిల్లాను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాల సందర్భంగా ములుగు జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్ఫ్లూయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ - 2026 విజేతలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్లో జరిగిన వేడుకలలో నగదు బహుమతులను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇన్ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ విజేతలకు నగదు బహుమతుల చెక్కులను అందజేసి అభినందించారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలు, ఆదివాసీ సంస్కృతి, ప్రకృతి అందాలు, చారిత్రక వారసత్వాన్ని డిజిటల్ మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలనే లక్ష్యంతో ఈ పోటీని నిర్వహించారు. యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర, లక్నవరం ఉయ్యాల వంతెన, బొగత జలపాతం, గిరిజన సంప్రదాయాలు తదితర అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా పలువురు కంటెంట్ క్రియేటర్లు తమ సృజనాత్మక రీల్స్ను సమర్పించారు. పోటీలో మంగపేట మండలం చేరుపల్లి కొత్తపేట గ్రామానికి చెందిన గాజుల శ్రావణ్ కుమార్ ప్రథమ స్థానంలో రూ.21,000/-, ఏటూరునాగారం మండలం రోహిర్ గ్రామానికి చెందిన పగిడి రాకేష్ ద్వితీయ స్థానంలో రూ.15,000/-, వరంగల్ జిల్లా మామునూర్కు చెందిన గొల్లపెల్లి కావ్య (స్వీటీ) తృతీయ స్థానంలో రూ.10,000/- విజేతలుగా నిలిచి నగదు బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా పర్యాటక, సాంస్కృతిక, ప్రకృతి వైభవాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి పరిచయం చేయాలన్నారు. ప్రధాన మీడియా ఛానల్స్, దినపత్రికలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వేదికగా తెలంగాణ పర్యాటక రంగానికి విశేష ప్రచారం కల్పించాలని కోరారు. జిల్లా ప్రకృతి అందాలు, చారిత్రక వారసత్వం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, గిరిజన సంస్కృతి రాష్ట్రానికే కాకుండా దేశానికి గర్వకారణమని అన్నారు. రామప్ప దేవాలయం, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర, లక్నవరం, బొగత జలపాతం, ఏటూరునాగారం అభయారణ్యం వంటి విశిష్ట పర్యాటక ప్రాంతాలను వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను, సోషల్ మీడియా వేదికలను సృజనాత్మకంగా వినియోగిస్తూ జిల్లా పర్యాటక వైభవాన్ని కోట్లాది మందికి చేరవేసే సామర్థ్యం యువతలో ఉందని కొనియాడారు.

# గ్రామ సభలు, వార్డు సభలు సమన్వయంతో నిర్వహించాలి

- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు**



**ములుగు, మే 2(మనంన్యూస్):** మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు (ఇఖిట), కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 3వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలకార్యక్రమాల కార్యాచరణ ప్రణాళిక ఏర్పాట్లు, వ్యవసాయం, ఐ సీఏడీ, ఇంధనా, పీఆర్ ఆర్డీ (ఖఖఖ), ఎంఏ (ఆ), ప్రణాళిక, విపత్తు నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, పర్యావరణ వారోత్సవాల నిర్వహణతో పాటు గ్రామ, వార్డు సభల ద్వారా ప్రజల్లో పచ్చదనం పెంచేందుకు చెట్లు నాటడం, వర్షాభావ పరిస్థితులు వస్తే ఏ విధమైన పంటలు సాగు చేయాలి, సురక్షిత. మంచినీరు సరఫరా, పంటలు మార్పిడి తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ నెలలో ప్రారంభమయ్యే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఖఐఖ)పై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. రైతులు పంటల మార్పిడి పద్ధతులను అనుసరించి అధిక ఆదాయం వచ్చే పంటల సాగుకు మొగ్గు చూపేలా అవగహన కల్పించాలని తెలిపారు. వర్షాకాల సన్నద్ధత, మొక్కల నాటకం, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలీస్ శాఖతో పాటు అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్రామ, వార్డు సభల నిర్వహణకు షెడ్యూల్ సిద్ధం చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మండలాల వారీగా సాగు చేయాల్సిన పంటలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, డి ఐ ఓ అప్పలనాయుడు, డి ఏ ఓ సురేష్ కుమార్, డి హెచ్ ఓ సంజీవరావు, డి ఆర్ డి ఓ చంద్ర శేఖర్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ నాగరాజు, ఎలక్ట్రిసిటీ డి ఈ నాగేశ్వరరావు, డి ఎం అండ్ హెచ్ ఓ గోపాల్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించిన సర్పంచ్




**మల్హర్, జూన్ 2 (మనం న్యూస్):** వల్లం కుంట గ్రామపంచాయతీలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం గ్రామపంచాయతీ ఆవరణంలో జెండాఎగరవేసిన సర్పంచ్ బొమ్మ రజిత రమేష్ రెడ్డి ,ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కేవలం ఒక రాజకీయ ఉద్యమం మాత్రమే కాదు ప్రజల ఆధ్వర్యంలో సాభిమానం మరియు హక్కులకోసంకొనసాగిన మహాపోరాటంవిద్యార్థులు ఉద్యోగులు రైతులు పిల్లలు మరియు విద్యా వర్గాల ప్రజల ఉద్యమంలో పాల్గొనితమవంతు పాత్రపోషించారు వారి త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం మా పోరాట స్ఫూర్తిని త్యాగాలను మరియు సాధించిన విజయాలను గుర్తు చేసే ప్రత్యేక సందర్భం ఈరోజు తెలంగాణ ప్రజల ఐక్యతను ఆత్మ గౌరవానికి మరియు అభివృద్ధి సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుంది ఈకార్యక్రమంలోఉపసర్పంచ్ కటకం సప్న నరేష్ పాలకవర్గ సభ్యులు అయిత స్వామి గడ్డం ముత్తయ్య గడ్డం ప్రే మ్ అడప శంకరయ్య బాబు శనిగరం సరస్వతి ఎడ్ల అరుణ్ మారపాక కవిత కాజీపేట రాజేందర్ కార్యదర్శి మధుకర్ గ్రామ శాఖ అధ్యక్షులు మెట్టు రామన్న జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు



- **బిఆర్ఎస్ యూత్ వింగ్ నాయకులు ఎన్.సి. సంతోష్**

**గజ్వేల్ జూన్ 2 మనం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ యూత్ వింగ్ నాయకులు ఎన్.సి. సంతోష్ శుభాకాంక్షలు తెలిపారు . మంగళవారం నాడు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల దశాబ్దాల కల నిజమైన రోజు జూన్ 2 అని కొనియాడారు. మన తెలంగాణ త్యాగాల వీరభూమి అని, సంస్కృతి సాంప్రదాయాల పుట్టినిల్లు అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి, పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) కి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. స్వరాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల పోరాటాన్ని స్మరించుకుంటూ, వారికి ఘన నివాళులు అర్పించారు. అలాగే బుధవారం జూన్ 3న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావుకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, హరీష్ రావు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# సీఎం పార్టీపై ప్రజలు అయోమయం

- **కేంద్రంతో కొట్లాడింది కెసిఆర్, తెలంగాణ ప్రజలు**
- **మాజీ జెడ్పీ చైర్మన్ సుధీర్**



**భీమదేవరపల్లి జూన్ 2 మనం న్యూస్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం బిఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రోజున మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూర్ లో తెలంగాణ స్తూపం వద్ద బిఆర్ఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్ హాజరై జాతీయ జెండా ఆవిష్కరించి అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ ఏ పార్టీలో ఉన్నారని అయోమయంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కెసిఆర్ తో తెలంగాణ రాష్ట్ర ప్రజలు మమేకమై రాష్ట్ర సాధనకై కేంద్రంతో కొట్లాడి పోరాడి తెచ్చుకున్న రాష్ట్రమని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం కెసిఆర్ హాయంలో దేశంలోనే అగ్రగామిగా ఉందని, బంగారు తెలంగాణగా వెలసిల్లిందని అన్నారు. తెలంగాణ రైతంగానికి పెట్టుబడి సాయంగా ప్రపంచ దేశాలే ఆశ్చర్యపోయే విధంగా రైతుబంధును ప్రవేశపెట్టి, ఆడబిడ్డల కళ్యాణ లక్ష్మి, వృద్ధులకు ఆసరా పింఛన్ అందించి తెలంగాణ రాష్ట్ర ప్రజలకుకుటుంబానికి పెద్దన్నగా అనేక సేవలు అందించి ఘనత కెసిఆర్ ది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బి.ఆర్.ఎస్ అధ్యక్షులు మండల సురేందర్, మాజీ ఎంపీపీ జక్కుల అనిత రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు శనిగరం సదానందం, సీనియర్ నాయకులు దార్నా శ్రీనివాస్, ఎల్తూరి ప్రభాకర్ మాడుగుల అశోక్, ఎర్రోజువినయ్, గుడి కందుల రాజు, తదితర గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# బి జె పి ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ వేడుకలు

- **జాతీయ జెండాను ఆవిష్కరించిన బీజేపీ నాయకులు**

**గజ్వేల్ జూన్ 2మనం న్యూస్:** గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలవూలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు గాడిపల్లి భాస్కర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్ మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగాలు, బలిదానాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా రాష్ట్రంలో పాలన సాగాలని ఆకాంక్షిస్తున్నాం అని వారు పేర్కొన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే ఏకైక లక్ష్యంతో బీజేపీ నిరంతరం పని చేస్తుందని స్పష్టం చేశారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన వీరుల బలిదానాలను ఎప్పటికీ మరువలేమని, వారిని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు కుడిక్యాల రాములు, రాంరెడ్డి, రమేష్, నాగు ముదిరాజ్, వెంకట్ రెడ్డి, మర్కంటి ఏగొండ, రొట్టెల రాందాస్, సత్యానారాయణ, బిజెపి మహిళా విభాగం,యువజన విభాగం, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ ఆదేశాలతో ఏపూర్ డబుల్ బెడ్రూమ్ ఇండ్లపై ఈఈ రాజు పాండ్య విచారణ



**గూడూరు ప్రతినిధి, జూన్ 02:** గూడూరు మండలంలోని ఏపూర్ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరిష్కు గ్రీవెన్స్ డే సందర్భంగా కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్, రోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్‌బి) కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ) రాజు పాండ్యను విచారణ చేపట్టి, అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్‌బి ఈఈ రాజు పాండ్య, డీఈఈ శ్రీకాంత్తో కలిసి ఏపూర్ గ్రామంలో పర్యటించి డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు, పెండింగ్ బిల్లుల అంశాలపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారులు బానోత్ రామన్న నాయక్, భానోత్ చందా, భూక్యా బిక్కు, ధారావత్ బక్క, భానోత్ శంకర్, వాంకుడోత్ వద్య, ధారావత్ లచ్చు, మాన్సింగ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# కోటి రతనాల వీణ తెలంగాణ ఇప్పుడు అభివృద్ధి రాగాలు పలుకుతుంది

**త్యాగాల పునాదులపై నిర్మితమైనదే తెలంగాణ**

**అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా మన తెలంగాణ**

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో రాష్ట్రం సుసంపన్నం**

**పొన్నం ప్రభాకర్ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి**



**సిద్దిపేట జూన్ 2 ;మనం ప్రతినిధి:** తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు, అది కోట్లాది మంది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ, నేడు అభివృద్ధి మరియు సంక్షేమానికి చిరునామాగా నిలిచింది. తెలంగాణ కోటి రత్నాల వీణ, ఆ వీణ నేడు అభివృద్ధి రాగాలు పలుకుతోందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా సిద్దిపేటలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాళోజీ నారాయణరావు కలలు కన్న ప్రజల తెలంగాణను ప్రజా పాలన ప్రభుత్వంలో మరింత సమానత్వంతో, మరింత ప్రగతితో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి, వారు సద్వినియోగం చేసుకునేలా గ్రామ స్థాయి వరకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నిర్వహించడం జరుగుతుంది. మార్చి ఆరవ తేదీ నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పరిసరాల పరిశుభ్రత మరియు ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ.. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత మరియు పెండింగ్ ఫైళ్ల పరిష్కార కార్యక్రమంలో 3,506 కార్యాలయాలను శుభ్రపరిచి, అనేక పెండింగ్ ఫైళ్ళు పరిష్కరించబడినవి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాలలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 508 రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి, 27,336 మందికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. 4 బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని డ్రైవర్లు, స్కూల్ బస్సుల తనిఖీలు నిర్వహించి, రోడ్ సేఫ్టీపై సూచనలు మరియు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. సంక్షేమ వారోత్సవాలు.. సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థల్లో కిచెన్ మరియు శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థుల్లో పరిశుభ్రత అలవాట్లు పెంపొందించడంతో పాటు వంటశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదుల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది. రైతు వారోత్సవాల సందర్భంగా మట్టి పరీక్షలు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ ద్వారా ఎరువులు పురుగు మందుల పిచికారీ, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై రైతులకు ప్రదర్శనలు నిర్వహించి అవగాహన కల్పించాము. విద్యా వారోత్సవాలలో బాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యాభివృద్ధి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా మహిళా వారోత్సవాల్లో భాగంగా మహిళా సాధికారత, స్వయం ఉపాధి, పోషణ మరియు మహిళల అభివృద్ధికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 9 కోట్ల 24 లక్షల మంది మహిళలు బస్సులలో ఉచిత రవాణా సౌకర్యాన్ని ఉపయోగించుకొని 358 కోట్ల రూపాయల లబ్ధి పొందినారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి, 1,835 వ్యాధులకు ఈ పథకాన్ని విస్తరించగా ఇప్పటివరకు 166 కోట్ల వ్యయంతో 61,094 మంది పేదలకు శస్త్రచికిత్సలు చేసి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు సంక్షేమానికి పెద్దపీట.. జిల్లాలో 10,898 ఇండ్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేయగా, 10,113 ఇండ్లు ప్రారంభించడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు వివిధ దశలలో ఉన్న ఇండ్లకు 238.65 కోట్ల నిదులు చెల్లించబడినవి. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,79,883 మంది లబ్ధిదారులకు రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందించబడుతుంది. ఇప్పటివరకు 7,53,962 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి, రూ.22.82 కోట్ల రూపాయల సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయబడింది. గృహజ్యోతి పథకం కింద ఆహార బద్రత కార్డు ఉండి 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. జిల్లాలో 2 లక్షల 5 వేల 499 కుటుంబాలకు, 163 కోట్ల రూపాయల సబ్సిడీ అందించబడింది.

# సీబీఎస్ఈ చీఫ్‌కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు




**ఢిల్లీ, జూన్ 2:** సీబీఎస్ఈ చీఫ్‌కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది. ఓఎస్ఎం వ్యవస్థ అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్‌తోపాటు సీబీఎస్ఈ చీఫ్ రాహుల్ సింగ్‌ను పార్లమెంటరీ విద్యా స్థాయీ సంఘం ముందు హాజరుకావాలని పార్లమెంటరీ ప్యానెల్ ఆదేశించింది. సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై వివాదం నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. ఈ వివాదానికి సంబంధించిన సాంకేతిక, సైబర్ సెక్యూరిటీ కోణాలను పరిశీలించాల్సిందిగా కమిటీ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ డైరెక్టర్ జనరల్‌కు సూచించింది. తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని విద్యార్థులు లేవనెత్తిన ఆందోళనలను పరిశీలించడానికి విద్యాశాఖ నేడు ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించనుంది. సాంకేతిక లోపాలు, మూల్యాంకనంలో వ్యత్యాసాలు, ఫలితాల అనంతరం ధ్రువీకరణ ప్రక్రియలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇందులో పాల్గొని, తమ సమస్యలు తెలియజేయడానికి విద్యార్థి ప్రతినిధులకు ప్యానల్ అవకాశం ఇచ్చింది.

ఈ సమావేశంలోనే ఓఎస్ఎం వ్యవస్థపై కీలక విద్యాధికారుల నుంచి వివరణ కోరేందుకు చట్టసభ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు 9, 10 తరగతుల్లో సీబీఎస్ఈ త్రిభాషా సూత్రాన్ని అమలుచేయడం పైనా కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని స్టాండింగ్ కమిటీ, విద్యారంగ భాగస్వాములు ఈ సమావేశంలో చర్చించనున్నారు.

# నీట్ పేపర్ లీక్..

## నిందితుడి నివాసంపై బుల్డోజర్ చర్య



**ఢిల్లీ, జూన్ 2:** నీట్-యూజీ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్ పీవీ కులకర్ణి నివాసంపై మహారాష్ట్ర మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బీడ్ జిల్లాలోని ఆయన ఇంటిని నిబంధనలకు అతిక్రమించి నిర్మిస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. దాన్ని తొలగింపునకు నోటీసులు జారీ చేశారు. అనంతరం బుల్డోజర్‌తో నిర్మాణంలో ఉన్న అక్రమ భాగాలను తొలగించే పనిలో నిమగ్నయ్యారు. పీవీ కులకర్ణి బీడ్‌లోని షాహునగర్‌లో గతంలో తన పూర్వీకులు ఉన్న ఇంటి స్థలంలో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఇటీవల పేపర్‌లీక్ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో ఆ కట్టడంపై స్థానిక మునిసిపల్ అధికారులు దృష్టి సారించారు. సర్వే నిర్వహించగా.. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు ఆరోపణలు రావడంతో సమీక్షించిన ఎన్టీఏ మే 12న పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు, ఈ వ్యవహారంలో సీబీఐ ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేసింది.

# సీబీఎస్ఈ ఓఎస్ఎం వివాదం..

## పార్లమెంటరీ ప్యానెల్ ముందుకు 18ఏళ్ల విద్యార్థి



**ఢిల్లీ, జూన్ 2:** సీబీఎస్ఈ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో 18 ఏళ్ల విద్యార్థి సార్థక్ సిద్ధాంత్ పార్లమెంటరీ స్టాండింగ్ ప్యానెల్ ముందు హాజరయ్యారు. ఓఎస్ఎం విధానంతో ప్రభావితమైన విద్యార్థుల్లో ఒకరైన సార్థక్.. ఆ టెండర్ ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. తాను గుర్తించిన అంశాలను కమిటీ వెల్లడించారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం సమావేశమైంది. సీబీఎస్ఈ 12వ తరగతి బోర్డు పరీక్షల్లో ఓఎస్ఎం సిస్టమ్ వినియోగం, అలాగే దానిపై తలెత్తిన ఆందోళనలను చర్చించేందుకు కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ అధ్యక్షతన ఈ కమిటీ భేటీ అయింది. ఇందులో పాల్గొని, తమ సమస్యలు తెలియజేయడానికి విద్యార్థి ప్రతినిధులకు అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలోనే సార్థక్ ప్రజంటేషన్ ఇచ్చారు. కోఎంప్ట్ ఎడ్యుటెక్‌కు కాంట్రాక్టు అప్పగించడానికి ముందే అర్హత, మూల్యాంకన ప్రమాణాలు మార్చారని ఆరోపించారు. ఓఎస్ఎం సిస్టమ్ అమలు తీరు, విద్యార్థులపై దాని ప్రభావం గురించి ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం దిగ్విజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ ''ఆ విద్యార్థి తాను గుర్తించిన విషయాలను వెల్లడించారు. వీటిపై సీబీఎస్ఈ నుంచి సమాధానం కోసం చూస్తున్నాం. తర్వాత కమిటీ నిర్ణయం ఉంటుంది'' అని వెల్లడించారు. వేర్వేరు పార్టీలకు చెందిన 21 మంది లోక్‌సభ ఎంపీలు, 10 మంది రాజ్యసభ ఎంపీలు ఈ ప్యానెల్లో సభ్యులుగా ఉన్నారు. ఓఎస్ఎం వివాదం నేపథ్యంలో సీబీఎస్ఈ చీఫ్‌కు ప్యానెల్ ఇప్పటికే సమన్లు జారీ చేసింది.

# జూన్ 2తో.. త్యాగాల చరిత్రకు న్యాయం

## బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

హైదరాబాద్, మనం ప్రతినిధి : కేసీఆర్ ఉద్యమ నాయకత్వం, సబ్బండ వర్గాల పోరాటం కలిసి తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకున్నదని హరీశ్‌రావు తెలిపారు. సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిపామని చెప్పారు. అమరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుంటూ, తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని ఆకాంక్షిస్తూ.. ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

**పవన్ ఇంటి వద్ద ఉద్రిక్తత..**

హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జనసేన పార్టీ తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, పవన్ తన ఇంటి వద్ద ప్రెస్ మీట్ నిర్వహిస్తారని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు చేరుకోవడంతో పోలీసులు భారీగా మోహరించి వారిని అడ్డుకున్నారు. అయితే, శాంతిభద్రతల సమస్యలు, ట్రాఫిక్ అంతరాయం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల వంటి కారణాలను చూపుతూ సైబరాబాద్ పోలీసులు ఈ సభకు అనుమతి నిరాకరించారు. పోలీసుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ జనసేన పార్టీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా చుక్కెదురైంది. మంగళవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం జనసేన పిటిషన్‌ను కొట్టివేసిన సంగతి తెలిసిందే.



# చీలిక దిశగా మమత పార్టీ

## బెంగాల్ మంత్రి వ్యాఖ్యలు

**కోల్‌కతా, జూన్ 2:** తృణమూల్ కాంగ్రెస్ రెండుగా చీలడానికి సిద్ధంగా ఉందని పశ్చిమ బెంగాల్ మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కనిపించిన పరిస్థితులే ఇక్కడా రానున్నాయన్నారు. ఆ రాష్ట్రంలో శివసేన పార్టీ రెండు ముక్కలైన సంగతి తెలిసిందే. పార్టీ గుర్తు విషయంలోనూ వివాదం నడిచింది. దానిని ఉద్దేశించే మంత్రి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా పెద్దగా ప్రాధాన్యం లేనివారికి టీఎంసీ చోటు కల్పించిందని అందుకే ఇప్పుడు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న అసంతృప్తి బయటపడుతోందన్నారు. టీఎంసీ విచ్ఛిన్నదిశగా ఉందని, చివరకు రాజకీయరంగం నుంచి కనుమరుగవుతుందన్నారు. ఈ నేత 2024లో తృణమూల్ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు.

తిరుగుబాటు వర్గానికి టీఎంసీ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నాయకత్వం వహిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమ పార్టీని ఐప్యాక్ హైజాక్ చేసిందని, అది ఇక మమతా బెనర్జీది కాదని ఈ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సుమారు 50 మంది ఎమ్మెల్యేలు మమత నాయకత్వం నుంచి బయటకు వచ్చి పార్టీ గుర్తును సొంతం చేసుకోవాలనుకుంటున్నారని పార్టీ జాతీయ ప్రతినిధి రిజుదత్తా అన్నారు. రితబ్రత బెనర్జీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కావాలని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారని చెప్పారు. శోభన్‌దేబ్ చటోపాధ్యాయ ఉండాలని మమత భావిస్తున్నారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని రితబ్రత, సందీపన్ సాహాను టీఎంసీ బహిష్కరించింది. అలాగే రిజును సస్పెండ్ చేసింది.ఇదిలా ఉంటే.. ఎన్నికల అనంతరం తమ పార్టీ నేతలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా మమత మంగళవారం కోల్‌కతాలో భారీ ధర్నా చేపట్టారు. ''నేను పోరాడుతాను లేకపోతే చనిపోతాను. ఒక వేదిక ఏర్పాటు చేసుకోవడానికి కూడా మాకు అనుమతి ఇవ్వలేదు'' అంటూ ఈ సందర్భంగా బెంగాల్లోని బీజేపీ ప్రభుత్వంపై దీదీ విమర్శలు గుప్పించారు.

# కావాలంటే అరెస్ట్ చేసుకోండి: మమతా బెనర్జీ

**కోల్‌కతా, జూన్ 2:** అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై దాడిని వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో ధర్నా చేపట్టనున్నారు. అయితే, దీదీ ధర్నాకు అనుమతిచ్చేందుకు పోలీసులు నిరాకరించారు. ఈ క్రమంలో మమత మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అనుమతి ఇవ్వకున్నా ధర్నా నిర్వహిస్తామని.. కావాలంటే తనను అరెస్టు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో పోస్టు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రం మునపటిలా లేదని.. ప్రజలు భయంతో, ఆందోళనతో ఉంటున్నారని మమత ఆరోపించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం నాయకులు పార్టీ ని వీడితే.. అది సంస్థ పునర్నిర్మాణానికి సాయపడుతుందన్నారు. దీనినుంచి టీఎంసీ మరింత బలంగా పుంజుకుంటుందన్నారు. పోలీసుల అనుమతి లేకపోయినా ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అరెస్టు అయ్యేందుకు కూడా తాను సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. పోలీసులు ఒక రాజకీయ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఇక్కడ నిరసన తెలిపేందుకు తనకు అనుమతి ఇవ్వకపోతే.. ఢిల్లీకి వెళ్తానని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత దాదాపు 12 మంది టీఎంసీ కార్యకర్తలు హత్యకు గురయ్యారని.. వేలాది మంది పార్టీ కార్యకర్తలు అరెస్టయ్యారని మమత తెలిపారు.



# అమెరికాలో కాల్పులు.. ఏడుగురు మృతి



**వాషింగ్టన్, జూన్ 2:** అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా అయోవాలో మస్కటీన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో అనుమానిత నిందితుడు కూడా ఉన్నట్లు మస్కటీన్ పోలీసులు తెలిపారు. పార్క్ అవెన్యూలోని ఓ నివాసంలో కాల్పులు జరిగాయని సమాచారం అందడంతో పోలీసులు, వైద్యసిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొన్నారు. అక్కడ తుపాకీ గాయాలతో ఉన్న నలుగురిని గుర్తించారు. వారిని ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయారు. మస్కటీన్‌కు చెందిన ర్యాన్ విల్లీస్ (52)ను నిందితుడిగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొనేలోపే అతడు అక్కడినుంచి పరారయ్యాడు. అతడి కోసం గాలిస్తుండగా.. మరో ప్రాంతంలో విల్లీస్ తుపాకీతో కాల్చుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఇక, మస్కటీన్‌లోని ఓ నివాసంలో, గ్రాండ్‌వ్యూ అవెన్యూలోని ఓ వ్యాపార సముదాయంలో తుపాకీ గాయాలతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. నిందితుడితో సహా వీరంతా ఒకే కుటుంబమని తెలుస్తోంది. కుటుంబంలో వివాదాల నేపథ్యంలో ఈ కాల్పులు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# మెటా ఏఐ బాట్ వాడి

## ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల హ్యాక్

## సైబర్ దుండగుల తెలివి




**కాలిఫోర్నియా, జూన్ 2:** మన వేలితో మన కన్నునే పొడవటం అంటే ఏమిటో టెక్ దిగ్గజం మెటాకు తెలిసొచ్చింది. దాని టూల్‌ను వాడి దాని సోషల్ మీడియా కంపెనీలోని హైప్రొఫైల్ ఖాతాలను హ్యాక్ చేశారు. మెటాకు చెందిన ఏఐ సపోర్ట్ చాట్‌బాట్‌ను వాడుకొని.. హ్యాకర్లు ఇన్‌స్టాగ్రామ్‌లోని హైప్రొఫైల్ ఖాతాలను హ్యాక్ చేశారు. ఈ విషయాన్ని సోమవారం మెటా కూడా అంగీకరించింది. తమ రీసెర్చర్లు ఈ లోపాలను బయటపెట్టాక వాటిని సరిచేసినట్లు వివరణ ఇచ్చింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో యూజర్లు తమ ఖాతాలను పునరుద్ధరించుకోవడానికి సాయం చేసేలా మెటా ఏఐ అసిస్టెంట్‌ను ఏర్పాటుచేసింది. దీనిని తప్పుదోవ పట్టించి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో చొరబడవచ్చని జాక్‌ఎక్స్‌బీటీ, డార్క్ వెబ్ ఇన్ఫార్మర్ అనే సైబర్ భద్రతా నిపుణులు ఇటీవల బయటపెట్టారు. దీంతో ఈ విషయం సంచలనంగా మారింది. ఈ లోపం వల్ల ప్రభావితమైన ఖాతాల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సమయంలో వాడిన వైట్‌హౌస్ ఖాతా, అమెరికా స్పేస్‌ఫోర్స్ చీఫ్ మాస్టర్ సార్జెంట్ జాన్ బెంటివెగ్నా, సౌందర్య ఉత్పత్తుల రీటైలర్ సెఫోరా ఖాతాలు ఉన్నాయి. హ్యాకర్లు టార్గెట్ చేసిన ఖాతాలను కొత్త ఈమెయిల్‌కు ఏఐ అసిస్టెంట్ సాయంతో లింక్ చేయించి వెరిఫికేషన్లు సంపాదించారు. తిరిగి ఆ కోడ్ వాడి సదరు ఖాతా పాస్‌వర్డ్‌ను రీసెట్ చేస్తున్నారు. దీంతో ఆ ఖాతా హ్యాకర్ అధీనంలోకి వెళుతోంది. అయితే ఈ సమస్యను తాము సరిచేసినట్లు తాజాగా మెటా వెల్లడించింది.

# రాజీనామా చేసినా..

# సీఎం బంగ్లాలోనే సిద్ధూ



**బెంగళూరు, జూన్ 2:** ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసినా సీఎం బంగ్లా లోనే ఆయన నివాసం ఉండనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సీఎంగా ఎన్నికైన వారికి అధికారిక బంగ్లా అయిన 'కావేరి'ని నివాసంగా కేటాయిస్తారు. అయితే సిద్ధూ-డీకేల మధ్య ఒప్పందం ప్రకారం సిద్ధరామయ్య సీఎం పదవికి రాజీనామా చేసినప్పటికీ 2028 సంవత్సరం వరకు కావేరి బంగ్లాలోనే ఉండనున్నారు. ఈ క్రమంలో నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న డీకేకు వేరే అధికారిక నివాసం ఏర్పాటుచేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అప్పటివరకు డీకే తన ప్రైవేటు నివాసంలోనే ఉంటూ అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ కార్యకర్తగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన తాను సీఎం స్థాయికి ఎదగడం వెనక గాంధీ కుటుంబం ఉందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఒక యువ కార్యకర్తగా తనలోని సామర్థ్యాన్ని దివంగత పీఎం రాజీవ్ గాంధీ గుర్తించారని అన్నారు. జీవితాన్ని ఏవిధంగా ప్రజా సేవకు అంకితం చేయాలి, ప్రజల హక్కుల కోసం ఎలా పోరాడాలి అనే ఎన్నో విషయాలపై తనకు మార్గదర్శనం చేశారన్నారు. రాజకీయ జీవితం క్లిష్ట దశల్లో ఉన్నప్పుడు సోనియాగాంధీ అందించిన మద్దతే తనను ముందుకు నడిపిందన్నారు. రాహుల్ గాంధీ నుంచి ప్రజాస్వామ్య విలువలు, అన్యాయాన్ని వ్యతిరేకించే వైఖరిని నేర్చుకున్నానని పేర్కొన్నారు. నిజమైన నాయకులు కేవలం విజయాలు సాధించిన సమయాల్లోనే అండగా నిలబడరని.. అత్యంత కష్ట సమయాల్లోనూ పక్కనే ఉంటారని అన్నారు. కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ జూన్ 3న సాయంత్రం 4:05 గంటలకు లోక్‌భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. పరిమిత అతిథుల సమక్షంలో నిరాడంబరంగా ఈ కార్యక్రమం నిర్వహించాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

# అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్,జూన్ 02(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అమరవీరుల త్యాగాలకు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ

ఆధునిక తెలంగాణ నిర్మాణానికి పునాదులు వేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా స్మరించుకోవాలని గవర్నర్ పిలుపునిచ్చారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే సూక్తిని ప్రస్తావిస్తూ, జన్మభూమి స్వర్గం కంటే గొప్పదని పేర్కొన్నారు. తెలంగాణ శతాబ్దాల నాటి సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వ్యవసాయ వారసత్వం రాష్ట్ర అసలైన జీవనాడిగా నిలిచాయని గవర్నర్ అన్నారు. కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువుల నుంచి నేటి ఆధునిక సాగునీటి ప్రాజెక్టుల వరకు రైతాంగం చేసిన కృషి తెలంగాణను సస్యశ్యామలం చేసిందని కొనియాడారు.వ్యవసాయ రంగంతో పాటు ఐటీ, ఫార్మా, స్టార్టప్ తదితర రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, 'సర్వే జన సుఖినః భవంతు'అనే ఆదర్శ స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, నగరాల ఆధునికీకరణ సమపాళ్లలో సాగుతూ సుసంపన్న తెలంగాణ నిర్మాణం జరగాలని గవర్నర్ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని గవర్నర్ ఆకాంక్షించారు.వేడుకల్లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణా చారి, లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# నా భర్తను చంపిన హంతకుడికి చాట్ జీపీటీ సాయం

## వందన జోషి కేసు




**వాషింగ్టన్, జూన్ 2:** తన భర్తను హత్య చేసేందుకు దుండగుడికి చాట్‌జీపీటీ సాయం చేసిందని ఓపెన్ ఏఐ సీఈవో శామ్‌ఆల్ట్‌మన్‌పై భారతీయ మూలాలున్న వందనా జోషీ కేసు వేశారు. ఆమె భర్త తిరు ఛబ్బా 2025 ఏప్రిల్ నెల ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీలో జరిగిన కాల్పుల్లో చనిపోయాడు. నిందితుడు ఫీనిక్స్ ఇక్నెర్ దాడికి కొన్ని నెలల ముందు నుంచే చాట్‌జీపీటీ నుంచి వివరాలు సేకరించినట్లు జోషీ తన ఆరోపణల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇక్నెర్ 10,000 మెసేజ్లను చాట్‌జీపీటీకి పంపి.. తుపాకులు, ఆత్మహత్య, మాస్ షూటింగ్ వంటి వాటి వివరాలు తెలుసుకొన్నాడు. ఒక దశలో ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ రద్దీగా ఉండే సమయం ఏమిటో వాకబు చేశాడు. దీనికి వీక్‌డేస్‌లోని లంచ్‌టైమ్ ఉండే ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అని సమాధానం ఇచ్చింది. అందుకుతగినట్లే షూటింగ్ జరిగిన రోజు ఇక్నెర్ స్టూడెంట్ యూనియన్‌కు 11.59కి చేరుకొన్నాడు. ఈ కాల్పుల ప్లానింగ్‌కు చాట్‌జీపీటీనే కేంద్రంగా ఉందని జోషీ ఆరోపించారు. కాగా, ఈ ఆరోపణలను ఓపెన్‌ఏఐ తిరస్కరించింది. భయంకరమైన నేరాలకు, చాట్‌జీపీటీకి ఎటువంటి బాధ్యత వహించదని పేర్కొంది. బహిరంగంగా ఉండే ఊహాజనిత సమాచారం ఆధారంగానే చాట్‌జీపీటీ వివరాలు వెల్లడించిందని ఓపెన్ ఏఐ తెలిపింది. అక్రమ, ప్రమాదకర చర్యలను చాట్‌జీపీటీ ప్రోత్సహించకుండా తాము తీసుకొనే చర్యలు కొనసాగుతాయని వెల్లడించింది. చాట్‌జీపీటీ వల్ల పిల్లలకు హాని కలుగుతోందని ఫ్లోరిడా కోర్టులో ఓ కేసు దాఖలైంది. స్కూళ్లల్లో కాల్పులు జరిపే షూటర్లకు ఇది ప్రమాదకర సమాచారం అందజేస్తోందని పేర్కొంది. ఓపెన్ ఏఐ, శామ్ ఆల్ట్‌మన్‌పై ఈ రకంగా చర్య తీసుకొన్న తొలి రాష్ట్రంగా ఫ్లోరిడా నిలిచింది. చాట్‌జీపీటీలో కొన్ని ఆప్షన్లను అందుబాటులోకి తీసుకురావడంలో శామ్ ఆల్ట్‌మన్ పాత్ర ఎక్కువగా ఉండటంతో ఆయన పేరును కూడా కోర్టులో ప్రస్తావించినట్లు ఆ రాష్ట్ర అటార్నీ జనరల్ పేర్కొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- దేవాలయం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సిహెచ్ వెంకట్ రెడ్డి



నల్లగొండ --జూన్ 2 (మనం న్యూస్ ): నల్గొండ జిల్లా, కనగల్ మండలం, ధర్వేశిపురం లో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని మోడల్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేవాలయ అభివృద్ధికి అన్ని రకాల సహాయ ,సహకారాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద కళ్యాణమండపము, వాటర్ ట్యాంకు కట్టించడం జరిగిందని, 50 కోట్ల రూపాయల కేంద్ర రహదారుల నిధులతో నల్గొండ నుండి ధర్వేశిపురం వరకు రహదారిని నిర్మించనున్నామని, టెండర్ పూర్తయిందని రేపటినుండి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే ధర్వేశిపురం ప్రాంతంలో ఒక పెద్ద ఇండస్ట్రీని ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. 239 కోట్ల రూపాయలతో ధర్వేశిపురం మీదుగా గుర్రంపోడు- కొండమల్లేపల్లి- దేవరకొండ- డిండి వరకు హ్యాం రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన ధర్వేశిపురం లోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం మంత్రి మాట్లాడుతూ ధర్వేశిపురం ను మోడల్ గా తీర్చిదిద్దడంలో భాగంగా త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిని ధర్వేశిపురానికి తీసుకురానట్లు తెలిపారు. ఎక్కడైనా రహదారులు బాగుంటేనే అన్ని సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలో 1300 కోట్ల రూపాయలతో 480 రోడ్లను డబుల్ రోడ్లు చేసేందుకు టెండర్లు పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు. ధర్వేశిపురం, కనగల్ మండలం లో ఇండ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. నల్గొండ జిల్లా అభివృద్ధిలో భాగంగా ఏఎమ్మార్పీ కాలువల లైనింగ్ చేపట్టడం జరిగిందని ,రానున్న 2 ఏళ్లలో ఎస్ఎల్ బిసీ సోరంగం పూర్తయితే రెండు పంటలు పండుతాయని చెప్పారు.

# పోరాడి సాధించిన తెలంగాణ దేశానికే ఆదర్శం



- 60 సంవత్సరాల పోరాటం ఎందరో అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఏర్పాటు
- అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం
- ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలతో ప్రభుత్వం ముందుకు
- తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకల్లో మంత్రి ఉత్తమ్



**సూర్యాపేట, జూన్ 02 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటితో పన్నెండు నేటితో 12 ఏళ్లు పూర్తి కావడంతో రాష్ట్ర మంతటా తెలంగాణా అవతరణ దినోత్సవ వేడుకల పురస్కరించుకొని రాష్ట్ర సివిల్ సప్లై నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు హాజరై జ్యోతి ప్రజ్వల వెలిగించి వేడుకలు ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ......ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణను ఏర్పరచాలని 1969 లో మొదలైన ఉద్యమం దాదాపు 60 సంవత్సరాలు కొనసాగి, జూన్ 2, 2014 న ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంగా ఏర్పడింది. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నాను. తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగం వెలకట్టలేనిది. ఈ సందర్భంగా అమరుల కుటుంబాలకు, ఉద్యమ కారులకు, చిన్నా పెద్దలందరికీ.. పేరుపేరున నా హృదయ పూర్వక నమస్కారాలు తెలుపుతున్నాను అన్నారు.తెలంగాణ రాష్ట్ర చరిత్ర ఎంతో గొప్పది. అనేక సాంప్రదాయ కళలు, చారిత్రక ప్రదేశాలు మరియు స్మారక చిహ్నాలు ఉన్నాయి. తెలంగాణలో విభిన్న వర్గాల జనాభా మరియు వివిధ ప్రాంతాల ప్రజలు సామరస్యంతో జీవిస్తున్న సంగతి మనందరకూ తెలిసిందే. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా, రాష్ట్ర వారసత్వం, చరిత్ర ప్రతిబింబించేలా వివిధ సాంస్క ృతిక కార్యక్రమాలు మరియు వేడుకలు నిర్వహించుకుంటున్నాం. ఎందరెందరో అమర వీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచేలా మన ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**మహాలక్ష్మి పథకం ఉచిత బస్...**

తెలంగాణ ప్రభుత్వం 6 గ్యారంటీలలో భాగంగా మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్ ప్రయాణం కల్పించనైనది. మహిళలు తమ డబ్బు ఆదా చేసుకొని స్వేచ్ఛగా ప్రయాణించి చదువు, ఉద్యోగం మరియు వ్యాపార అవకాశాలను పొందుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 5 కోట్ల 13 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉచిత ప్రయాణాన్ని పొంది రూ. 307 కోట్ల 22 లక్షల మొత్తాన్ని ఆదా చేసుకోవడం జరిగింది అని తెలిపారు. అదేవిధంగా రూ. 500 కు ఔ్యా గ్యాస్: ఈ పథకం ద్వారా పేద మధ్యతరగతి కుటుంబాలపై గృహ వినియోగ వ్యయ భారం తగ్గడంతో పాటు, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడింది. జిల్లాలో ఇప్పటి వరకు 6 లక్షల 43 వేల 88 సిలిండర్లు పంపిణీ చేయబడ్డాయి. ఇందుకు గాను సబ్సిడీ మొత్తం 18 కోట్ల 14 లక్షల రూపాయలు లబ్దిదారులకు అకౌంటు ద్వారా జమ చేయడం జరిగిందనివెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలగు మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు మరియు చేయూత పథకాల అమలుకొరకు కృషి చేస్తూ సూర్యాపేట జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తంకుమార్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు. తెలియజేశారు. అంతకుముందు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు ప్రధానం చేశారు అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను పరిశీలించారు. విద్యార్థుల చేత నిర్వహించిన సాంస్క ృతిక. కార్యక్రమాలను తిలకించారు. అనంతరం తెలంగాణ అమరవీర కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ ఘనంగా సన్మానించారు.ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ జిల్లా ఎస్పీ కే నరసింహ అదనపు కలెక్టర్ హరి సింగ్ నాయక్. వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం



- పాల్గొన్న మంత్రి పొన్నం

**సిద్దిపేట జూన్ 2; మనం ప్రతి నిధి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సిద్దిపేట లో మంగళవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు అధికారికంగా అవతరణ దినోత్సవ వేడుకలు జరగగా మంత్రితోపాటు ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు. సిద్దిపేటలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంతకు ముందు రంగధాం పల్లి చౌరస్తా వద్ద అమరవీరుల స్థూపం వద్ద మంత్రి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కే హైమావతి, సి పి సాధన రష్మీ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు. కాగా సిద్దిపేట జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాపయ్య సార్, పెద్దిరాజు, సత్తయ్య సార్, డి బిఎఫ్ శంకర్, కూతురు రాజిరెడ్డి,గజ్వేల్ జేఏసీ నాయకులు ఎల్లారెడ్డి, నర్సింగ్ రావు, ఎల్లయ్య, నాగేంద్రరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇంకా బిఆర్ఎస్, బిజెపి, ఇతర ప్రజాసంఘాల నాయకులు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు.

## అనాథ, నిరాశ్రయ చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- మంత్రి సీతక్క



**ములుగు, జూన్ 2 ,మనం ప్రతినిధి:** అనాథ, నిరాశ్రయ చిన్నారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా గట్టమ్మ దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన బాలసదనం చిల్డ్రన్స్ హోమ్ భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అనాథలు, నిరాశ్రయులు, సంరక్షణ అవసరమైన చిన్నారులకు సురక్షితమైన వసతి,నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, మెరుగైన భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. చిన్నారుల సంక్షేమం, భద్రత, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అనాథ బాలలు, తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులకు ప్రభుత్వ సంస్థలే కుటుంబ సభ్యులుగా నిలవాలని పేర్కొన్నారు. ప్రేమతో, ఆప్యాయతతో ఆదరించి ఉన్నత భవిష్యత్తు వైపు వారిని నడిపించాలని సూచించారు. బాలసదనాలు, కౌన్సెలింగ్ కేంద్రాలకు వచ్చే బాధిత మహిళలు, బాలికలతో అధికారులు, సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. తమ కుటుంబ సభ్యులకు కూడా చెప్పుకోలేని బాధలను సంక్షేమ కేంద్రాల్లో స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణం కల్పించాలని అన్నారు. బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపి, జీవితంపై నమ్మకం పెంచి, స్వయం సమర్థులుగా తీర్చిదిద్దడం ప్రతి సిబ్బంది బాధ్యత అని తెలిపారు. బాలసదనం కేవలం వసతి గృహం మాత్రమే కాదని, చిన్నారుల ఆశయాలు, కలలు సాకారం అయ్యే ఆత్మవిశ్వాస కేంద్రంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులకు కుటుంబ వాతావరణంలో ప్రేమ, ఆప్యాయత, విద్యా అవకాశాలు కల్పించడం ద్వారా వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన సంరక్షణ, విద్య, ఆరోగ్య సేవలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, వారి భవిష్యత్తు బంగారు బాటలో సాగేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన శిక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి బాలిక విద్యను పూర్తి చేసుకుని తన కాళ్లపై తాను నిలబడే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, గ్రంధాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు



- వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

**ములుగు, జూన్ 2, మనం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభసందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన వేడుకలకు మంత్రి దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాట స్ఫూర్తి ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొంటూ అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తూ ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐక్యత, సౌభ్రాతృత్వంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్లు, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, గ్రంధాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి ఇంచార్జీ ఆర్డీవో ప్రతాప్, ప్రజా ప్రతినిధులు, స్వతంత్ర సమరయో ధులు, తెలంగాణ అమరవీరుల కుటుంబ స భ్యులు, జిల్లా అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## నేడు నకిరేకల్‌లో టియుడబ్ల్యూజే జిల్లా మహాసభ



- ప్రతి మండలం,పట్టణాల నుంచి భారీగా తరలి రావాలి
- టియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి

**నల్లగొండ,జూన్ 2 ( మనం ప్రతినిధి):** నేడు నకరికల్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే టి యు డబ్ల్యు జె ( ఐ జే యు) జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నకరికల్ లో జిల్లా మహాసభ జరిగే ఫంక్షన్ హాల్ పరిశీలనతో పాటు అనంతరం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు ప్రతి మండలం ప్రతి పట్టణం నుంచి జర్నలిస్టులు భారీగా తర రావాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం హక్కుల కోసం నిరంతరం కృషి చేసే ఏకైక సంఘం టి యు డబ్ల్యు జె ( ఐజేయు) నని తెలిపారు. మహాసభలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనేక ముఖ్యమైన తీర్మానాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని అన్నారు. ప్రతిజర్నలిస్టుకు అక్రిడిటేషన్ తోపాటు ఇంటి స్థలం ఇంటి నిర్మాణం, హెల్త్ కార్డుతో పాటు అనేక సౌకర్యాలను కల్పించడం కోసం టి యు డబ్ల్యు జే నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ సమాజంలో జిల్లా నాయకులతోపాటు నకే రికల్ నియోజకవర్గ నాయ కులు, జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేరిన రోజు



**నేరేడుచర్ల, జూన్ 2 మనం న్యూస్:** నీళ్లు నిధులు నియామకాల లో జరుగుతున్న అన్యాయాన్ని కవులు కళాకారులు రాజకీయ నాయకులు యువత ఉద్యోగస్తులు తో సహా నాలుగు కోట్ల ప్రజల సుదీర్ఘ పోరాటంతో 2 జూన్ 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని. నేటికి సరిగ్గా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని పలువురు పుర ప్రముఖులు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో జాతీయ నాయకుల ఫోటోలు ఆవిష్కరించి పూలమాలలతో సత్కరించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తెలంగాణ అవతరణ దినోత్సవం మంగళవారం జరుపుకున్నారు. నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో గల స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ సురిగి సైదులు గౌడ్, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సోమ సుందర్ రెడ్డి, మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి జావేద్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జై తెలంగాణ జై జై తెలంగాణ అంటూ సంబరాలు జరుపుకున్నారు. జాతీయగీతం తో పాటు జయ జయహే తెలంగాణ అంటూ తెలంగాణ గీతం పాడుకున్నారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్త్రు సైదిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చన్నబోయిన నాగరాజు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సన్నీ, బొలి శెట్టి లక్ష్మయ్య శ్రీకాంత్ శ్రీను అలక శ్రావణ్ రెడ్డి ఖాదర్ జంగయ్య బచ్చలకూరి ప్రకాష్ ఆకారపు వెంకటేశ్వర్లు కొనతం నాగిరెడ్డి, జనసేన నాగేశ్వరరావు దూలిపాల ధనుంజయ నాయుడు సంకల మద్ధి సత్యనారాయణ రెడ్డి, రమేష్ తాళ్ల నరేందర్ రెడ్డి రెడపంగ నాగయ్య కొనతం సీతారాం రెడ్డి కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, రాచకొండ కోటేశ్వరరావు, హు స్సేన్, యామిని వీరయ్య కొనతం ఆదిరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

- 1969 నుండి 2014 వరకు త్యాగాలే తెలంగాణ రాష్ట్ర సాధన



**కోదాడ, జూన్ 02(మనం న్యూస్) :** 1969 నుండి 2014 వరకు వివిధ దశలలో సాగిన తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది ఆత్మహత్యల త్యాగఫలితమే తెలంగాణ రాష్ట్ర సాధన అని సర్పంచి మందుల నాగయ్య అన్నారు. మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గ్రామ సర్పంచి మందుల నాగయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమాటి వరప్రసాద్ రెడ్డి లు పాల్గొని జండా ఎగరవేసి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ అంశంపై 2010లో శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటై ఆరు ప్రతిపాదనలు చేసింది. ఆ ప్రతిపాదనలతో 2013, జూలై 30న ప్రత్యేక తెలంగాణ కొరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటి తీర్మానం చేయగా, 2013 అక్టోబరు 3న కేంద్ర మంత్రిమండలి ఆమోదం లభించిందని అన్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను ఆదేశిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు, లేదా తెలంగాణ బిల్లు ను ప్రవేశపెట్టింది. 2014 జూన్ 2వ తేదీన దేశంలో 29వ రాష్ట్రంగా నూతనంగా అవతరించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన త్యాగం ఎనలేనిదని కొనియాడారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డి ఆశీస్సులతో గుడిబండ గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇర్ల నరసింహారెడ్డి, ఉప సర్పంచి జయసింహారెడ్డి, పాలకవర్గ వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది, ప్రజలు పాల్గొనడం జరిగింది.

## గ్రామ వార్డు సభతో అభివృద్ధి సంక్షేమం జనంలోకి తీసుకెళ్లాలి

- ఖరీఫ్‌లో ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు
- ప్రతి జిల్లాకు ప్రత్యేక విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- లోటు వర్షపాతంతో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌కే రామకృష్ణ



**సూర్యాపేట జూన్ 2 (మనం ప్రతినిధి):** గ్రామ సభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, డీజీపీ సి.వి. ఆనంద్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య తో కలిసి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా ఎస్పీ కె నరసింహ ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ...ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం చివరి దశకు చేరుకుందని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కార్యక్రమం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.జూన్ 4, 6, 8, 10 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్లలో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం అమలులో ఉన్న పర్యావరణ కార్యక్రమాలకు అదనంగా ఈ సభలను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.గ్రామ, వార్డు సభలలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేయాలని సూచించారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిని కూడా గ్రామ సభలలో చర్చించాలని తెలిపారు.నాలుగు రోజుల వ్యవధిలో జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు.భారీ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పై కొంత వ్యతిరేక ప్రచారం జరుగుతోందని, దీనిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.గ్రామ సభలలో పంటల మార్పిడి విధానం పై వ్యవసాయ శాఖ విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, కలెక్టర్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. రాబోయే ఖరీఫ్ సీజన్కు సంబంధించి ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎరువుల బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువుల నిల్వలు, డీలర్ల గోదాములపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. నకిలీ విత్తనాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ఇందుకోసం విడుదల చేసిన నిధుల వినియోగ ధ్రువపత్రాలను వెంటనే సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు.

**పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య మాట్లాడుతూ....రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో మురుగు కాల్వల శుభ్రత, తాగునీటి పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కల పెంపకం కార్యక్రమాలు, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్పిట్ల నిర్మాణంపై గ్రామసభలలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రణాళికలను కూడా గ్రామసభల్లో వివరించాలని తెలిపారు.

**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలి**

వ్యవసాయ శాఖ కార్యదర్శి కె సురేంద్ర మోహన్ మాట్లాడుతూ.... వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 21 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి కందులు, జొన్నలు, ఉలవలు, మొక్కజొన్న, శనగలు, మినుములు, పెసర్లు, ఆయిల్పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగు వైపు రైతులను ప్రోత్సహించి అవగాహన కల్పించేలా చూడాలని వెల్లడించారు.

**అధికారులు పోలీసు శాఖ సమనంతో ముందుకు..**

డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ...గ్రామసభలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో పోలీసు శాఖ అధికారులు అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రత అంశాలపై గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నప్పటికీ, కురిసే వర్షాలు భారీ స్థాయిలో ఉండవచ్చని, వరదలు తదితర విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లాలు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు పలు సూచనలు చేశారు ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జూన్ 4,6,8,10 తేదీలలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో గ్రామ సభల, పట్టణ ప్రాంతాలలో వార్డు సభలను విజయ వంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈవో శిరీష, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, జిల్లా ఫైర్ అధికారి కృష్ణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీనే సహకారం చేసింది



- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంది
- టీజీ ఐ ఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జూన్ 2 మనంప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారమే తెలంగాణ వచ్చిందని టీజీఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం నాడు సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారమే తెలంగాణ ప్రజల దశాబ్ద కళ అయిన ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీని సహకారం చేసిందని గుర్తు చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమరుల ఆశాలకు అనుగుణంగా నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టిటిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జార్జ్ మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ నాయకులు కోన సంతోష్ మహేష్ ముదిరాజ్ కౌన్సిలర్లు సంగీత మహేష్ వంశీ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఆస్తులు అందజేసిన మంత్రి కొండా



హనుమకొండ, జూన్ 02(మనం ప్రతినిధి): రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికనా ఆర్థిక సహకారానికి పెద్దపీట వేస్తూ, P –&MEPMA విభాగం ద్వారా 102 స్వయం సహాయక సంఘాలకు (ఖిఏఎట) ఏకంగా రూ. 12 కోట్ల విలువైన బ్యాంక్ లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే, ౹ఖ్మఅ శాఖ ద్వారా 4 బ్యాంక్ లింకేజీ చెక్కులను అందించడంతో పాటు, ఖూఉఏఅ గ్రూపులకు 11 సైకిళ్లను పంపిణీ చేశారు. సామాజిక సంక్షేమంలో భాగంగా, జిల్లా సంక్షేమ అధికారి పర్యవేక్షణలో ట్రాన్స్జెండర్లకు రూ. 75,000/- చొప్పున మొత్తం 8 సబ్సిడీ చెక్కులను అందజేయడం జరిగింది. విద్య మరియు పర్యావరణ రంగాలలో గుర్తింపు విద్యా మరియు పర్యావరణ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ౹ఖ్మఅ శాఖ ద్వారా వయోజన విద్యకు సంబంధించిన 'ఔఔఅఖి' సర్టిఫికేట్లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్లలో పర్యావరణ పరిరక్షణలో అద్భుతమైన ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అదేవిధంగా, జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసా పత్రాలను బహూకరించారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


**తెలంగాణ అమరవీరుల కుటుంబాల ఘన సన్మానం**

**అమరవీరుల త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయి పొంగేటి శ్రీనివాసరెడ్డి**

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి**

**తెలంగాణ రాష్ట్రంలో పాలన పాదదర్శకంగా ఉండాలి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది**



హనుమకొండ జూన్ 02(మనం ప్రతినిధి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు హన్మకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో మంగళవారం అత్యంత వైభవంగా, నిర్వహించబడ్డాయి ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలను వివరిస్తూ మంత్రి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ శ్రీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కె.ఆర్. నాగరాజు, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సన్ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్పాయి, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ శ్రీ ఇనగాల వెంకట్రామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నగర ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. -తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘనంగా సన్మానించి వారి సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు, విద్యార్థులు తమ ప్రతిభతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించిన శాఖల ప్రదర్శనలు జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేశారు. డీఆర్డీఏ, మెప్మా, జిల్లా మహిళా



మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ, టీజీఎస్పీడీసీఎల్, గృహ నిర్మాణ శాఖ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖల స్టాళ్లను మంత్రి సందర్శించి శాఖల కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్తో పాటు ఇతర అధికారులు కూడా ప్రదర్శనలను పరిశీలించారు.

## పోలీసులను అభినందించిన సీపీ

హనుమకొండ జూన్ 02(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతులు మీదుగా మహోన్నత సేవా పతకం, ఉత్తమ సేవా పతకం సేవ పతకాలను అందుకున్న పోలీసు అధికారులను మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రీత్ సింగ్ అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ నిజాయితీగా కష్టపడి పనిచేసే పోలీస్ అధికారులకు శాఖా పరమైన గుర్తింపుతో పాటు ప్రభుత్వ నుండి పతకాలు కూడా అందుతాయని పోలీస్ కమిషనర్ తెలియజేశారు. పతకాలను అందుకున్న వారిలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ మహోన్నత సేవ పతకాన్ని అందుకోగా, ఉత్తమ సేవా పతకాలను క్రైమ్ ఏసీపీ సదయ్య,ఎస్. ఐ వేణుగోపాల్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ రమేష్, సేవా పతకాలను ఎస్. ఐ కనకచంద్రం, ఏ.ఎస్. ఐలు జయదేవ్,పాపయ్య, చేరాలు, అర్జున్, శ్యాం సుందర్,హెడ్ కానిస్టేబుళ్ళు అమీర్ పాషా, నర్సింగ రావు, స్వర్ణ లత వున్నారు.

## అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- **తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు**



**మల్హర్, జూన్ 2 (మనం న్యూస్):** మండల కేంద్రమైన తాడిచర్లలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు బూడిద సతీష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిచెర్ల హనుమాన్ సెంటర్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టియూఎఫ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలోజు సత్యనారాయణ, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు యాదండ్ల గట్టయ్య యాదవ్ హాజరై మాట్లాడారు. దశాబ్దాల ఆకాంక్ష, ఎందరో వీరుల ఆత్మబలిదానాలు, అక్రమ కేసులు, అరెస్టులను లెక్కచేయకుండా జైలు గోడలను ముద్దాడిన త్యాగధనుల పోరాట ఫలితమే నేటి తెలంగాణ స్వరాష్ట్రం అని కొనియాడారు. కవుల అక్షరాలు, కళాకారుల పాటల ఉద్యమ కెరటాల వల్లనే తెలంగాణ సిద్ధించిందన్నారు.అయితే, గత ప్రభుత్వం ఉద్యమకారులను, ఉద్యమ ఆకాంక్షలను పూర్తిగా విస్మరించిందని వారు విమర్శించారు. ఎందరో కొట్లాడి సాధించిన తెలంగాణను కేవలం ఒక్కడి వల్లే వచ్చిందనే అహంకారపూరిత మాటలతో అమరుల త్యాగాలను, ఉద్యమకారులను అవమానించారని మండిపడ్డారు. అందుకే తెలంగాణ సమాజం గత పాలకులకు తగిన గుణపాఠం చెప్పిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారులు టియూఎఫ్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, బడితల వెంకటస్వామి, చొప్పరి రాజు, షేక్ చాంద్ పాష, బండారి యశోద, గడ్డం సమ్మక్క, మీనుగు నాగేష్, ఆకుల రాజేశం, ఆకుల సదానందం, బండారి శంకరయ్య, గణేష్, రేకుంట గోవర్ధన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

**హనుమకొండ జూన్ 02(మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిలా వరంగల్ కుష్మహల్ ప్రాంగణంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారి తో పాటు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,డిసిపి అంకిత్ కుమార్ గార్లు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. ఖుషి మహల్ లో ఏర్పాటుచేసిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొని పోలీసుల గౌరవ వందన శ్రీకారం అనంతరం పతాకావిష్కరణ చేసి జిల్లా ప్రగతి సందేశానికి ప్రజలకు వివరించారు.అనంతరం సంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ అనంతరం వివిధ శాఖల అసెట్స్ పంపిణీ చేయడం చేశారు. అనంతరం వివిధ శాఖల



ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను మంత్రివర్యులు మరియు జిల్లా కలెక్టర్ డీ ఎఫ్ ఓ, అదనపు కలెక్టర్ పరిశీలించారు.. మీరు వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలు విజయవంతం



- **108 అంబులెన్స్ సేవలకు కలెక్టర్, డీఎంహెచ్ఓ ప్రశంసలు**

**మహాదేవపూర్ జూన్ 2(మనం న్యూస్):** మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలువిజయవంతంగాముగిశాయి.ఈ పుష్కరాల సందర్భంగా జయశంకర్భూపాలపల్లి జిల్లా108అంబులెన్స్ సిబ్బంది తీవ్ర ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులకు నిరంతర అత్యవసర వైద్య సేవలు అందించారు. పుష్కరాల కాలంలో మొత్తం 650 మందికి పైగా రోగులకు అత్యవసర వైద్యసేవలు అందించి, అవసరమైన వారికి ఆసుపత్రులకు తరలించారు. ముఖ్యంగావడదెబ్బ, జ్వరాలు, ప్రమాదాలు, కిందపడటం, డీహైడ్రేషన్ తదితర అత్యవసర కేసులకు సకాలంలో స్పందించి ప్రాణాలను కాపాడారు.తీవ్రమైన వేసవి పరిస్థితుల్లో కూడా 108 పైలట్లు, ఈఎంటీలు, జిల్లా నిర్వహణ బృందం మరియు సహాయకసిబ్బందిఅంకితభావంతో పనిచేసి సేవలను సమర్థవంతంగా నిర్వహించారు.108 అంబులెన్స్ సిబ్బంది అందించిన విశిష్ట సేవలను జిల్లా కలెక్టర్ మరియు డీఎంహెచ్ఓ డా. మధుసూదన్ అభినందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ వంకుడోత్ రాజు నాయక్ మాట్లాడుతూ,పుష్కరాల విజయవంతమైన నిర్వహణలో భాగస్వాములైన ప్రతి పైలట్, ఈఎంటీ మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎండలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించిన 108 సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా సేవలో 108 అంబులెన్స్ సిబ్బందిమరోసారి తమ అంకితభావాన్ని చాటుకుని, సరస్వతి అంత్య పుష్కరాల విజయానికి ముఖ్య భూమిక పోషించారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు

**మహాదేవపూర్ జూన్ 2మనం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా మహాదేవపూర్ బిజెపి మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ ఆధ్వర్యంలోవేడుకలను నిర్వహించడం జరిగింది వారు మాట్లాడుతూ అమరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షలు, ఉద్యమ స్ఫూర్తితో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు మన భాష, మన యాస, మన సంస్కృతి, మన సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా మరింత గర్వంగా నిలవాలని అన్నారు కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, జిల్లా కౌన్సిల్ మెంబెర్ ఆకుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బల్ల శ్రవణ్, ఉపాధ్యక్షులు అంకరి రాజేందర్,ఓబీసీ మోర్చా అధ్యక్షులు సాగర్ల రవి, కార్యదర్శి సంతోష్, పోచన్న, బీజేవైఎంనాయకులువెంకటేష్,రాకేష్,చంటి,శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు



## తెలంగాణ సామాజిక స్వరూపం, విశిష్టతను కాపాడుకోవాలి



- **ప్రిన్సిపల్ జన్ను విజయ్ కుమార్**

**మహాదేవపూర్ జూన్ 02మనం న్యూస్:** మహాదేవపూర్ మండలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ జన్ను విజయ్ కుమార్ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమం నుంచి 2001-2014 మధ్య జరిగిన మలిదశ ఉద్యమం వరకు ఎందరో విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలునిర్విరామంగా పోరాడారని,అనేక మంది చేసిన ప్రాణత్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంఆవిర్భవించిందనిపేర్కొన్నారు.త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని, అభివృద్ధిని, సామాజిక స్వరూపాన్ని మరియు విశిష్టతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు.అలాగే, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కాళేశ్వర దేవస్థాన పరిధిలో గత 12 రోజులుగా నిర్వహించిన సరస్వతీ నది అంత్య పుష్కరాల సందర్భంగావిచ్చేసినఅశేషభక్తజనానికి ఇబ్బందులు కలగకుండా సేవలుఅందించారనితెలిపారు. వారిసేవలకుగుర్తింపుగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ ప్రశంసించడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జన్ను విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ఈమాధవి తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందివాలంటీర్లనుఅభినందించారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**మహాదేవపూర్ జూన్ 02మనం న్యూస్:** మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వాతి, వార్డు సభ్యులు మనక్క దేవిక, తేజస్విని, ఉపాధ్యాయులు సదయ్య, మాజీ సర్పంచ్ సునీత-సురేందర్, ఫీల్ అసిస్టెంట్ వెంకటేష్, అంగన్వాడీ టీచర్లుళ, ఆశా వర్కర్ స్వరూపతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# గ్రామసభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- **జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించాలి**
- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు**

**హనుమకొండ జూన్ 02(మనం ప్రతినిధి):** గ్రామ సభల ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామ సభలను విజయవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, డీజీపీ సి.వి. ఆనంద్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య తదితర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి , అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇతర అధికారులతో కలిసి కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ,₹ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం చివరి దశకు చేరుకుందని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కార్యక్రమం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్లలో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం అమలులో ఉన్న పర్యావరణ కార్యక్రమాలకు అదనంగా ఈ సభలను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సభలలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన



కల్పించాలని, ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేయాలని సూచించారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిని కూడా గ్రామ సభలలో చర్చించాలని తెలిపారు. నాలుగు రోజుల వ్యవధిలో జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. భారీ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పై కొంత వ్యతిరేక ప్రచారం జరుగుతోందని, దీనిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామ సభలలో పంటల మార్పిడి విధానం పై వ్యవసాయ శాఖ విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, కలెక్టర్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాబోయే ఖరీఫ్ సీజన్కు సంబంధించి ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎరువుల బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువుల నిల్వలు, డీలర్ల గోదాములపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. -పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య మాట్లాడుత రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో మురుగు కాల్వల శుభ్రత, తాగునీటి పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కల పెంపకం కార్యక్రమాలు, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్పిట్ల నిర్మాణంపై గ్రామసభలలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రణాళికలను కూడా గ్రామసభల్లో వివరించాలని సూచించారు.

## జిపి కార్మిక సిబ్బందికి యూనిఫామ్, షోస్ సోప్ కిట్ పంపిణీ

**మహాదేవపూర్ జూన్ 02 మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం గ్రామపంచాయతీ ఆవరణంలో జెండాఎగరవేసిన సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ జెండాను ఎగరవేయడం జరిగింది,ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కేవలం ఒక రాజకీయ ఉద్యమం మాత్రమే కాదు ప్రజల ఆధ్వర్యంలో సాబీమానం మరియు హక్కులకోసంకొనసాగిన మహాపోరాటం విద్యార్థులుఉద్యోగులు రైతులు పిల్లలు మరియు విద్యా వర్గాల ప్రజల ఉద్యమంలో పాల్గొనితమవంతుపాత్రపోషించారు వారి త్యాగాలు తెలంగాణ రాష్ట్రంఆవిర్భావాన్నిపునాదిఅయ్యాయి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం మా పోరాట స్ఫూర్తిని త్యాగాలను మరియు సాధించిన విజయాలను గుర్తు చేసే ప్రత్యేక సందర్భం ఈరోజు తెలంగాణ ప్రజల ఐక్యతను ఆత్మ గౌరవానికి మరియు అభివృద్ధి సంకల్పానికి



ప్రతీకగానిలుస్తుందిఈకార్యక్రమంలోఉపసర్పంచ్ శ్రీజ సంతోష్ పాలకవర్గ సభ్యులు గడ్డం స్వామి చీర్లవంచ చంద్రశేఖర్ పూసల హరీష్ నల్ల బుగ్గ సమ్మయ్య కొండపల్లి రాములు బల్ల పద్మ మహమ్మద్ బిన్ అలీ మహమ్మద్ నయుమద్దీన్ అస్రార్ ఖురేషి మరియు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇర్షాద్ భాయ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ వెంకట్ రమణ డాక్టర్ అయుబద్దీన్ మెరుగు లక్ష్మణ్ జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సింధూ శుభారంభం.. అసలు గండం ముందుంది!

ఇండోనేషియా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్, తెలుగుతేజం పీవీ సింధు శుభారంభం చేసింది. టోర్నీలో భాగంగా మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ లో సింధూ 25-23, 21-16తో థాయ్ లాండ్ కు



చెందిన బుసానన్ ఒంగ్బ్రాముంగ్ఫాన్ ను మట్టికరిపించిది. 51 నిమిషాల పాటు సాగిన పోరులో సింధూ తన ప్రత్యర్థిపై ఆద్యంతం ఆధిపత్యం కనబరిచింది.

అయితే తొలి గేమ్ హోరాహోరీగా సాగినప్పటికీ, రెండో గేమ్ లో మాత్రం సింధూ తనలోని ఆటను బయటికి తీసి సునాయాస విజయాన్ని అందుకుంది. అయితే రెండో రౌండ్ లో సింధూ.. ప్రపంచ నంబర్ వన్ యాన్ సే యంగ్ ను ఎదుర్కోనుంది. గతవారం సింగపూర్ ఓపెన్ లో యాన్ సే చేతిలో రెండో రౌండ్ లోనే వెనుదిరిగింది.

మరి ఈసారైనా ఆమె గండం దాటి ప్రిక్వార్టర్స్కు చేరుకుంటుందేమో చూడాలి. మిగిలిన మ్యాచ్ ల విషయానికొస్తే మాళవిక బన్సోద్ తొలి రౌండ్ కే పరిమితమైంది. మాళవిక బన్సోద్ 12-21, 10-21తో ఏడో సీడ్ పోర్న్పావీ చోచువాంగ్ చేతిలో ఓటమి చవిచూసింది. ఇక పురుషుల సింగిల్స్ లో కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్లోనే ఇంటిబాట పట్టాడు.

తొలి రౌండ్ లో శ్రీకాంత్ 19-21, 15-21తో జపాన్ కు చెందిన యుషి తనాకా చేతిలో చిత్తయ్యాడు. డబుల్స్ మ్యాచ్ ల విషయానికొస్తే హరిహరన్-ఎంఆర్ అర్జున్ ద్వయం రెండో రౌండ్ లో అడుగుపెట్టింది.

# అయ్యో బాబోయ్.. ఫ్రాంచైజ్ క్రికెట్..!

ప్రస్తుతం క్రికెట్ లో టీ20 లీగ్ ల హవా నడుస్తోంది. ఫ్రాంచైజీ క్రికెట్ వేగంగా విస్తరిస్తోంది. ఈ పరిణామాలపై ఐసీసీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఐపీఎల్ తో పాటు, ఎస్ఏ20, ఐఎల్ టీ20, బిగ్ బాష్ లీగ్, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్, లంక ప్రీమియర్ లీగ్, ది హండ్రెడ్, కరేబియన్ ప్రీమియర్ లీగ్ వంటి టోర్నమెంట్లు క్రికెట్ క్యాలెండర్ లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమిస్తున్నాయి. వీటికితోడు ఈ ఏడాది చివర్లో యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ సైతం ప్రారంభం కానుంది.

**ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు ఐసీసీ ఆమోదం**

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత వ్యవస్థకు భంగం కలగకుండా ఫ్రాంచైజీ క్రికెట్ అంతర్జాతీయ క్యాలెండర్ తో కలిసి ఎలా కొనసాగగలదో పరిశీలించడానికి ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు ఐసీసీ ఆమోదం తెలిపింది. దేశీయ లీగ్ల విస్తరణ ద్వైపాక్షిక ఒప్పందాలు, ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ పై ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో ఐసీసీ స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది.

'ఫ్రాంచైజ్ క్రికెట్ విస్తరణపై బోర్డు ఆందోళన వ్యక్తంచేసింది. అంతర్జాతీయ క్యాలెండర్ తో ఫ్రాంచైజ్ క్రికెట్ ను సమన్వయం చేయడం కోసం ఒక కమిటీని ఏర్పాటుచేయాలని తీర్మానించింది' అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఫ్రాంచైజీ టోర్నమెంట్లకు పెరుగుతున్న ప్రాముఖ్యాన్ని గుర్తిస్తూనే, అంతర్జాతీయ క్రికెట్ ను పరిరక్షించగల యంత్రాంగాలను కొత్తగా ఏర్పడిన కమిటీ అన్వేషించనుంది.

ఆటగాళ్ల లభ్యత, జాతీయ బాధ్యతలు, ఫ్రాంచైజ్ క్రికెట్ మధ్య సమతుల్యం సాధించడానికి ఈ నియంత్రణ సంస్థ చాలాకాలంగా పోరాడుతోంది. అంతర్జాతీయ బాధ్యతలకు ప్రాధాన్యం ఉండేలా చూసుకుంటూనే, ఒక సీజన్ లో ఒక ఆటగాడు పాల్గొనగల లీగ్ ల సంఖ్యపై పరిమితి విధించాలనే ప్రతిపాదనలపై ఐసీసీ కమిటీల్లో గతంలోనూ చర్చలు జరిగాయి.

ఫ్రాంచైజ్ క్రికెట్ వల్ల ముఖ్యంగా చిన్న దేశాల క్రికెట్ బోర్డ్ లు ఇబ్బందిపడుతున్నాయి. అక్కడ ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్ కంటే ఫ్రాంచైజీ క్రికెట్ ను లాభదాయకమైన, నిలకడైన కెరీర్ మార్గంగా భావిస్తుండటమే దీనికి కారణం. ఇటీవల సంవత్సరాల్లో, పలువురు ప్రముఖ ఆటగాళ్లు ఫ్రాంచైజీ అవకాశాలపై దృష్టిపెట్టడానికి అంతర్జాతీయ క్రికెట్ కు దూరమయ్యారు. వెస్టిండీస్ బ్యాటర్ నికోలస్ పూరన్ 30 ఏళ్లు నిండకముందే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. అలాగే దక్షిణాఫ్రికాకు చెందిన హెన్రిచ్ క్లాసెన్ సైతం జాతీయ జట్టు బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. వెస్టిండీస్ మాజీ స్పిన్నర్ సునీల్ నరైన్ కూడా తన జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం కంటే ఫ్రాంచైజీ బాధ్యతలకే తన కెరీర్ లో ఎక్కువ భాగం ప్రాధాన్యమిచ్చిన విషయం తెలిసిందే.

కొత్త లీగ్ లు పుట్టుకొస్తుండటంతో పాటు, ఇప్పటికే ఉన్న టోర్నమెంట్లు విస్తరిస్తున్నాయి. దీంతో అనియంత్రిత ఫ్రాంచైజీ క్యాలెండర్ ద్వైపాక్షిక క్రికెట్ ను మరింత బలహీనపరుస్తుందని, ఎఫ్టీపీ కింద షెడ్యూలింగ్ను క్లిష్టతరం చేస్తుందని ఐసీసీ ఆందోళన వ్యక్తంచేస్తోంది. అయితే దీనికి భారత్ మినహాయింపుగా నిలుస్తోంది. బీసీసీఐ తన కాంట్రాక్ట్, ఫస్ట్-క్లాస్ క్రికెటర్లను విదేశీ టీ20 లీగ్ లలో పాల్గొనకుండా నిషేధిస్తోంది.



# గెలిచి నిలిచిన యువ భారత్

సెమీఫైనల్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్ లో భారత పురుషుల యువ హాకీ జట్టు సత్తా చాటింది. ఆసియా కప్ అండర్-18 టోర్నమెంట్ లో భాగంగా భారత జట్టు రెండో విజయం నమోదు చేసింది. దక్షిణ కొరియా జట్టుతో సోమవారం జరిగిన పూల్ 'ఎ' మ్యాచ్ లో కేతన్ కుశ్వహా సారథ్యంలోని భారత బృందం 4-1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున వరీందర్ సింగ్ (5వ నిమిషంలో), షారుఖ్ అలీ (54వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... కెప్టెన్ కేతన్ (3వ, 36వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించాడు. కొరియా జట్టుకు యున్ జేహైక్ (21వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. భారత జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్ లు లభించింది. ఇందులో రెండింటిని భారత్ సద్వినియోగం చేసుకొని, మూడింటిని వృథా చేసుకుంది. కొరియా జట్టు తమకు లభించిన రెండు పెనాల్టీ కార్నర్ లలో ఒక దానిని గోల్ గా మలిచి, మరో దానిని వృథా చేసింది. ఐదు జట్లున్న పూల్ 'ఎ'లో భారత్ మూడు మ్యాచ్ లు పూర్తి చేసుకుంది. రెండు మ్యాచ్లో గెలిచి, ఒక మ్యాచ్ లో ఓడి ఆరు పాయింట్లతో కొరియా, జపాన్ జట్లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది. రేపు జరిగే చివరి లీగ్ మ్యాచ్ లో చైనీస్ తైపీతో భారత్ తలపడుతుంది. లీగ్ మ్యాచ్ లు ముగిశాక పూల్ 'ఎ'... పూల్ 'బి'లలో టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్ కు అర్హత సాధిస్తాయి.




# ఆర్సీబీ బ్యాటర్‌పై సస్పెన్షన్ వేటు

ఆర్సీబీ బ్యాటర్ టిమ్ డేవిడ్ పై వేటు పడింది. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ లో లెవల్ 1 ఉల్లంఘన చేసినందుకు గాను బీసీసీఐ అతడికి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించింది. 2 డీమెరిట్ పాయింట్లు అతడి ఖాతాలో వేసింది. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో టిమ్ డేవిడ్ అంపైర్ నితిన్ మీనన్ వైపు ఐస్ బ్యాగ్ ను ప్రమాదకరంగా విసిరినట్లు తేలింది. డేవిడ్ తన తప్పును ఒప్పుకొని, మ్యాచ్ రెఫరీ జవగల్ శ్రీనాథ్ విధించిన శిక్షను అంగీకరించాడు. ఇప్పటికే అతడి ఖాతాలో 3 డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి. ప్రస్తుతం మొత్తంగా 5 పాయింట్లకు చేరడంతో 2027లో ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటు పడింది. వచ్చే సంవత్సరం ఆర్సీబీ మొదటి మ్యాచ్ ను టిమ్ డేవిడ్ ఆడలేడు.

# ఆ వార్తలపై క్లారిటీ ఇచ్చిన నాని టీమ్..!

న్యాచురల్ స్టార్ నాని ప్రస్తుతం తన కెరీర్ లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్ అయిన 'ది ప్యారడైజ్' షూటింగ్ తో బిజీగా ఉన్నాడు. నటుడిగానే కాకుండా, తన సొంత నిర్మాణ సంస్థ 'వాల్ పోస్టర్ సినిమా' బ్యానర్ పై ఆయన వరుసగా సినిమాలు నిర్మిస్తున్నాడు. ఈ బ్యానర్ లో వచ్చిన కోర్ట్ రూమ్ డ్రామా 'కోర్ట్' విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా కమర్షియల్ గానూ పెద్ద విజయం సాధించింది.

అయితే, నాని నెక్స్ట్ నిర్మాణ చిత్రం గురించి తాజాగా సోషల్ మీడియాలో కొన్ని వార్తలు వచ్చాయి. 'బ్యాండ్ మేళం' దర్శకుడు సతీష్ జవ్వాజి చెప్పిన కథ నానికి బాగా నచ్చిందని, ఆయనతో సినిమా చేయడానికి నాని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ప్రచారం జరిగింది. కానీ, ఈ వార్తలపై వాల్ పోస్టర్ సినిమా నిర్మాణ సంస్థ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, అవన్నీ అవాస్తవాలని స్పష్టం చేసింది. మీడియా సంస్థలు ఇలాంటి నిజం లేని వార్తలను ప్రచారం చేయవద్దని కోరింది.

ఇక నాని సినిమాల విషయానికి వస్తే, ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'ది ప్యారడైజ్' షూటింగ్ పూర్తయిన వెంటనే, సుజీత్ దర్శకత్వంలో రాబోయే 'బ్లడీ రోమియో' సినిమా షూటింగ్ లో పాల్గొననున్నాడు. నాని ప్రొడక్షన్ లో రాబోయే నెక్స్ట్ సినిమాల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.



# మరోసారి ఆమెతో ప్రభాస్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'స్పిరిట్' ప్రస్తుతం హైదరాబాద్ లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇటీవలే ఇక్కడి విమల్ థియేటర్ ఓపెన్ గ్రౌండ్ లో ఎలాంటి లీకులు రాకుండా అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు.

ఈ షెడ్యూల్ లో సీనియర్ నటి నదియా కూడా జాయిన్ అయ్యింది. 2013లో సూపర్ హిట్ మూవీ 'మిర్చి' తర్వాత మళ్లీ ప్రభాస్ తో కలిసి ఆమె నటిస్తుండటం విశేషం. ప్రస్తుతానికి ఆమె పాత్ర వివరాలను సస్పెన్స్ గా ఉంచినప్పటికీ, ఈ 'మిర్చి' కాంబినేషన్ మళ్లీ రిపీట్ కావడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ విలన్ గా, తృప్తి దిమ్రి హీరోయిన్ గా నటిస్తున్నారు. టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ 2027 మార్చి 5న గ్రాండ్ గా విడుదల కానుంది.

రామ్ చరణ్ తో కలిసి 'పెద్ది'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి జాన్వీకపూర్. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రం ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జాన్వీ.. బాలీవుడ్, టాలీవుడ్ లలో షూటింగ్ గురించి మాట్లాడారు. టాలీవుడ్ లో క్రియేటివిటీకి, పని గంటలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని ఆమె

# బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు తేడా అదే.. : జాన్వీ

ప్రశంసించారు. ''సౌత్ సినిమా సెట్స్ లో అందరిలో ఒకరకమైన ఆసక్తి ఉంటుంది. అక్కడ కేవలం ఓ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనో, డెడ్ లైన్లను అందుకోవాలనో మాత్రమే పనిచేయరు. సినిమాలోని ప్రతి సీన్ అద్భుతంగా రావాలనే ప్రయత్నిస్తుంటారు. దానికోసం ఎంత సమయమైనా కేటాయిస్తారు. హిందీ సినిమా విషయానికి వస్తే అక్కడ ఎక్సెల్ షీట్లకు (బడ్జెట్, టైమ్ లైన్స్) ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అంతా రూల్ ప్రకారం, పక్కా ప్రణాళికతో జరుగుతుంది. కొన్నిసార్లు ఈ అతి జాగ్రత్త వల్ల క్రియేటివిటీ విషయంలో రాజీపడాల్సి వస్తుంది. అయితే, అలా పక్కాగా ఉండటం వల్ల కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి'' అని జాన్వీ అన్నారు. చర్చనీయాంశమైన వర్కింగ్ అవర్స్ గురించి కూడా ఆమె ఇటీవల మాట్లాడిన విషయం తెలిసిందే. ''తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిఒక్కరి పని గంటలను గౌరవించే విధానం నాకు బాగా నచ్చింది. కేవలం నటీనటులకే కాదు, టెక్నీషియన్లు అందరికీ సరైన బ్రేక్స్ ఇస్తారు. లంచ్ బ్రేక్ అంటే అందరూ 40 నిమిషాలు తిని, మరో 20 నిమిషాలు నిద్రపోయి మళ్లీ ఫ్రెష్ గా పనిలోకి వస్తారు. కానీ బాలీవుడ్ లో ఒక్కోసారి ఈ విషయంలో కూడా రాజీపడాల్సి వస్తుంది'' అని చెప్పారు. ఇక ఈ వ్యాఖ్యలపై రామ్ చరణ్ స్పందిస్తూ.. బాలీవుడ్ లో సినిమాలు చాలా వేగంగా పూర్తి చేస్తారని, ఆ విషయంలో హిందీ పరిశ్రమను మెచ్చుకోవాలన్నారు. 'పెద్ది' 285 రోజులు షూట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



# విజయ్ బాటలో ధనుష్..



తమిళనాడులో సినిమా రంగానికి, రాజకీయాలకు దశాబ్దాల కాలంగా విడదీయరాని బంధం ఉంది. ఎంజీఆర్, జయలలిత నుంచి నిన్నటి విజయ్ వరకూ ఎంతోమంది సినీ తారలు రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రులుగా, ప్రజా నాయకులుగా సేవ చేశారు. ఈ నేపథ్యంలో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కూడా భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందా అనే చర్చ మళ్లీ తెర పైకి వచ్చింది. దీనిపై ఆయన తండ్రి, ప్రముఖ దర్శకుడు కస్తూరి రాజా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి.

చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న కస్తూరి రాజాను ధనుష్ రాజకీయ ఎంట్రీపై ప్రశ్నించగా, ఆయన ఆ అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమన్నారు. ''రాజకీయాల్లోకి రావాలనుకుంటే ఎవరికైనా ఆ హక్కు ఉంటుంది. భవిష్యత్తులో నా కుమారులు మాత్రమే కాదు, నా మనవళ్లు కూడా ఆ మార్గాన్ని ఎంచుకోవచ్చు'' అని అన్నారు. దీంతో ఆయన సమాధానం ధనుష్ అభిమానుల్లో, రాజకీయ వర్గాల్లో సరికొత్త ఊహాగానాలకు తావిచ్చింది. ఇదే వేదికపై తన కుటుంబ సినీ ప్రయాణాన్ని, పడిన కష్టాలను కస్తూరి రాజా గుర్తుచేసుకున్నారు. ధనుష్ అసలు పేరు వెంకటేష్ ప్రభు అని, సినిమాల్లోకి వచ్చిన తర్వాతే ఆ పేరు మార్చుకున్నాడని తెలిపారు. ''విమానాశ్రయాల్లో లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో మా అబ్బాయిని అందరూ 'ధనుష్ కె. రాజా' అని పిలుస్తుంటే నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా అనిపిస్తుంది'' అని చెప్పారు. ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో ధనుష్ తన 55వ సినిమాలో నటిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.